అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 26-10-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 297 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

ధాన్యం సేకరణలో జాప్యం



పంజాబ్‌లో ఎస్కేఎం ఆందోళన..

పలుచోట్ల రోడ్లు దిగ్బంధం

హోం మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ చర్చలు

వివరాలు 6లో



డీఏ లేదు...

317 జీవో నివేదికా లేదు

ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ..ఆశలన్నీ నేటి క్యాబినెట్‌పైనే

సీఎస్‌తో ఉద్యోగ జేఏసీ సమావేశం

317 జీవో సమస్యలను పరిష్కరించాలి : మారం జగదీశ్వర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం సాయంత్రంలోగా కరువు భత్యం (డీఏ) ప్రకటన వస్తుందని ఆశించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నిరాశే ఎదురైంది. ఇంకోవైపు శుక్రవారం 317 జీవో నివేదికను ఇస్తామంటూ ప్రకటించినా అదీ అమలుకు నోచుకోలేదు. అటు డీఏ ప్రకటన చేయకపోవడం, ఇటు 317 జీవో నివేదికను ఇవ్వకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్యోగ జేఏసీ నేతలు ...6లో



ఒకే పోలీస్ విధానం కావాలి

బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యల ఆందోళన

సచివాలయం ముట్టడికి యత్నం

పిల్లలతో వందలాది మంది రాక

అరెస్టులు, తరలింపు 15లో..

సెలవుల రద్దు ఆదేశాలు తాత్కాలికంగా నిలిపివేత



వాట్ ఈజ్ దిస్..

బాధ్యత కలిగిన పదవిలో ఉండి అలాంటి వ్యాఖ్యలు తగవు

కేటీఆర్ పరువునష్టం 8లో.. దావా కేసులో మంత్రి కొండా సురేఖపై నాంపల్లి కోర్టు అసహనం

మోడీ ప్రజలకు


చేసిందేం లేదు

పార్టీలను చీల్చడం, భావోద్వేగాలతో రాజకీయం చేయడం తప్ప...

- హైదరాబాద్‌లో గాంధీ ఐడియాలజీ సెంటర్ ఏర్పాటు
- పటేల్ విగ్రహంలా బాపూఘాట్‌లో గాంధీ విగ్రహం
- దక్షిణాది రాష్ట్రాలపై ఎన్డీయే సర్కార్ వివక్ష : ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రధాని మోడీ దేశ ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి విమర్శించారు. పార్టీలను చీల్చడం, భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం తప్ప ఆయన హయాంలో దేశంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. భారతదేశంలో ఉత్తర, దక్షిణ భారతదేశాలు అనే విభజన తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారంనాడిక్కడ జరిగిన ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించారు. కాంగ్రెస్ హయాంలో అనేక ప్రాజెక్టులు నిర్మాణమయ్యాయని వివరించారు. దేశంలో కాంగ్రెస్, యూపీఏ హయాంలో అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. గతంలో ఉత్తర భారతదేశం నుంచి ప్రధాని అయితే, దక్షిణ భారతం నుంచి రాష్ట్రపతిని చేసే సంప్రదాయాన్ని కాంగ్రెస్ పాటించిందనీ, ప్రధాని మోడీ ఈ సంప్రదాయాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో దక్షిణాది నుంచి పెద్ద ఎత్తున పన్నులు తీసుకుంటున్నారనీ, కానీ తిరిగి ఇస్తున్నది చాలా స్వల్పమని చెప్పారు. కేంద్రానికి దక్షిణాది రాష్ట్రాల నుంచి ఒక రూపాయి పంపిస్తే, కేవలం 40 పైసలు మాత్రమే తిరిగి వెనక్కి వస్తున్నాయన్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి పన్నుల ద్వారా కేంద్రానికి రూపాయి వెళ్తే ఏడు రూపాయలు, బీహార్‌కు రూ.6 వెనక్కి వస్తున్నాయని ఉదహరించారు. హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ ఐడియాలజీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈసా, మూసా నదులు కలిసే చోట



బాపూ ఘాట్ ఉన్నదనీ, గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహంలా బాపూఘాట్‌లో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూసీ పునరుజ్జీవాన్ని, బాపూ ఘాట్ అభివృద్ధిని బీఆర్ఎస్, బీజేపీ వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ నిర్మించుకున్నారనీ, తాము మూసీ పునరుజ్జీవం చేస్తామంటే ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రాడార్, ఇరిగేషన్ ప్రాజెక్టులతో తెలంగాణ పురోగతి సాధించి గుజరాత్‌కు పోటీ ఇస్తుందనే భయం బీజేపీకి ఉందనీ, దానికి బీఆర్ఎస్ వత్తాసు పలుకుతున్నదని అన్నారు. పదేండ్లు ప్రభుత్వాన్ని నడిపిన మాజీ సీఎం కేసీఆర్ పదిసార్లు కూడా సెక్రెటేరియట్‌కు రాలేదనీ, ప్రతిపక్ష హోదా ఇస్తే పది నిమిషాలు అసెంబ్లీలో కూర్చుని వెళ్లిపోయారని విమర్శించారు. ఆయనకు ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. ఆయనకు ప్రజలు ఇచ్చిన తీర్పు నచ్చకుంటే ఇంట్లో కూర్చోవాలనీ, ప్రభుత్వాన్ని పనిచేయనివ్వాలని ...3లో

నేడు మంత్రివర్గం భేటీ

రైతు రుణమాఫీ, రైతు భరోసాపైనే ప్రధాన చర్చ

సంక్షేమ, అభివృద్ధి పథకాలపై కసరత్తు 3లో..

నవంబర్‌లోగా క్రీడా పాలసీ

త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లు

రాబోయే రెండేండ్లలో రాష్ట్రంలో నేషనల్ గేమ్స్ : ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర క్రీడా విధానానికి (స్పోర్ట్స్ పాలసీ) సంబంధించిన తుది ముసాయిదా (ఫైనల్ డ్రాఫ్ట్)ను నవంబరు నెలాఖరులోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర క్రీడా పాలసీపై శుక్రవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ పాలసీ రూపొందించేందుకు నిపుణులు, క్రీడాకారులతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరపాలని సూచించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న క్రీడా వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనీ, ఇప్పటికే ఉన్న స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాలని పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించిన బిల్లు ...3లో

మూసీపై త్వరలో అఖిలపక్షం



మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మూసీ పునరుజ్జీవనంపై ప్రభుత్వం త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారంనాడాయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సియోల్‌లో హన్ రివర్‌ని ఎలా అభివృద్ధి చేశారో అధ్యయనం చేశామనీ, దానివల్ల సియోల్ రూపురేఖలే మారిపోయాయని ...3లో



వికలాంగుల హక్కులకు

కేంద్ర సర్కార్ తూట్లు

ఉమ్మడి పెన్షన్ కోసం ఫిబ్రవరి 10న ఢిల్లీలో భారీ సభ

ఎన్నికల ముందిచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి : ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ మురళీధరన్

గత సర్కార్ వికలాంగుల శాఖను విధ్వంసం చేసింది : వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య

ఘనంగా ప్రారంభమైన ఎన్‌పీఆర్‌డీ 4వ రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ బ్యూరో హైదరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వికలాంగుల హక్కులను కాలరాస్తున్నదని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ప్రధాన కార్యదర్శి ఆర్.మురళీధరన్ విమర్శించారు. ఆ సంఘం తెలంగాణ 4వ రాష్ట్ర ...15లో

మూసీ పక్కన పేదల ఇండ్లల్లో ఉంటాం

సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం



ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు..పేదల ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకం : కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ అధినేత అల్లుడికి దోచిపెట్టేందుకే ఈ ప్రాజెక్టు : కేంద్ర మంత్రి బండి సంజయ్

బాధితుల గోడు వింటుంటే కండ్లల్లో నీళ్లొస్తున్నయ్ : ఎంపీ ఈటల

ఓవైసీ బిల్డింగ్‌లు ఎందుకు కూల్చడం లేదు : ఎల్పీనేత ఏలేటి 15లో..

ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్‌లో మూసీ బాధితుల పక్షాన బీజేపీ ధర్నా

టార్గెట్ మహిళలే..నమ్మితే ముంచుడే

రుద్ర టెక్నాలజీ బాగోతం

ఒక్కొక్కరి దగ్గర రూ.300 వసూలు

వాట్సాప్ డీపీల ద్వారా ఆదాయమంటూ వల

నెలకు ఐదారు వేలంటూ నమ్మబలుకుతున్న వైనం

హైదరాబాద్, వరంగల్‌లో బాధితులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఇంట్లోనే కూర్చొని ఆదాయం పొందాలనుకుంటున్నారా? రోజుకు పావుగంట కష్టపడి నెలకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు సులభంగా సంపాదించాలనుకుంటున్నారా? వాట్సాప్‌లో రోజుకు పావుగంట పనిచేయండి..ప్రతిరోజూ స్టేటస్ పెట్టండి..ఆదాయం పొందండి..' అంటూ మహిళలే టార్గెట్‌గా రుద్ర టెక్నాలజీస్ అనే పేరుతో హన్మకొండ, వరంగల్ జిల్లాల్లో ఓ సంస్థ పనిచేస్తున్నది. ఆ సంస్థ టార్గెట్ మహిళలే. నమ్మితే నట్టేట ముంచుడే. ఇంట్లో కూర్చొని ఈజీగా సంపాదించొచ్చు గదా..ఐడీ ఫీజు 300 రూపాయలే కదా అని గృహిణీలు రుద్ర సంస్థకు చెందిన 93813 77375 నెంబర్‌కు అమౌంట్ స్కాన్ చేసి జాయిన్ అయిపోతున్నారు. ఒకరు మరొకరిని..మరొకరు ఇంకొకరిని... ఇలా తెలిసిన మహిళలంతా గొలుసుకట్టుగా వందల సంఖ్యలో ఆ సంస్థలో చేరిపోతున్నారు. నెల తర్వాత తాము మోసపోయామని గ్రహిస్తున్నారు. రూ.300లే కదా అని లైటుగా తీసుకుంటున్నారు. కానీ, ఒకొక్కరి దగ్గర రూ.300 చొప్పున ఎంత మంది దగ్గర వసూలు చేశారో తెలియాల్సి ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేయడానికి మాత్రం బాధిత మహిళలు ముందుకు రావడం లేదు. అయితే, తమలా మరికొంతమంది మోసపోవద్దని నవతెలంగాణ ద్వారా వేడుకుంటున్నారు.

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి రుద్ర టెక్నాలజీ అనే ఒక సంస్థ పనిచేస్తున్నది. డిజిటల్ మార్కెటింగ్ ద్వారా ఆయా సంస్థల ప్రొడక్ట్‌లను ఆ సంస్థ ప్రమోట్ చేస్తున్నది. రూ.300 కడితే రిజిష్టర్ నెంబర్ ఇస్తున్నది. ప్రతి ఒక్కరూ తన ఐడీ ద్వారా కనీసం ఐదుగురిని చేర్చాలనీ, ఇష్టం లేకుంటే చేర్పించాల్సిన ...6లో

పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన

మార్కెట్‌లో అన్నదాతకు దక్కని మద్దతు ధర | తేమపై పేచీతో తొలిరోజే నిలిచిన కొనుగోళ్లు

ముందుకురాని వ్యాపారులు, అధికారులు

ఆదిలాబాద్, వరంగల్ ఎనుమాముల మార్కెట్లలో రైతుల ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి/కాశిబుగ్గ

ఆదిలాబాద్, వరంగల్‌లలో పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన నెలకొంది. మార్కెట్‌లో కనీసం ప్రభుత్వ మద్దతు ధర కూడా దక్కకపోవడంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. వ్యాపారులు, అధికారుల తీరుతో ఆక్రోశం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. పత్తిలో తేమ అధికంగా ఉందని కొనుగోళ్లకు సీసీఐ నిరాకరించడం, వ్యాపారులు ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా నిర్ణయించడంతో ..పత్తితో మార్కెట్‌కు వచ్చిన అన్నదాతలు అగచాట్లు పడాల్సిన పరిస్థితి తలెత్తింది.

ఆదిలాబాద్ జిల్లాలో కొనుగోళ్లు ప్రారంభించిన తొలిరోజే పత్తి విక్రయాలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులు, వ్యాపారులు, రైతుల సమక్షంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. సీసీఐ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521 ఉండగా.. ప్రయివేటు వ్యాపారులు తొలుత రూ.6900 నుంచి ప్రారంభించి రూ.7150 వద్ద ముగించారు. దాంతో ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర కూడా వ్యాపారులు కల్పించకపోవడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కాంటాల వద్ద పూజలు నిర్వహించి కొనుగోళ్లను ప్రారంభించారు. అనంతరం మొదటి ట్రాక్టర్‌లో పత్తిని తేమ పరికరంతో నాలుగు వైపులా పరిశీలించగా.. ఒక్కో భాగంలో ఒక్కో రీతిలో చూపించింది. అధికంగా 50 శాతం చూపించడంతో సీసీఐ అధికారులు కొనుగోలుకు నిరాకరించారు. నిబంధనల ప్రకారం 8 నుంచి 12శాతం లోపు తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని, అంతకుమించితే కొనుగోలు చేయడం కుదరదని స్పష్టం చేశారు. ఇక ప్రయివేటు వ్యాపారులు ధర తక్కువగా నిర్ణయించడంతో రైతులు విక్రయించేందుకు ముందుకు రాలేదు.



ఏనుమాముల మార్కెట్‌లో పత్తి రైతుల ఆందోళన

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర రావడం లేదంటూ శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో పత్తి రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ నెల ప్రారంభంలో పత్తికి క్వింటల్ ధర రూ.8250 చెల్లించిన వ్యాపారులు క్రమంగా ధరలు తగ్గించడం ప్రారంభించారు. దాంతో రైతులు, రైతు సంఘాల నాయకుల ఆందోళన మేరకు నాలుగు రోజుల క్రితం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సీసీసీ కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. దాంతో పత్తి రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర ...15లో

తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలి : రైతులు

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అద్దె వాహనాల్లో పత్తిని తీసుకొచ్చిన రైతులు తొలిరోజున ధరలో తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో విక్రయించేందుకు అంగీకరించలేదు. రెండు రోజుల క్రితమే వర్షాలు కురిశాయని, వాతావరణంలో సహజంగానే తేమ ఉంటుందని, తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని పట్టుబట్టారు. ఇందుకు అధికారులు, వ్యాపారులు అంగీకరించకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. రాత్రి 7గంటల వరకు కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ఈ సందర్భంగా కలెక్టర్ పలుమార్లు అధికారులు, వ్యాపారులతో చర్చలు జరిపినప్పటికీ సఫలం కాలేదు. కలెక్టర్ వాహనాన్ని బయటకు వెళ్లనీయకుండా రైతులు అడ్డగించారు. వాహనం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. సాయంత్రం వరకు చర్చలు ఎటూ తేలకపోవడంతో మార్కెట్ నుంచి స్థానిక పంజాబ్‌చౌక్ వరకు వెళ్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పోలీసులు వారిని సముదాయించినా వినిపించుకోలేదు. కొందరు అక్కడే ఉండి నిరసన ...15లో

గ్రూప్-1 మెయిన్స్‌లో కాపీయింగ్

చీర కొంగులో చిట్టీలు చుట్టుకొచ్చిన అభ్యర్థి

నవతెలంగాణ-ఆదిబట్ల

గ్రూప్-1 మెయిన్స్‌లో కాపీయింగ్ పాల్పడుతూ ఓ అభ్యర్థి దొరికింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపాల్టీ మంగల్‌పల్లి గ్రామం సమీపంలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం చోటు చేసుకుంది. నిరుద్యోగుల ఆందోళనలు, నిరసల తర్వాత న్యాయస్థానాల క్లియరెన్స్‌తో తెలంగాణలో మొదటిసారి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఈ నెల 21 నుంచి ...15లో

భళా బీఎస్ఎన్ఎల్..

కొత్తగా 55 లక్షలకు పైగా ఖాతాదారుల చేరిక

ప్రయివేటు టెల్కోలకు గుడ్‌బై



ప్రభుత్వ రంగ టెల్కో బీఎస్ఎన్ఎల్‌కు ఆదరణ భారీగా పెరుగుతోంది. ప్రయివేటు టెల్కోలు అడ్డగోలుగా పెంచిన టారీఫ్‌లను వినియోగదారులు భరించలేక.. బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు.

వివరాలు 8లో

పోలీసులకు లొంగిపోయిన మాజీమంత్రి సోదరుడు



ప్రభుత్వ భూమి ఆక్రమణ, తప్పుడు ధ్రువీకరణ పత్రాల కేసులో శ్రీకాంత్ గౌడ్

వివరాలు 15లో

మూడో రోజూ తొమ్మిది గంటలు

అమోయ్ కుమార్‌ను విచారించిన ఈడీ

విచారణకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

భూముల బదిలీల్లో భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల మాజీ కలెక్టర్, ప్రస్తుత పశుసంవర్ధక శాఖ సహాయక కార్యదర్శి అమోయ్ కుమార్‌ను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు 9 గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. మూడోరోజు సైతం ఆయన రంగారెడ్డి జిల్లా నాగారం, అబ్దుల్లాపూర్ మెట్‌లో భూదానయజ్ఞ భూములు, అసైన్డ్ భూములు అక్రమంగా బదలాయింపులు జరిపినట్టు వచ్చిన ఫిర్యాదులపై ప్రధానంగా అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఈ సందర్భంగా ఎవరెవరికి ఈ భూములు బదలాయించారు? అందుకు ఎంతమేరకు వారి నుంచి డబ్బులు వసూలు చేశారు? కొన్నవారు ఎవరు? వారికి ఏ నిబంధనల మేరకు భూముల బదలాయింపులు జరిగాయి? మొదలైన కోణాల్లో అమోయ్ కుమార్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించారని తెలిసింది. అలాగే, అమోయ్ కుమార్ జారీ చేసిన ఆదేశాలను కిందిస్థాయి రెవెన్యూ అధికారులు ఏ ప్రాతిపాదికన అమలు చేశారు? వారు పాటించిన నిబంధనలు ఏమిటనే కోణంలో కూడా ఈడీ అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. అమోయ్ కుమార్ నుంచి కొన్ని పత్రాలనూ సేకరించిన అధికారులు.. అందులో నుంచి కూడా కొన్ని ప్రశ్నలను సంధించినట్టు తెలుస్తున్నది. అమోయ్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై గత మూడ్రోజులుగా నిజానిజాలను తేల్చటానికి ఈడీ అధికారులు తీవ్రంగా కృషి చేశారు. అందులో భాగంగా, చివరి రోజు ఆయనను రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కార్యాలయాలతో పాటు మరికొన్ని ప్రాంతాలకు కూడా తీసుకెళ్లి విచారించారు. అమోయ్ విచారణను దాదాపుగా ముగించిన అధికారులు.. అవసరమైతే భవిష్యత్తులో విచారణకు పిలుస్తాం, అందుబాటులో ఉండాలని ఆదేశించి పంపించారని తెలిసింది. ఈ విచారణలో భాగంగా.. ఈ ఆరోపణలు బయలుదేరిన సమయంలో అమోయ్ కుమార్ పర్యవేక్షణ కింద పని చేసిన కొందరు రెవెన్యూ అధికారులకు కూడా నోటీసులిచ్చి పిలిచేందుకు ఈడీ సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.

విలీనాన్ని వేగవంతం చేయండి

రవాణాశాఖ మంత్రి, ముఖ్యకార్యదర్శికి టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ వినతి

టీఎన్‌జీవో నేతలతో భేటీ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, విలీన ప్రక్రియ అధ్యయనం కోసం నియమితులైన రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్‌లకు శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్‌జీవో) జేఏసీ చైర్మెన్ వీ జగదీశ్వర్, జనరల్ సెక్రటరీ ఏ శ్రీనివాసరావుతో భేటీ అయ్యారు. ఆర్టీసీ విలీన ప్రక్రియపై చర్చించారు. భవిష్యత్ ఆందోళనల్లో టీఎన్‌జీవో సహకారాన్ని అభ్యర్థించారు. సమావేశంలో టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎమ్‌డీ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య సుద్దాల సురేష్, బీ యాదగిరి, ఎమ్‌ఏ మాజీద్, వీ బాబు, జీ రాములు పాల్గొన్నారు.

నగరంలో భారీగా డ్రగ్స్ పట్టివేత

రెండు వేర్వేరు కేసుల్లో ఐదుగురి అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో డ్రగ్స్ సరఫరా అవుతున్నాయన్న సమాచారంతో హైదరాబాద్ నార్కోటెక్ బృందాలతోపాటు కంచన్‌బాగ్, హుమాయూన్ నగర్ పోలీసులు ప్రత్యేక దాడులను కొనసాగించారు. రెండు వేర్వేరు కేసుల్లో కేరళకు చెందిన డ్రగ్స్ సరఫరా దారులతోపాటు మరో ముగ్గురు డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13లక్షల విలువగల 80గ్రాముల ఏండీఏంఏ, 10 ఎల్‌ఎస్‌డీ, మూడు సెల్‌ఫోన్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నగర సీపీ సీవీ ఆనంద్ బంజారాహిల్స్‌లోని సీసీసీలో ఏర్పాటుచేసిన సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. నాంపల్లికి చెందిన ఎండీ ఇమ్రాన్, చందానగర్‌కు చెందిన కె.నవీన్ గంజాకు అలవాటు పడ్డారు. ప్రయివేటు ఉద్యోగాలు చేసే వీరికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో కేరళకు చెందిన నందకుమార్.. బెంగళూర్‌లో ఉంటూ డ్రగ్స్ సరఫరా చేస్తున్న విషయం తెలుసుకున్న నిందితులు అతన్ని సంప్రదించారు. నగరంలో డ్రగ్స్ సరఫరా చేయాలని నిర్ణయించుకున్న వారు.. నందకుమార్ దగ్గర తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు నగరంలో విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న నార్కోటెక్ బృందాలు కంచన్‌బాగ్ పోలీసులతో ప్రత్యేక నిఘా వేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఇమ్రాన్‌పై నాంపల్లి తోపాటు తదితర పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయని, పలుసార్లు జైలుకెళ్లొచ్చాడని సీపీ తెలిపారు.



2016లో స్టుడెంట్ వీసాపై ఇండియాకు..

మరో కేసులో నార్కోటెక్ బృందాలు, హుమాయూన్ నగర్ పోలీసులు ప్రత్యేక నిఘా వేసి ఎండీ అబ్దుల్ రెహమాన్ అనే నిందితుడిని అరెస్టు చేశారు. సుడాన్‌కు చెందిన నిందితుడు 2016లో స్టూడెంట్ వీసాపై ఇండియాకు వచ్చాడు. టోలీచౌకీలో నివాసముంటూ స్పొకెన్ ఇంగ్లీష్ కోర్సు పూర్తిచేశాడు. ఆ తర్వాత 2017లో సుడాన్‌కు వెళ్లిన నిందితుడు తిరిగి 2018లో ఇండియాకు వచ్చాడు. యూపీలో బీసీఏ పూర్తి చేసి తిరిగి సుడాన్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి 2024లో తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన నిందితుడు టోలీచౌకీలో నివాసముంటూ జల్సాలకు అలవాటు పడ్డాడు. డ్రగ్స్‌ను అలవాటు చేసుకుని సరఫరా చేయడం మొదలు పెట్టాడు. సమాచారం అందుకున్న నార్కోటెక్ బృందాలు హుమాయూన్ నగర్ పోలీసులతో కలిసి నిందితుడిని అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు.

నేడు సెక్స్ వర్కర్ల హక్కులపై సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వచ్ఛంద సేవా సంస్థ సాథి సహకారంతో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నేడు సెక్స్ వర్కర్ల హక్కులపై సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 26న హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కన్సల్టేషన్ సమావేశాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ ప్రారంభించనున్నారు.

ప్రజావాణికి 509 అర్జీలు

- దబుల్ బెడ్రూం ఇండ్ల కోసమే ఎక్కువ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి ప్రజావాణి కార్యక్రమానికి 509 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం హైదరాబా ద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపా ధ్యక్షులు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్ వాటిని స్వీకరించారు. అవసరం మేరకు అధికారులకు ఫోన్ చేసి అర్జీదారుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొత్తం 509 ఆర్జీలలో మైనారిటీ సంక్షేమ శాఖకు సంబంధించి 200 అర్జీలు అందాయి. అందులో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసమే ఎక్కువ ఉన్నాయి. రెవెన్యూ శాఖకు 76, విద్యుత్ శాఖకు 57, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 35, ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమానికి ఐదు, ఇతర శాఖలకు సంబంధించి 136 దరఖాస్తులు ప్రజావాణి కార్య క్రమానికి వచ్చాయి.





చలో కొడంగల్...

దిగిరాకుంటే చలో అసెంబ్లీ

సర్కారుకు పాలడుగు భాస్కర్ హెచ్చరిక

సీడీఎమ్ఏ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల భారీ ధర్నా

సమస్యలు పరిష్కరిస్తాం సీడీఎమ్ఏ జేడీ శ్రీనివాసరావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

మున్సిపల్ కార్మికుల సమస్యల్ని తక్షణం పరిష్కరించి, కనీస వేతనం రూ.26వేలుగా ప్రకటించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పాదయాత్రగా చలో కొడంగల్ పేరుతో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామన్నారు. అప్పటికీ సర్కారు దిగిరాకుంటే అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో చలో అసెంబ్లీ పిలుపు ఇస్తామని హెచ్చరించారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారంనాడిక్కడి సీడీఎమ్ఏ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వందలాదిగా తరలివచ్చిన కార్మికులు తమ డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా సీడీఎమ్ఏ ప్రధాన కార్యాలయం కిక్కిరిసిపోయి, నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రెండో పీఆర్సీలో కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాలనీ, అప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్టు రూ.21వేల కనీస వేతనం అమలు చేయాలని కోరారు. కేటగిరీల వారీగా వేతనాలు ఇవ్వాలనీ, 8 గంటల పనివిధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో దాదాపు 65వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎమ్ఆర్, ఫిక్స్‌డ్ పే పద్ధతుల్లో కార్మికులు పనిచేస్తున్నారని వివరించారు.



వారి సర్వీసును క్రమబద్ధీకరించట్లేదనీ, అర్హతలు ఉన్నా పదోన్నతులు ఇవ్వట్లేదని చెప్పారు. మున్సిపల్ కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించట్లేదనీ, కారణాలు అడిగితే 'మీరు మా ఉద్యోగులు కాదు' అని కమిషనర్లు సమాధానాలు చెప్తున్నారన్నారు. అలాంటప్పుడు రోడ్లు, సర్కారు మరుగుదొడ్లను ఎందుకు శుభ్రం చేయించుకుంటున్నారని ప్రశ్నించారు. ఇచ్చే అరకొర జీతంలో పీఎఫ్, ఈఎస్ఐ కట్ చేస్తున్నారనీ, దాన్ని కాంట్రాక్టర్లు సక్రమంగా ఆయా సంస్థలకు జమచేయట్లేదని తెలిపారు. దీనివల్ల కార్మికులు పెన్షన్ సహా ఇతర ఆర్థిక ప్రయోజనాలను నష్టపోతున్నారని చెప్పారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా నర్సింహులు, ఉపాధ్యక్షులు జే వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, కార్యదర్శి పీ సుధాకర్ తదితరులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది కార్మికులు మరణిస్తున్నారనీ, వారికి ఎలాంటి నష్టపరిహారం ఇవ్వట్లేదని అన్నారు. శాశ్వత పనులకు శాశ్వత కార్మికులను నియమించాలని భారత రాజ్యాంగం, సుప్రీంకోర్టు సహా చెప్పినా, రకరకాల పేర్లతో ప్రభుత్వాలు శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. పారిశుద్ధ్య పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికులు అర్ధాయుష్షుతో చనిపోతున్నారనీ, ఆ స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వట్లేదనీ, వాటిని అంగట్లో పెట్టి మేయర్లు, మున్సిపల్ అధికారులు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రతి సంవత్సరం మే, జూన్ మాసాల్లో రెయిన్ కోట్లు, స్వెట్టర్లు, సబ్బులు, కొబ్బరినూనె, బట్టలు ఇతర సామాగ్రి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వారాంతపు శెలవులు ఇవ్వాలనీ, డ్రైవర్ కమ్ ఓనర్ స్కీం ద్వారా చెత్త తరలింపు వాహనాలు ఇచ్చి, ఈఎమ్ఐలు అయిపోయాక ఇక వద్దని చెప్తున్నారనీ, ఇప్పుడు వారెక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. ఆ కార్మికులకు డ్రైవర్లకు ఇచ్చే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అనంతరం ప్రతినిధి బృందం సీడీఎమ్ఏ జాయింట్ డైరెక్టర్ జే శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించింది. ఆయన స్వయంగా ధర్నా చేస్తున్న కార్మికుల వద్దకు వచ్చి మాట్లాడారు. జీహెచ్ఎంసీలో ఇస్తున్నట్టే వెయ్యి రూపాయలు పెంచుతూ ఫిబ్రవరిలో ఇచ్చిన సర్క్యులర్ జిల్లాల్లో అమలు కావట్లేదనీ, దాన్ని 142 మున్సిపాల్టీల్లో అమలు చేసేలా ఉత్తర్వులు ఇస్తామన్నారు. 60 ఏండ్లు నిండి రిటైర్డ్ అయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే సర్క్యులర్‌ను గతంలో ఇచ్చామనీ, కామారెడ్డి సహా పలు మున్సిపాల్టీల్లో ఇది అమలు కావట్లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని పరిష్కరిస్తామన్నారు. ఏపీలో ఇస్తున్నట్టు రూ.21వేలు కనీస వేతనంపై తాను హామీ ఇవ్వలేననీ, అది ప్రభుత్వ విధాన నిర్ణయమని చెప్పారు. పీఆర్సీ కమిటీ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్మికులకు రావల్సిన బకాయిలు చెల్లింపుపై తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ కార్మికులు ఉంటేనే ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమనీ, వారికి సాధ్యమైనంత అధిక ఆర్థిక ప్రయోజనాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నేడు మంత్రివర్గం భేటీ

రైతు రుణమాఫీ, రైతు భరోసాపైనే ప్రధాన చర్చ

సంక్షేమ, అభివృద్ధి పథకాలపై కసరత్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం జరగనున్న భేటీలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, రుణమాఫీ, రైతుభరోసా విధి విధానాలతో పాటు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు, ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు, అవినీతి ఆరోపణలపై కొనసాగుతోన్న విచారణలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. వీటితో పాటు అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ రూపకల్పన, పంటల బీమాపైనా మంత్రుల బందం చర్చించనుంది. ఆగస్టు 15లోగా పంట రుణాల మాఫీ చేస్తామంటూ సీఎం ప్రకటించిన నేపథ్యంలో,ప్రధానంగా ఇదే అంశంపై క్యాబినెట్‌లో చర్చించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. రుణమాఫీకి సుమారు రూ.30వేల కోట్లు, రైతుభరోసాకు మరో రూ.7వేల కోట్లు అవసరమవడంతో, నిధుల సేకరణ ఎలా అనే అంశంపై కేబినెట్‌లో చర్చించి కీలక నిర్ణయం తీసుకోనున్నారు. రైతులతో ముడిపడి ఉన్న ఈ రెండు అంశాలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకోవడంతో సాధ్యమైనంత త్వరగా వీటిని అమలు చేసి ప్రతిపక్షాల విమర్శలకు చెక్ పెట్టాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఏకకాలంలో, ఏక మొత్తంలో రైతులు తీసుకున్న రూ.2లక్షల వరకు రుణాలన్నీ ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రుణమాఫీ విషయంలో కొందరిని మినహాయించాలని నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం కిసాన్, ప్రధాన మంత్రి బీమా యోజన పథకంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌కం ట్యాక్స్ చెల్లించే వారు, ఉద్యోగులకు దీని నుంచి మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో .రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే ఆలోచనతో ఉన్నట్టు తెలిసింది. రుణమాఫీ పథకానికి ఎప్పటి నుంచి కట్ ఆఫ్ డేట్‌ను నిర్ణయించాలి, ఇంకా ఎలాంటి నిబంధనలు విధించాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు. దీనిపై క్యాబినెట్ భేటీలో కూలంకషంగా చర్చించి, మంత్రుల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని సీఎం ఆలోచిస్తున్నారు. అలాగే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను నిర్వహించాల్సి ఉన్నందున ప్రారంభ తేదీని ఖరారు చేయనున్నారు. ఇప్పటికే ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం ఈ సమావేశాల్లో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సమాయత్తమవుతోంది.

ఎన్నికల కోడ్ అనంతరం జరుగుతున్న ఈ భేటీలో వివిధ పథకాలకు, అభివృద్ధి పనులకు కేటాయింపులు, సమావేశాల నిర్వహణ, అధికార చిహ్నం, పార్లమెంట్ సెగ్మెంట్‌కో జిల్లాగా, 17 జిల్లాలకు కుదింపు, రాష్ట్ర విభజన అంశాల్లోని 9, 10 షెడ్యూల్‌కు సంబంధించిన ఆస్తులపైనా చర్చించనున్నట్టు సమాచారం. గవర్నర్ సంతకమయినా సాంకేతిక సమస్యతో బ్రేక్ పడ్డ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల విలీనంతో పాటు ఏపీ తెలంగాణ ఉద్యోగుల అంశాల గురించి ఈ భేటీలో చర్చించే అవకాశముంది. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోన్న ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో వచ్చిన అవినీతి, ఆరోపణలు, చత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో వెలుగుచూసిన కుంభకోణంపై కొనసాగుతోన్న విచారణలు, కేంద్ర నివేదికల ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు గత ప్రభుత్వంలో ఆయా శాఖలకు వ్యవహరించిన మంత్రులు, అధికారులపై తీసుకోవాల్సిన చర్యల గురించీ ఈ భేటీలో చర్చించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. అనేక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునేందుకు జరుగుతున్న ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

కేజీబీవీలో 11 మంది బాలికలకు అస్వస్థత

ఆస్పత్రికి తరలింపు.. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో ఘటన

నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్‌కల్ ప్రభుత్వ కేజీబీవీ హాస్టల్‌లో శుక్రవారం 11 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దాంతో వారిని వెంటనే జహీరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. దగ్గు, వైరల్ ఫీవర్ వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు ఎస్ఓ పర్వీన్ బేగం తెలిపారు. కాగా ఈ ఘటన గురించి తెలియగానే డీఈఓ వెంకటేశ్వర్లు కేజీబీవీని సందర్శించారు. ఎంఈఓతో కలిసి హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్ఓకు ఆదేశించారు. అపరిశుభ్రంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నవంబర్‌లోగా క్రీడా పాలసీ

(మొదటిపేజీ తరువాయి)

సాధ్యమైనంత త్వరగా రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. పాలసీలో భాగమైన యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు సంబంధించి పలు వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించగా, వాటిలో చేయాల్సిన మార్పులు, చేర్పులను సీఎం వారికి సూచించారు. దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా అక్కడి నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించిన సందర్భంగా గుర్తించిన అంశాలను తెలియజేశారు.. రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రులు పొంగులేటి, పొన్నం, వేం నరేందర్‌రెడ్డి కొరియా క్రీడా వర్సిటీ ప్రతినిధులతో చర్చించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. దక్షిణ కొరియా క్రీడా వర్సిటీతో పాటు క్రీడా రంగంలో ప్రపంచంలోనే అత్యుత్తమైనదిగా గుర్తింపు పొందిన ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీ అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. మరో పది రోజుల్లోనే క్రీడా పాలసీకి సంబంధించిన గవర్నింగ్ బాడీని ఖరారు చేయాలని సీఎం అన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్ ను వెంటనే తయారు చేయాలన్నారు. వచ్చే రెండేండ్లలో నేషనల్ గేమ్స్ కు రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చేలా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌ను సంప్రదించాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఎమ్మెల్యేపై ఎలక్షన్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి హైకోర్టులో ఊరట దక్కింది. ఆమె ఎన్నికను సవాల్ చేస్తూ ఆసిఫాబాద్ కాంగ్రెస్ నేత అజ్మీరా శ్యామ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. రాష్ట్ర శాసనసభకు 2023లో ఎన్నికలప్పుడు కోవా లక్ష్మి సమర్పించిన అఫిడవిట్‌లో వాస్తవాలను దాచిపెట్టారనీ, అఫిడవిట్‌లో సరైన సమాచారం ఇవ్వలేదనీ, కనుక ఆమె ఎన్నిక చెల్లదని శ్యామ్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ శుక్రవారం హైకోర్టు తీర్పు వెలువరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఐదేళ్ల ఆదాయపు పన్ను రిటర్న్‌ల వివరాలను అందించాలని ఈసీ నిబంధనల్లో ఉందనీ, అయితే, కోవా లక్ష్మి అఫిడవిట్‌లో ఐదేళ్ల ఐటీ రిటర్న్‌లు లేవని పిటిషనర్ వాదన. 2021-22, 2020-21, 2019-20, 2018-19 ఏళ్లకు చెందిన రిటర్న్‌ల వివరాలు ఇవ్వలేదు. ఇది ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(2)కు విరుద్ధం. ఎన్నికల్లో మోసాలు చేసి లక్ష్మి గెలిచారు.

ఈ వాదనలను లక్ష్మి లాయర్ వ్యతిరేకించారు. తప్పుడు సమాచారం ఇచ్చారనడానికి ఎలాంటి ఆధారాలు పిటిషనర్ చూపలేదన్నారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు, అజ్మీరా శ్యామ్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు శుక్రవారం తీర్పు చెప్పారు.

హైడ్రా ఆర్డినెన్స్.. రాష్ట్రానికి నోటీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైడ్రాకు పలు విస్తతాధికారాలు కట్టబెడుతూ ఈ నెల 4న ఆర్డినెన్స్ జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ కార్పొరేటర్ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కొడుకు) దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు విచారించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శిలను ఆదేశించింది. విచారణను 3 వారాలకు వాయిదా వేసింది. ఈలోగా కౌంటర్లు వేయాలని వాళ్లను ఆదేశిస్తూ నోటీసులిచ్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాథే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చట్ట ప్రకారం ఆర్డినెన్స్ ద్వారా హైడ్రాకు అధికారులు కట్టబెట్టడానికి వీల్లేదని పిటిషనర్ వాదన. చెరువులు, సరస్సులు, కుంటలు రక్షణ కోసం హైడ్రాకు అధికారులు కల్పిస్తూ జారీ చేసిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని పిటిషనర్ వాదన. విచారణ 3 వారాలకు వాయిదా పడింది.

సంగారెడ్డిలో.. సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు

తొలిసారి ఆతిథ్యమిస్తున్న మెతుకు సీమ

మహాసభల నిర్వహణకు పార్టీ శ్రేణులు సన్నద్ధం

నేడు పీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం

పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు హాజరు

మహాసభల జయప్రదం కోసం ప్రజలు సహకరించాలి: చుక్క రాములు





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు సంగారెడ్డి జిల్లాలో జరగనున్నాయి. సీపీఐ(ఎం) చరిత్రలో తొలిసారిగా మెతుకు సీమ సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర మహాసభలు జరగనుండటంతో అత్యంత జయప్రదంగా నిర్వహించేందుకు ఆ పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి. సంగారెడ్డి పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో శనివారం రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు హాజరుకానున్నారు. సన్నాహక సమావేశానికి ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సీపీఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, సానుభూతిపరులు, కమ్యూనిస్టు అభిమానులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.


భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ మార్క్సిస్టు తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు 2025 జనవరి 25-28 తేదీల్లో సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్నారు. గత మహాసభలు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో జరిగాయి. ప్రతి మూడేండ్లకోసారి పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మహాసభ లు నిర్వహిస్తారు. శాఖ, మండల, ఏరియా, జిల్లా, రాష్ట్ర, అఖిల భారత స్థాయి మహాసభల్ని పూర్తి చేసుకొని రాబోయే మూడేండ్ల కాలంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో పార్టీ చేపట్టాల్సిన కర్తవ్యాలను రూపొందిస్తారు. పీడిత వర్గాల పక్షాన చేపట్టాల్సిన పోరాటాలు, ఉద్యమాలు, ఆందోళనకు సంబంధించిన కార్యాచరణను ఖరారు చేస్తారు. అందులో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలో సీపీఐ(ఎం) వివిధ స్థాయిల్లోని కమిటీల మహాసభలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని జిల్లా మహాసభ లు కూడా పూర్తయ్యాయి. సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా 3వ మహాసభలు ఈ నెల 19,20 తేదీల్లో జహీరాబాద్ పట్టణంలో అత్యంత జయప్రదంగా నిర్వహించారు.

సంగారెడ్డి జిల్లాలో కార్మిక, కర్షక, రైతాంగంతో పాటూ అన్ని రంగాలకు చెందిన ప్రజల సమస్యలపై అనేక ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలతో ప్రజా ఉద్యమాల ద్వారా పార్టీ మరింత విస్తరిస్తోంది. బలమైన ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కమిటీ రాష్ట్ర మహాసభలు జరిపేందుకు ఆతిథ్యమిస్తోంది.

నేడు పీఎస్ఆర్ గార్డెన్‌లో ఆహ్వాన సంఘం సన్నాక సమావేశం

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశం శనివారం సంగారెడ్డి పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే రాష్ట్ర మహాసభలు, భారీ బహిరంగ సభను జయప్రదంగా నిర్వహించేందుకు అవసరమైన ఆహ్వాన సంఘాన్ని ఈ సమావేశంలో ఎన్నుకుంటారు. పార్టీ శ్రేణులతో పాటు వామపక్ష, అభ్యుదయ, ప్రజాస్వామ్య శక్తులతో ఆహ్వాన సంఘం ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర మహాసభలకు సీపీఐ(ఎం) అఖిల భారత స్థాయి నాయకత్వం ప్రకాశ్‌కరత్, బృందాకరత్, బీవీ రాఘవులు, కేరళ సీఎం విజయన్ లాంటి ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అదే విధంగా రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సీపీఐ(ఎం) ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులు, పరిశీలకులు మహాసభల్లో పాల్గొంటారు. మహాసభల్ని జయప్రదంగా నిర్వహించేందుకు ఏర్పాటు కానున్న ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశానికి ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా సీపీఐ(ఎం) నాయకత్వం హాజరవుతారని ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు తెలిపారు.

మహాసభల జయప్రదం కోసం ప్రజలు సహకరించాలి: చుక్క రాములు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు



మెతుకు సీమ సంగారెడ్డి జిల్లాలో మొదటి సారి నిర్వహించనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం ప్రజలు, ప్రజాతంత్ర, అభ్యుదయవాదులు, మేధావులు, విద్యావంతులు, సామాజిక శ్రేణులు సహకరించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు కోరారు. మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసేందుకు నిర్వహించే సన్నాహక సమావేశానికి పార్టీ నాయకులు, పార్టీ సభ్యులు, సానుభూతిపరులు, మేధావులు, అభ్యుదయ వాదులు హాజరవుతారన్నారు. పార్టీ రాష్ట్ర మహాసభల్ని నిర్వహించే గురుతర బాధ్యతను సంగారెడ్డి జిల్లా కమిటీ తీసుకున్నందున ప్రతి ఒక్కరూ సహకరించి విజయవంతం అయ్యేందుకు విరివిగా సహకరించాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా కమ్యూనిస్టు, ప్రజాతంత్ర ఉద్యమాల గడ్డగా నిలిచిందన్నారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం అనాడు సాగిన ప్రజా ఉద్యమానికి నాంది పలికిన తొలి ఆంధ్రమహాసభ అప్పటి మెదక్ జిల్లాలోని జోగిపేట గడ్డపై జరిగిందన్నారు. ఆనాటి ప్రజా ఉద్యమ స్ఫూర్తితో సీపీఐ(ఎం) ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజాపోరాటాలకు నాయకత్వం వహిస్తూ పీడిత వర్గాల పక్షాన నికరంగా పోరాడుతుందన్నారు.

మూసీపై త్వరలో అఖిలపక్షం

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. మూసీ పునరుజ్జీవంతో భవిష్యత్‌లో దేశం మొత్తం హైదరాబాద్ వైపే చూస్తుందన్నారు. మూసీ కారిడార్ హైద్రాబాద్‌లో మరో అద్భుతం అవుతుందనీ, సియోల్ కంటే పదింతల అభివృద్ధి ఇక్కడ జరుగుతుందన్నారు. ప్రతిపక్షాలు మూసీ పునరుజ్జీవాన్ని గుడ్డిగా వ్యతిరేకించడం మానుకోవాలని హితవు పలికారు. మూసీ నిర్వాసితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మూసి పునరుజ్జీవంపై ప్రభుత్వం పూర్తి స్పష్టతతో ఉందనీ, పర్యాటకంగా, ఆదాయపరంగా చాలా ముఖ్యమైన వనరుగా మారుతుందని వివరించారు. ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ అన్యాయం జరగదనీ, ఇప్పటికే మూసీ రివర్‌బెడ్‌లో ఉన్న వాళ్లకు డబుల్‌బెడ్ రూములు, సామాను తరలింపు నిమిత్తం రూ.25వేలు, పిల్లలకు పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నామని తెలిపారు.

మూసీ నిర్వాసితుల ఉపాధి కోసం రూ.లక్షా 40వేల రుణమాఫీతో రూ.రెండు లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. మూసీపై కొంతమంది పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారనీ, ప్రతిపక్షాలు విలువైన సలహాలు, సూచనలు ఇవ్వకుండా, ప్రజలను అభద్రతకు గురిచేస్తున్నాయని విమర్శించారు.

మోడీ ప్రజలకు చేసిందేం లేదు

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం చెందిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రజల ఆలోచనలు పట్టించుకోకుంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదనీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సర్కార్‌ను పడగొట్టాలని అనుకుంటే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే స్వయంగా తనకు మద్దతుగా నిలిచారని చెప్పారు.

సంపాదకీయం

ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం



భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని వివిధ ప్రభుత్వ శాఖలు ఇటీవల విడుదల చేసిన వివిధ గణాంకాలు విదితం జేస్తున్నాయి. రూపాయి విలువ క్షీణించడం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, విపరీతమైన విదేశీ రుణాలు, విదేశీ వాణిజ్య లోటు వంటివి మన ఆర్థిక వ్యవస్థ దుస్థితిని వెల్లడిస్తున్నాయి. ఏడు శాతం వృద్ధితో ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటున్నా 90 శాతం మంది ప్రజలకు దీని ప్రయోజనాలు అందడం లేదన్నది కఠోర వాస్తవం. ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన ధరల పెరుగుదల ప్రభుత్వ గణాంకాలకు అందనంత! పెరుగుతున్న నిరుద్యోగం,

> మోడీ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్ మారకం విలువ రూ.59.44 పైసలు కాగా పదేళ్లలో దాదాపు రూ.25 పడిపోయి రూ.84కి దిగజారింది. విదేశీ వాణిజ్య లోటు కూడా పెరుగుతోంది. ఆగస్టులో వాణిజ్యలోటు 2,970 డాలర్లకు పెరిగింది. గతేడాది ఆగస్టులో ఇది 2,421 కోట్లు. భారతదేశ ఎగుమతులు చాలా బలహీన స్థితిలో ఉన్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ప్రజల కొను గోలు శక్తిని కూడా తగ్గిస్తుంది. సెప్టెంబర్‌లో వస్తు, సేవల పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శనం.


వేతన పెరుగుదల లేకపోవడం ప్రజల కొనుగోలు శక్తిని క్షీణింప జేసింది. ఏడు శాతం వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ చలనశీలంగా కాకుండా స్తబ్దుగా ఉంది. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై విదేశీ పెట్టుబడి దారులు విశ్వాసం కోల్పోయారు. విదేశీ మదుపరులు తమ పెట్టుబడులను భారతీయ స్టాక్ మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంటున్నారు. విదేశీ మదుపరులు ఈ నెలలో ఇప్పటివరకు రూ.85వేల కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్స రం రెండవ త్రైమాసికంలో, భారతీయ కంపెనీల ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండడంతో విదేశీ పెట్టుబడిదారులు దూరమవుతున్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చైనా ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించడం భారత మార్కెట్‌ను కూడా తాకింది.

ప్రపంచ ఆర్థిక మాంద్యం కారణంగా 2008లో భారతీయ స్టాక్ మార్కెట్ నుండి విదేశీ పెట్టుబడులు ఉపసంహరించబడ్డాయి. అప్పట్లో అది పెద్ద ప్రభావం చూపింది. రూపాయి విలువ క్షీణతకు అది కూడా కారణమైంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి అత్యధికంగా నష్టపోయింది. మొన్నటిరోజు డాలర్ విలువ రూ.84.07 పైసలు. ఆ మారకపు విలువను కొనసాగించేందుకు రిజర్వ్‌బ్యాంక్ తన నిల్వల నుంచి పెద్ద మొత్తంలో డాలర్లను విడుదల చేస్తోంది. ఇది విదేశీ మారక నిల్వలను కూడా తగ్గిస్తుంది. మోడీ ప్రభుత్వం 2014 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు డాలర్ మారకం విలువ రూ.59.44 పైసలు కాగా పదేళ్లలో దాదాపు రూ.25 పడిపోయి రూ.84కి దిగజారింది. విదేశీ వాణిజ్య లోటు కూడా పెరుగుతోంది. ఆగస్టులో వాణిజ్యలోటు 2,970 డాలర్లకు పెరిగింది. గతేడాది ఆగస్టులో ఇది 2,421 కోట్లు. భారతదేశ ఎగుమతులు చాలా బలహీన స్థితిలో ఉన్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ప్రజల కొను గోలు శక్తిని కూడా తగ్గిస్తుంది. సెప్టెంబర్‌లో వస్తు, సేవల పన్ను వసూళ్లే ఇందుకు నిదర్శనం. నలభై నెలల్లో అత్యల్ప వృద్ధి రేటు (-) 6.5 శాతం నమోదైంది. ప్రస్తుత ద్రవ్యోల్బణం రేటుతో పోలిస్తే సెప్టెంబర్‌లో జిఎస్‌టి ఆదాయం పెద్దగా పెరగలేదు.

బొగ్గు, విద్యుత్, ముడి చమురు ప్రాసెసింగ్, మైనింగ్ వంటి ఎనిమిది కీలక రంగాల్లో ఉత్పత్తిపై ఆధారపడిన పారిశ్రామికోత్పత్తి సూచీ ఆగస్టులో ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబర్‌లో కార్ల విక్ర యాలు పందొమ్మిది శాతం తగ్గాయి. సేవల రంగ సూచీ కూడా పది నెలల కనిష్టానికి చేరింది. ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో గృహ రుణాల పంపిణీ తొమ్మిది శాతం పడిపోయింది.

బలమైన మరియు చలనశీలమైన ఆర్థిక వ్యవస్థకు అవసరమైన ఇటువంటి అంశాలు క్షీణిస్తున్నాయి. పేలవమైన ఆర్థిక విధానాల ఫలితంగా మధ్యతరగతి, దిగువ తరగతులవారి ఆదాయం తగ్గింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కొనుగోలు శక్తి లేకపోవడం. కొనుగోలు శక్తి కోవిడ్ పూర్వ స్థాయికి చేరుకోలేదని చాలా సూచికలు చూపిస్తున్నాయి. కొనుగోలు శక్తిని పెంచుకో వాలంటే దిగువన ఉన్న యాభై శాతం మంది చేతిలో ఎక్కువ డబ్బు రావాలి. కానీ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, ఇతర సంక్షేమ పథకాల కేటాయింపులు పెంచడం లేదు. దానికి బదులుగా, కార్పొరేట్‌లకు పన్ను మినహా యింపులతో సహా భారీ సబ్సిడీలు ఇస్తోంది. మాంద్యం నుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు ప్రత్యేక ప్యాకేజీలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. అలా చేయాలంటే ప్రజా ఒత్తిడి పెంచాలి.

హిందూ రాజ్యాన్ని పునరుద్ఘాటిస్తున్న ఆరెస్సెస్ అధినేత


రామ్ పునియాని

అక్టోబర్ 12, 2024 విజయదశమిని, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సంస్థాపక దినంగా పరిగణిస్తుంది కాబట్టి అదే రోజున సాంప్రదాయం ప్రకారం ఆరెస్సెస్ అధినేత, సర్సంగ్ చాలక్ అయిన మోహన్ భగవత్ ప్రసంగించాడు. ఆయన ప్రసంగం, 2024 మేలో జరిగిన సాధారణ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలం తగ్గిన తరువాత ఆయన చేసిన వేరొక ప్రసంగం నేపథ్యంలో సాగింది. ఆ ప్రసంగంలో భగవత్, 'తాను దేవుడు పంపిన జీవ సంబంధం లేని' వ్యక్తినని అనుకున్నానన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీని లక్ష్యంగా పెట్టుకున్నాడు. బీజేపీ బలం 303 స్థానాల నుంచి 240 స్థానాలకు పతనమైంది కాబట్టి 'ఒక మనిషి సూపర్ మ్యాన్ కావాలనుకుంటాడు, తరువాత ఒక దైవం, ఆ తరువాత భగవంతుడు కావాలనుకుంటాడని' భగవత్ పేర్కొన్నాడు. బీజేపీ కి అంతగా సామర్థ్యం లేదు కాబట్టి ఇంతకుముందు ఆరెస్సెస్ సహాయాన్ని కోరింది, ఇప్పుడు 'మరింత సామర్థ్యం' గా మారిందని బీజేపీ చెప్పుకున్న మొదటి ఎన్నికలు కూడా బహుశా ఇవేనేమో.

ఆ ప్రసంగంతో భగవత్, మోడీలో పెరుగుతున్న అహంభావాన్ని తగ్గించాడు. ఆరెస్సెస్ అనుబంధ సంఘ్ పరివార్ శక్తులన్నీ ఇటీవల హర్యానాలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో అత్యంత చురుగ్గా పనిచేశాయి. ఎన్నికల కమిషన్ 'పలుకుబడి సహాయం'తో, కాంగ్రెస్ 'ఖచ్చితంగా విజయం సాధిస్తుందన్న' భావనను తలకిందులు చేస్తూ బీజేపీ హర్యానా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు, బీజేపీయేతర పార్టీలు పాలించే రాష్ట్రాలను తీసుకొని, ఆరెస్సెస్ లక్ష్యాలను, హిందూత్వ రాజకీయాల ముఖ్యాంశాలను వివరిస్తూ తన విజయదశమి ప్రసంగంలో భగవత్ బీజేపీ విధానాల్ని పునరుద్ఘాటించాడు.

'డీప్ స్టేట్ '(ప్రభుత్వ విధానాల్ని అదుపు చేసే చర్యల్లో భాగస్వామి),' వోకిజం'(మేల్కొలుపు),' కల్చరల్ మార్క్సిస్టు' (సాంస్కృతిక మార్క్సిస్టు) లాంటి పదాలు, అన్ని సాంస్కృతిక సాంప్రదాయాలకు శత్రువులని ఆయనన్నాడు. విద్యాసంస్థల్ని వారి అదుపులోకి తెచ్చుకోవడమే వారి మొదటి విధానం. తరువాత వారు సమాజంలోని ఆలోచనలు, విలువలు, విశ్వాసాలను ధ్వంసం చేస్తారు.ఆ తరు వాత కృత్రిమంగా సమస్యల్ని సృష్టించి, ప్రజల్లో బాధిత భావనను అంతర్నిర్మాణం చేస్తారు. తరువాత ప్రజల్లో అసంతృప్తిని పెంచి, ప్రజల్ని దూకుడుతనంతో ఉండేలా చేసి, అరాచకత్వపు వాతావరణాన్ని సృష్టించి, ఈ వ్యవస్థ, చట్టాలు, పాలన పట్ల ద్వేష భావాల్ని రెచ్చగొట్టి, ప్రజల్లో భయాన్ని పెంచుతారు. అప్పుడు దేశంపై ఒకరి ఆధిపత్యాన్ని సృష్టించడం తేలిగ్గా జరిగిపోతుంది. ముఖ్యంగా తక్కువగా జనాదరణ పొందిన పదం, 'వోకిజం' సామాజిక, రాజకీయ అన్యాయాల పట్ల సున్నితంగా ఉండే ప్రజల ప్రవర్తన, దృక్పథాలకు ఎక్కువగా మితవాదులు అవమానకరమైన రీతిలో ఉపయోగిస్తారు. భగవత్ ప్రసంగంలో ఇది చాలా ముఖ్యమైన వాక్యం.

హిందూ మితవాదులు సామాజిక, రాజకీయ రంగాల్లో తాము కవాతు చేయించే ఇలాంటి అన్ని రాజకీయ ధోరణులు, అంటే తాలి బాన్లు, ముస్లిం బ్రదర్ హుడ్, శ్రీలంక, మయన్మార్‌లలో బౌద్ధ మతం పేరుతో చేసే రాజకీయాలు, క్రైస్తవ ఛాందసవాదాలు అసమాన త్వాన్ని ప్రోత్సాహిస్తాయి. స్థానిక పరిస్థితులపై ఆధారపడి వారు భిన్నమైన వ్యక్తీకరణలు కలిగి ఉంటారు. మరోవిధంగా హిందూ జాతీయవాద భావజాల స్థాపకులు, మనుస్మృతి దళితులు, మహిళల్ని లొంగదీసుకుంటుందనే కారణంగా దానిని స్తుతించారు. ఆరెస్సెస్ కూడా క్రైస్తవులను, ముస్లింలను విదేశీయులుగానే పరిగణిస్తుంది. 1984లో జరిగిన సిక్కుల ఊచకోతకు 'రహస్యంగా మద్దతు పలికిందన్న' ఆరోపణలు కూడా ఆరెస్సెస్‌పై ఉన్నాయి.

సమాజంలో అనేక సామాజిక ఉద్యమాల ప్రయాణ లక్ష్యంగా ఉన్న సమానత్వ విలువల కోసం ఎదురుచూసే వోకిజం (మేల్కొలుపు)ను మితవాద రాజకీయాలు చెడుగా పరిగణిస్తాయి. అందుకే ప్రజాస్వామ్యం అనేది అణగారిన వర్గాల ఉద్యమాల కోరికగా ఉంటుంది. దళిత, మహిళా, ా+దీూ ల ఉద్యమాలను భారతదేశంలో హిందూ జాతీయవాదులు చిన్నచూపు చూస్తుంటే,



ఆధిపత్యం చెలాయిస్తారు కాబట్టి ఆరెస్సెస్ సంఘ్ పరివారం తన శాఖల ద్వారా (ఉదయం వ్యాయామాలు), సరస్వతీ శిశు మందిరాలు, ఏకలవ్య విద్యాలయాల్లాంటి పాఠశాలల ద్వారా, తన విశాల నెట్‌వర్క్ ద్వారా మౌఖికంగా ప్రచారం చేసే విధానాన్ని అవలంబించింది. ఈ విధానం సాంప్రదాయవాదం, కుల, లింగ శ్రేణీగత వ్యవస్థలను ప్రోత్సాహించే సామాజిక లోకజ్ఞానాన్ని ప్రభావితం చేస్తుంది. బీజేపీ ఐటీసెల్, కార్పొరేట్ రంగం అదుపుచేసే మీడియా ద్వారా సమాజంలోని ఓ పెద్ద భాగం ఆలోచనను హిందూ జాతీయవాద బోధనలు రూపుదిద్దుతున్నాయి.

ఇప్పుడు 'వోకిజం' అంటే అర్థం ఏమిటి? ఇది న్యాయబద్ధమైన సమాజాన్ని కోరుకుంటుంది. ఇది కులం, మతం, వర్ణం, భాషల ఆధారంగా చూపే వివక్షతకు వ్యతిరేకంగా ఉంటూ, ా+దీూ ల హక్కులకు మద్దతుగా నిలుస్తుంది. అందరి సమానత్వం కోసం ఉన్న ఈ హక్కులు, హిందూ జాతీయవాద రాజకీయాల్లో ముఖ్య భాగం గా ఉన్న బ్రాహ్మణవాద విలువల్ని బంధిస్తాయి. దీనిని కొంతమేరకు సాధారణీకరణ చేయడానికి, మతం దుస్తుల్లో తమను ఛాందసవాద శక్తులు పాలించే (ముస్లింలు మెజారిటీ)గా ఉండే దేశాల్లో మహిళలే ప్రధాన లక్ష్యాలుగా ఉన్నారు.

ఆరెస్సెస్, సమానత్వ విలువలను 'ప్రాచీన స్వర్ణ కాలం' విలువలు అంటే అసమానత్వ విలువలతో భర్తీ చేయడానికి అనుకూలంగా ఉంటుంది. అణగారిన వర్గాల వారి హక్కులను ముందుకు తీసుకొనిపోయే ఉద్యమాలు, భావాలకు అది వోకిజం అనే పదాన్ని ఉపయోగిస్తుంది. ఆరెస్సెస్, బీజేపీ మధ్య ఉన్న అంతర్గత కలహాలు వారి కుటుంబ సమస్య. ఆ రెండింటి ప్రాథమిక విలువలు ఒకే విధమైనవి, (అవి 'అహంభావ సమస్యలైనప్పటికీ'). మిగతా విషయాల్లో బీజేపీ ఏమిచేస్తే భగవత్ దానినే మళ్లీ చెబుతాడు. అయన బీజేపీయేతర పార్టీలు పాలించే రాష్ట్రాలను విమర్శిస్తాడు. 'ఈ కారణంగా నేడు పంజాబ్, జమ్మూ-కాశ్మీర్, దేశానికి వాయువ్య సరిహద్దులోని లడఖ్, సముద్ర సరిహద్దులో కేరళ, తమిళనాడు, బీహార్ నుండి మణిపూర్ వరకు ఉన్న పూర్వాంచల్ మొత్తం కలత చెందిందని' ఆయన అన్నాడు.ఆయన లడఖ్,మణిపూర్‌లను ఒకే కేటగిరీలో చేర్చినపుడే అసలు రహస్యం బయటపడింది.

కూకీలకు ముఖ్యంగా మహిళలకు వ్యతిరేకంగా జరిగిన దారుణమైన హింసను మణిపూర్ చూసింది. బీజేపీ ప్రభుత్వం నిరాసక్తత మరింత కలవర పెడుతోంది. లడఖ్ కు సంబంధించినంతవరకు, పర్యావరణ పరిరక్షణ కోసం, సమానమైన పౌరసత్వం కోసం జరిగిన ఉద్యమాలను మనం చూశాం. అవి పోరాటాలు చేయడానికి తగిన కారణాలే. ఈ పోరాటం ఎంత శాంతియుతంగా జరిగింది! బ్రహ్మాండమైన సోనం వాంగ్‌చుక్ నాయకత్వాన్ని సువర్ణాక్షరాలతో లిఖిస్తారు. ఆరెస్సెస్ ముద్దుబిడ్డ బీజేపీ లడఖ్ ఉద్యమాన్ని ఎలా విస్మరించిందన్న విషయం భారతదేశ సమకాలీన చరిత్రలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోతుంది.

కోల్‌కత్తాలో ఆర్.జీ.కర్ మెడికల్ కళాశాలలో జరిగిన విషాదంపై భగవత్ ప్రస్తావించాడు, కానీ హర్యానాలో మహిళా మల్ల యోధులకు వ్యతిరేకంగా జరిగిన దారుణ కృత్యాలు, దళిత బాలికలపై పెరుగుతున్న అకృత్యాలపై నోరు మెదపకుండా మౌనం వహించి తన పక్షపాత ధోరణిని ప్రదర్శించాడు. ఈ పెద్దమనిషి ఒకసారి, 'అత్యాచారాలు ఇండియా (పట్టణాల్లో)లో జరుగుతాయి, భారత్‌లో జరగవు' అని ప్రకటించాడు. కానీ ఆయన చెప్పిన దానికి భిన్నంగా అలాంటి చాలా కేసులు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని గ్రామాల్లో లేదా చిన్న పట్టణాల్లోనే ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. 'సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్' మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఒక నివేదిక, దళితులకు వ్యతిరేకంగా 2022 లో జరిగిన దారుణ కృత్యాలకు సంబంధించి 'ఉత్తరప్రదేశ్‌లో 12,287 కేసులు, ఆ తరువాత రాజస్థాన్‌లో 8,651 కేసులు, మధ్యప్రదేశ్‌లో 7,732 కేసులు నమోదయ్యాయని తెలిపింది. బలహీనులు తమను తాము రక్షించుకోలేరు కాబట్టి హిందువులంతా ఐక్యంగా ఉండాలనే మాట భగవత్ ప్రసంగంలో రత్నం లాంటిది. భారతీయులంగా మనమంతా ఐక్యంగా లేమా? భారత రాజ్యాంగం ప్రకారం, భారతీయులంగా ఐక్యంగా ఉండడంలో ఏదైనా సమస్య ఉందా? అయితే భగవత్ నుండి వేరే విధంగా ఆశించడం అనేది తర్కవిరుద్ధం. ఎందుకంటే వారు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే భారత రాజ్యాంగాన్ని విశ్వసిస్తున్నారు.

("న్యూస్ క్లిక్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

> ఆరెస్సెస్, బీజేపీ మధ్య ఉన్న అంతర్గత కలహాలు వారి కుటుంబ సమస్య. ఆ రెండింటి ప్రాథమిక విలువలు ఒకే విధమైనవి, (అవి 'అహంభావ సమస్యలైనప్పటికీ'). మిగతా విషయాల్లో బీజేపీ ఏమిచేస్తే భగవత్ దానినే మళ్లీ చెబుతాడు. ఆయన బీజేపీయేతర పార్టీలు పాలించే రాష్ట్రాలను విమర్శిస్తాడు. 'ఈ కారణంగా నేడు పంజాబ్, జమ్మూ-కాశ్మీర్, దేశానికి వాయువ్య సరిహద్దులోని లడఖ్, సముద్ర సరిహద్దులో కేరళ, తమిళనాడు, బీహార్ నుండి మణిపూర్ వరకు ఉన్న పూర్వాంచల్ మొత్తం కలత చెందిందని' ఆయన అన్నాడు.ఆయన లడఖ్,మణిపూర్‌లను ఒకే కేటగిరీలో చేర్చినపుడే అసలు రహస్యం బయటపడింది.

> 'డీప్ స్టేట్ '(ప్రభుత్వ విధానాల్ని అదుపు చేసే చర్యల్లో భాగస్వామి),' వోకిజం'(మేల్కొలుపు),' కల్చరల్ మార్క్సిస్టు'(సాంస్కృతిక మార్క్సిస్టు) లాంటి పదాలు, అన్ని సాంస్కృతిక సాంప్రదాయాలకు శత్రువులని ఆయనన్నాడు. విద్యాసంస్థల్ని వారి అదుపులోకి తెచ్చుకోవడమే వారి మొదటి విధానం. తరువాత వారు సమాజంలోని ఆలోచనలు, విలువలు, విశ్వాసాలను ధ్వంసం చేస్తారు.ఆ తరు వాత కృత్రిమంగా సమస్యల్ని సృష్టించి, ప్రజల్లో బాధిత భావనను అంతర్నిర్మాణం చేస్తారు. తరువాత ప్రజల్లో అసంతృప్తిని పెంచి, ప్రజల్ని దూకుడుతనంతో ఉండేలా చేసి, అరాచకత్వపు వాతావరణాన్ని సృష్టించి, ఈ వ్యవస్థ, చట్టాలు, పాలన పట్ల ద్వేష భావాల్ని రెచ్చగొట్టి, ప్రజల్లో భయాన్ని పెంచుతారు. అప్పుడు దేశంపై ఒకరి ఆధిపత్యాన్ని సృష్టించడం తేలిగ్గా జరిగిపోతుంది.

యుద్ధమా..ఓడిపో!

మొదలు మరచిన పోరాటం
చిలవలు పలవలై అంతానికే
పంతం అంటోంది
ప్రతీకారాలు, అహంకారాలు నాటితే
యుద్ధాలే మొలకెత్తుతాయి
ఆయుధాలు పండించటం మొదలైనప్పుడే
నక్కినక్కి చూస్తున్న యుద్ధం
కండ్లు మెరిశాయి
మారణహోమాలిప్పుడు
మానవ కల్యాణాల్లా
రొమ్ము విరుచుకు తిరుగుతుంటే
నింగి నల్లగా..నేల ఎర్రగా ఎదురుపడి



శాంతి గురించి దెబ్బలాడుకుంటున్నాయి
తెల్లపావురాల కువకువలకంటే,
రాబందుల రెక్కల చప్పుడే ఎక్కువగా
వినిపిస్తున్నాయి
విశ్వశాంతి ముస్ముందు
చీకటిగదిలో లేని
నల్లపిల్లి అవుతుందేమోనన్పిస్తుంది!
ఆధిపత్యాలు, అవకాశవాదులు,
ఆయుధాలమ్ముకొనేవాళ్లు,
వెరసి మంటలు ఆరకుండా
యథాశక్తి మాటలు పేలుస్తున్న
యుద్ధభూమిలో మృత్యుపొగల మధ్య
తెల్లమేఘం లాంటి
శాంతిపావురం ఆలివ్ కొమ్మ
నోట కరుచుకుని
రెక్కలల్లాడిస్తూ ఏ మూలనుండైనా
ఎగిరొస్తుందని చిన్న ఆశ!

- భీమవరపు పురుషోత్తమ్
9949800253

దాన ధర్మాలకు ధనం ఎక్కడిది?

పార్ట్-3


రంగనాయకమ్మ

ఎక్కడైనా, కార్మికులకు తగిన సదుపాయాలు ఉండవు! తగినంత విశ్రాంతి వుండదు! ఒక్కో కార్మికుడూ పని ఒత్తిడితో భారీ యంత్రం కోరల్లో చిక్కుకుపోయి, ముక్క చెక్కలై పోతాడు. ముక్కలైంది ఎవరో పోలికలు తెలియకుండా అయిపోతాడు! ప్రతీ పెట్టుబడి దారీ లాభాల కోసం, ఎన్ని భారీ యంత్ర చక్రాల హత్యలో! ఆ శ్రామికుడి కుటుంబానికి, ఆ దేహం అయినా దొరకదు. ఏం మిగులుతుంది? యజమాని దానం చేస్తే కొంత డబ్బు! ఎంతో కొంత! అది కూడా, అప్పటి దాకా ఆ కార్మికుడి నించీ దోచిన లాభంలో పిసరంత భాగం! అదీ, ఆ శ్రామికుడికి దక్కేది! ఎప్పుడు? భారీ యంత్ర కోరల్లో దుర్మార్గంగా జరిగే మరణం గురించి సమ్మెల వంటిది ఏదో కార్మిక పోరాటం జరగవచ్చనే, ఉత్పత్తి క్రమం ఆగి, ఆనాడు లాభం, రాకపోవచ్చనే జంకుతో!

పరిశ్రమదారులందరూ కూడా మానవులే కాబట్టి, వారికీ మెదళ్ళు వుంటాయి. అవి, నిత్యం లాభాదాయాల కోసం తీవ్రంగా ఆలోచిస్తూ వుంటాయి!

ఇప్పుడు చెప్పండి! 'డబ్బు' అనేది, శ్రమ విలువని కొలిచే పరికరం. ఏ పరిశ్రమదారుడికైనా వచ్చే కోట్లూ, శత కోట్లూ, సహస్ర కోట్లూ, శ్రామిక వర్గ జనాల శ్రమ ఫలితాలే! వాటిలో, పరిశ్రమదారుడి శ్రమ వుంటుందా? ఉంటే, అది కొంత కార్మిక జీతాన్నే ఇవ్వగలుగుతుంది. పరిశ్రమదారుడు సరుకు కోసం శ్రమ చేయడం నిజమై, ఆ శ్రమకి కార్మిక జీతం రావలిసిన దానికి కోట్లేమిటి? కోట్లు! వందల కోట్లు! వేల కోట్లు! లక్షల కోట్లు! ఏమిటీ లెక్కలు? స్వంత శ్రమలతో దాన ధర్మాలా? రతన్ టాటా ధర్మదాతా? నిత్య కృషీవలుడా? ఆదర్శనీయుడా? కృషీ, ఆదర్శం అన్నీ శ్రమని దోచడానికే కాదా!

శ్రమ దోపిడీలతో, డజన్ల, డజన్ల ఫ్యాక్టరీలపై అబద్ధాల ఆదాయాలతో ఆస్తులు పెంచుతూ పోయేవాడు మానవతావాదా? సామాజిక సంక్షేమం కోసం, తపించే మానవులా దోపిడీదారులు? ఎంతెంత కీర్తనలు! ఎంతెంత పొగడ్తలో! ఎంతెంత భజనలో! ఈ భజనలు చేసేది, పెద్ద పెద్ద ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్లు కూడా! జనాల్ని భ్రమల్లో ముంచే మార్గమే కదా అది?

రతన్‌టాటాకి ఏదో ఒక్క ఉక్కు కంపెనీతోనే కాదు సంబంధం. దాదాపు 30 పెద్ద పెద్ద కంపెనీలతో వుంది. ఉక్కునే కాదు, ఉప్పులూ పప్పులూ చేయించే కార్యక్రమాల వంటివి కూడా. పెద్ద పెద్ద విదేశీ కంపెనీల్ని కూడా కొనేసిన అతి పెద్ద ధనస్వాములు టాటాలు!

అసలు, 'డబ్బు' అంటే, 'శ్రమ విలువ'ని కొలిచే సాధనం! ప్రపంచంలో వుండే డబ్బు అంతా, శ్రామికుల అదనపు శ్రమల వల్ల వచ్చేదే!

శ్రామికవర్గ జనాభాలో, డాక్టర్లు వున్నారు. ఇంజనీర్లు వున్నారు. ప్రొఫెసర్లు వున్నారు! అందరూ పెద్ద జీతాలతో! అయినా, తగిన శ్రమలు చేస్తూనే!

కానీ, ఆ పెద్ద శ్రామికులు కూడా పెట్టుబడిదారీ లాభాల దుష్టత్వాల్ని గ్రహించలేకపోతున్నారా? మేధావులే, దుష్టత్వాన్ని గ్రహించకపోతే, ధనికుల ఆస్తి పెంపకాలే వారికి సంతృప్తిని



ఇస్తాయా?

ఇంతకీ, టాటాలకి గానీ, ఇంకే ఇతర పెట్టుబడిదారులకు గానీ, లాభం అనేది ఎవరి శ్రమవల్ల వచ్చేది? యంత్రాల వల్లో, ముడిపదార్థాల వల్లోనా? కాదు. అవి జీవం లేనివి. తమ విలువకన్నా ఎక్కువ విలువని ఇవ్వలేవు. ఇక ఇవ్వగలిగేది, జీవం వున్న కార్మికులే! వాళ్ళు జీతం డబ్బులతో, శ్రమ చేయడానికి కావలిసిన శక్తినిచ్చే తిండీ, బట్టా, నివాసమూ వగైరాలను కొనుక్కుంటారు. కానీ, ఆ జీతాల విలువని మించినంత 'అదనంగా' విలువ సృష్టి అవుతుంది! దానినే, పెట్టుబడిదారులు, 'మా పెట్టుబడికి వచ్చిన లాభం!' అంటారు, అనుకుంటారు. 'లాభం' అనేది, 'శ్రామికుల శ్రమలో నించి లాగేసిన భాగమే' అని, లాభానికి సంబంధించిన రహస్యం గురించి తెలియనివారు, 'చూశారా, వారికి ఎంత అదృష్టంతో ఎక్కువ డబ్బు వచ్చిందో! ఎంత ధర్మదాతో ఈయన, తన లాభాల్లో నించీ, ఎన్ని దానధర్మాలు చేస్తున్నాడో!' అని మూర్ఖులు పోతారు. అమాయకులే! అయినా, వారిలో ఈ విషయాలు తెలుసుకోగలిగిన వారూ వున్నారు. ఉదాహరణకి, రతన్ టాటాకి మేనత్త కొడుకు అయిన 'షాపూర్జీ సక్లత్ వాలా' (1874-1936) అనే ఆయన, ధనిక కుటుంబంలో పుట్టినా, 'శ్రమ దోపిడీని' వివరించే మార్క్సు సిద్ధాంతాన్ని అర్థం చేసుకున్నాడు! అందుకే అతను బ్రిటన్ లో, కమ్యూనిస్టు పార్టీ పనుల్లో జీవితాంతమూ వున్నాడట! (గూగుల్ లో వున్న, అతని కథంతా ఇక్కడ చెప్పుకోలేము.)

అన్నిటికంటే, అద్భుతమైన విషయం, మార్క్సుని కలిసిన 'ఫ్రెడరిక్ ఎంగెల్స్' అనే ఆయన ఒక పెట్టుబడిదారుడి కొడుకు అయివుండి, 24వ ఏట, ఈ 'శ్రమ దోపిడీ, డబ్బూ, లాభం వంటి విషయాలు గ్రహించి, 'ఇంగ్లండులో కార్మికవర్గ స్థితిగతులు' అని ఒక గొప్ప పుస్తకం రాశాడు. దానిలో, పెట్టుబడిదారులు చేసే, దానధర్మాల ('చారిటీ') గురించీ, వాళ్ళ 'దాతృత్వం' ('ఫిలాంత్రపీ') గురించీ, పెట్టుబడిదారీ దాతల గురించీ, ఎంత తీవ్రమైన విమర్శ చేశాడో చూడండి!

"నువ్వు ముందు కార్మికుల రక్తాన్ని తాగేసి, తర్వాత నీ ఆత్మ సంతృప్తి కోసం, వంచనాత్మక మానవ ప్రేమను వారిపై కురిపించినా, వారి దగ్గర నుంచి దోచుకున్న (ప్లండరింగ్) దాంట్లోంచి వందో వంతు మాత్రమే వారికి తిరిగి ఇచ్చి, ప్రపంచం ముందు అతి గొప్ప మానవత్వ సేవకుడిగా నిన్ను నీవు నిలుపుకుంటున్నావు. దానం అనేది, దాన్ని తీసుకునే వాడి కంటే, అది ఇచ్చేవాడినే ఎక్కువ దిగజారుస్తుంది. సమాజంలో మీరు బహిష్కరించిన బిచ్చగాడు, ఆ దిగజారిన వాడు, తనకున్న ఆఖరి అవకాశాన్ని, అంటే 'నేనూ మనిషినే' అనే వాదనను, మీ పాదాల ముందు పరిచి, మీ దయ కోసం ప్రాధేయపడాలనీ, 'ముష్టివాడు' అనే రూపంలో మీరు అతని నుదుటిపై శాశ్వత ముద్ర వేయాలనీ, మీ దాతృత్వం డిమాండు చేస్తుంది."

ఇక్కడ ఎంగెల్సు స్పష్టంగా చెపుతున్నదేమిటి? పెట్టుబడిదారులు తాము కార్మికులనించీ లాభం రూపం లో "దోచుకున్న" దానిలో నించే దాన ధర్మాలు చేస్తారు-అని!

మనం గమనించవలిసిన ఇంకో విషయం: దానాలు తీసుకోవడం, తీసుకునే వ్యక్తికి అవమానమే. ఇచ్చే వ్యక్తికి కూడా అది విలువైన విషయం కాదు! దానాలు ఇతరులకు ఇవ్వగలిగే ఆర్థిక స్థితిలో ఎవరు వుంటారు? అలాంటి స్థితిలో వుండడం, ఇచ్చేవాళ్ళకి కూడా అవమానమే. అసలు, ఒక మనిషి దానాలు పట్టే స్థితిలో వుండకూడదంటే, ఇంకో మనిషి దానాలు ఇచ్చే స్థితిలోనూ వుండకూడదు కదా? డబ్బు వున్న మనిషి దానాలు ఇచ్చే పని 'కరుణతో చేసినట్టు' కనపడుతుంది! కానీ, అది నిజం కాదు. అవతల బీదరికం వున్న వాళ్ళు దొరకాలి! బీదరికం వుండడం వల్లనే, దానాలు ఇచ్చే వాళ్ళు 'కరుణామయులుగా' చలామణీ అవుతారు!

అసలు, పెట్టుబడిదారులు చేసే దానధర్మాలు, అవి లాభాల్లో నించీ ఇచ్చేవి ఎంత పెద్ద శాతమైనా, అవి 'వారి స్వంత శ్రమ విలువ నించీ' ఇచ్చేవి కావు. అవి, శ్రమ దోపిడీ ఆదాయల నించీ ఇచ్చేవే! అవి ఒక పరాయి దేశానికే ఇచ్చినా, ఆ పరాయి దేశం బీదదే! అంటే, ఆ దేశం లోని ప్రజలు పేదలే! దోపిడీదారుడి దానాల్ని, కపట స్వభావంతో తమ కీర్తి కోసం, పేరు కోసం, ఇచ్చేవిగానే గ్రహించాలి.

కార్మికులు, సాటి పేదలకు చేసే సహాయాన్ని అయితే, ఒక పేద, ఇంకా తక్కువ పేదకి, నిజమైన దయతో చేసేది అవుతుందని, ఎంగెల్స్ అంటాడు: "బూర్జువాలు విరాళాల ద్వారా చేసే పరోపకారం ఎంత వరకూ ఉపయోగపడిందో, 'కానన్ పార్కిన్‌సన్' (మాంచెస్టరులోని ఒక మత గురువు) స్వయంగా చెప్పిందాన్ని బట్టి తెలుస్తుంది. బీదలకు బూర్జువా వర్గం అందించే సాయం కంటే, చాలా ఎక్కువని సాటి బీదలే ఇతర బీదలకు అందిస్తారు! ఆకలి అంటే ఏమిటో స్వయంగా తెలిసిన, నిజాయితీపరులైన కార్మికులు అందించే సహాయమూ, తనకే చాలని తిండిలోనించే పంచుకోవడమూ వంటిదే, నిజమైన త్యాగం! అది సంతోషంగా చేసే త్యాగం! విలాస వంతుడైన బూర్జువా, నిర్లక్ష్యంగా విసిరే బిచ్చం, పూర్తిగా అబద్ధపు భావంతో వుండేదే. తను చాలా దయాళువునని పైకి ప్రకటించే, తనను తను నమ్మించుకునే చర్య అది."

('ఇంగ్లండులో కార్మిక వర్గ స్థితిగతులు', ప్రగతి ప్రచురణలు, పేజీలు: 207-208.)

ఈ విమర్శలు చేసిన 4 ఏళ్ళ తరవాత, ఎంగెల్సు, మార్క్సుతో కలిసి రాసిన 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' లో ఇలాంటి దాతృత్వాన్ని, 'బూర్జువా సోషలిజం'గా పిలిచారు! "బూర్జువా సమాజాన్ని చిరస్థాయిగా చేసే ఉద్దేశంతో, సామాజిక ఇబ్బందులు తొలగించాలని బూర్జువా వర్గం లోని" 'దానశీలురు' ఇలా దానాలు చేస్తారని అసలు రహస్యం బైటపెట్టారు!

పాఠకులూ! పారిశ్రామికవేత్తల దానధర్మాల రహస్యాల్ని తెలుసుకున్నారా? మా చిన్నతనంలో, టాటాలూ-బిర్లాలూ- అని ధనికుల పేర్లు వినే వాళ్ళం. ఇప్పుడు, వాళ్ళని తలదన్నే అదానీ, అంబానీ అనే వాళ్ళ గురించి చదువుతున్నాము. ఈ రతన్ టాటా దానాలతో, పెట్టుబడిదారుల దాతృత్వం గురించిన సత్యాలేమిటో స్పష్టంగా అర్థమైపోవడం లేదూ?

(ఇంకావుంది)

> "నువ్వు ముందు కార్మికుల రక్తాన్ని తాగేసి, తర్వాత నీ ఆత్మ సంతృప్తి కోసం, వంచనాత్మక మానవ ప్రేమను వారిపై కురిపించినా, వారి దగ్గర నుంచి దోచుకున్న (ప్లండరింగ్) దాంట్లోంచి వందో వంతు మాత్రమే వారికి తిరిగి ఇచ్చి, ప్రపంచం ముందు అతి గొప్ప మానవత్వ సేవకుడిగా నిన్ను నీవు నిలుపుకుంటున్నావు. దానం అనేది, దాన్ని తీసుకునే వాడి కంటే, అది ఇచ్చేవాడినే ఎక్కువ దిగజారుస్తుంది. సమాజంలో మీరు బహిష్కరించిన బిచ్చగాడు, ఆ దిగజారిన వాడు, తనకున్న ఆఖరి అవకాశాన్ని, అంటే 'నేనూ మనిషినే' అనే వాదనను, మీ పాదాల ముందు పరిచి, మీ దయ కోసం ప్రాధేయపడాలనీ, 'ముష్టివాడు' అనే రూపంలో మీరు అతని నుదుటిపై శాశ్వత ముద్ర వేయాలనీ, మీ దాతృత్వం డిమాండు చేస్తుంది."



భారత్‌లో పెట్టుబడులు పెట్టండి

జర్మనీ పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోడీ ఆహ్వానం

న్యూఢిల్లీ : భారత్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా జర్మనీ పారిశ్రామికవేత్తలను ప్రధాని మోడీ ఆహ్వానించారు. పెట్టుబడులు పెట్టేందుకు భారత్ కన్నా మెరుగైన ప్రాంతం లేదని చెప్పారు. భారత్ అభివృద్ధి పయనంలో చేతులు కలిపేందుకు ఇది సరైన సమయమని పిలుపునిచ్చారు. జర్మనీ బిజినెస్‌లకు సంబంధించి 18వ ఆసియా-పసిఫిక్ సమావేశంలో ప్రధాని మోడీ ప్రసంగించారు. 'మేక్ ఇన్ ఇండియా' 'మేక్ ఫర్ ది వరల్డ్' చొరవలో చేరాల్సిందిగా విదేశీ పెట్టుబడిదారులను కోరారు. నైపుణ్యాలు కలిగిన భారతీయుల కోసం 20వేల నుండి 90వేలకు వీసాలను పెంచాలని జర్మనీ నిర్ణయించింది. భారత్‌లో నైపుణ్యాలు, ప్రతిభా పాటవాలు కలిగిన కార్మిక శక్తి పట్ల జర్మనీ వ్యక్తం చేసిన విశ్వాసం అద్భుతంగా, విస్మయపరిచే రీతిలో వుందని మోడీ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వాణిజ్యానికి, ఉత్పత్తికి భారత్ ప్రధాన కేంద్రంగా మారుతోందని అన్నారు. శక్తివంతమైన ప్రజాస్వామ్యం, జనాభా, డిమాండ్, డేటా వంటి బలమైన పునాదులపై నేడు భారత్ నిలబడి వుందని అన్నారు.

ముద్ర రుణాల పరిమితి పెంపు

- రూ.10 లక్షల నుంచి రూ.20లక్షలకు పెంపు

న్యూఢిల్లీ : ముద్ర రుణాల లోన్ పరిమితిని పెంచారు. శుక్రవారం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ పెంపు ఆమోదం తెలిపింది. దీంతో.. ముద్ర పథకం కింద లోన్ పొందే మొత్తాన్ని రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచారు. రుణాల అందజేత ప్రక్రియ తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్రం తెలిపింది. సూక్ష్మ, చిన్న తరహా సంస్థల కోసం రుణాలు అందించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ రుణాల్లో మొత్తం మూడు రకాల రుణాలు ఉంటాయి. శిశు రుణాల కింద రూ. 50 వేల వరకు లోన్ పొందవచ్చు. కిశోర రుణాల కింద రూ. 50 వేల నుంచి 5 లక్షల రూపాయల వరకు.. తరుణ్ రుణాల కింద రూ. 5-10 లక్షల వరకు రుణం పొందవచ్చు.

ఆస్తుల్లో షర్మిల వాటాదారు కాదు

- వైసిపి నేతలు వైవి సుబ్బారెడ్డి, పేర్ని

అమరావతి : జగన్‌కు ఉన్నవన్నీ ఆయన సొంత ఆస్తులని, వాటిల్లో షర్మిల వాటాదారు కాదని వైసిపి ప్రధాన కార్యదర్శి వైవి సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)తో కలిసి ఆయన మాట్లాడారు. షర్మిల వాటాను వైఎస్ఆర్ కూడా కోరుకోలేదని, జగనే ఆ కంపెనీలన్నీ ప్రారంభించారని పేర్కొన్నారు. హైకోర్టు స్టేటస్ కో ఉన్నా షర్మిల పేర్లు మార్చుకున్నారని చెప్పారు. దీనివల్లే జగన్ ఎన్‌సిఎల్‌టిని ఆశ్రయించారని చెప్పారు. అంతే తప్ప ఆస్తుల కోసం కాదని అన్నారు. నిజంగా షర్మిల షేర్ హోల్డరైతే ఆమెపై ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. కేవలం జగన్‌పైనే కేసుపెట్టి జైలుకు ఎందుకు పంపించారని ప్రశ్నించారు. జగన్ పదేళ్లలో ఇచ్చిన రూ.200 కోట్లు డివిడెండ్ కాదని, షేర్ హోల్డర్ కానప్పుడు డివిడెండ్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. చెల్లెలిపై అభిమానం, ప్రేమతో ఆయన సాయం చేశారని అన్నారు. జగన్ కంపెనీల్లో షర్మిల వాటాదారు అయితే ఆమె పేరు ఎందుకు పెట్టలేదని, భారతి సిమెంట్స్, జగతి పబ్లికేషన్స్ అని ఎందుకు పెట్టారని తెలిపారు. తాను చెల్లెలికి ఇస్తోంది స్వార్జిత ఆస్తి అని అగ్రిమెంటులోనూ పెట్టారని చెప్పారు. అది చదివాకే విజయమ్మ, షర్మిల ఇద్దరూ సంతకాలు చేశారని, అలాంటప్పుడు షర్మిల కంపెనీలో ఎలా వాటాదారు అవుతారని ప్రశ్నించారు.

వైఎస్ఆర్ ఆశయాలను పక్కన పెట్టారు

- షర్మిల బహిరంగ లేఖ

అమరావతి : ఆస్తుల పంపకం విషయంలో జగన్.. తల్లి విజయమ్మను, తనను మోసం చేశారని పిసిసి అధ్యక్షులు షర్మిల పేర్కొన్నారు. శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తన తండ్రి వైఎస్ఆర్ ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఆస్తి కావాలంటే జగన్, భారతి, అవినాష్‌రెడ్డి గురించి మాట్లాడొద్దని షరతు పెట్టారని తెలిపారు. దీనికి మనసు అంగీకరించక తాను ఒప్పుకోలేదని అన్నారు. దీంతో జగన్ కోర్టును ఆశ్రయించారని తెలిపారు. తనకు రూ.200 కోట్లు ఇచ్చారని, అవి కంపెనీలో డివిడెండ్ అని పేర్కొన్నారు. కేసులు లేని ఆస్తులనే పంచారని, ఈ వివాదం వల్ల బెయిల్ రద్దవుతుందనేది తప్పుడు ప్రచారమని పేర్కొన్నారు. తనను, తల్లి విజయమ్మను ఎన్ని విధాలుగా కావాలంటే అన్ని విధాలుగా వేధింపులకు గురిచేశారని వివరించారు. తన వారసులు నలుగురికి ఆస్తులు సమానంగా పంచాలంటే పంచకుండా ఏకపక్షంగా వ్యవహరించారని, పైగా వాటాల్లో 30 శాతం తనకు అదనంగా కావాలని ఆంక్ష పెట్టారని పేర్కొన్నారు. వైఎస్ఆర్ ఏదైతే నలుగురు పిల్లలకు సమానంగా వాటా రావాలని కోరుకున్నారో దానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ పైగా తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

ఎల్‌డీఎఫ్‌కు మద్దతివ్వండి



పినరయి విజయన్‌పిలుపు

న్యూఢిల్లీ : ఎల్‌డీఎఫ్‌కు మద్దతివ్వాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపునిచ్చారు. కేరళలోని చెలక్కర అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో సీపీఐ(ఎం) తరపున పోటీ చేస్తున్న యుఆర్ ప్రదీప్‌కు మద్దతుగా శుక్రవారం నిర్వహించిన భారీ ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. మతతత్వ శక్తులపై, వాటికి మద్దతిచ్చే వారిని ఎదుర్కోవడంలో దృఢమైన వైఖరి అవలంబిస్తున్న ఎల్‌డీఎఫ్‌కు మద్దతివ్వాలని ఆయన ప్రజలను కోరారు. సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మాస్టారు, కేంద్ర కమిటీ సభ్యులు, ఎంపి కెపరాధాకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్‌విశ్వం, ఎన్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు పిసి చాకో, కేరళ కాంగ్రెస్ (ఎస్) రాష్ట్ర అధ్యక్షులు కె.రామచంద్రన్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

జార్ఖండ్‌లో సీపీఐ(ఎం) విస్తృత ప్రచారం

సీపీఐ(ఎం) అభ్యర్థులుగా జార్ఖండ్‌లోని జమతార అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న లఖన్‌లాల్ మండల్, జమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సనాతన్ దేహ్రీ శుక్రవారం భారీ ప్రచారం నిర్వహించారు. ప్రదర్శనగా వెళ్లి, ఓటర్లను కలిశారు. ప్రజల, కార్మికుల హక్కుల పరిరక్షణకు సీపీఐ(ఎం)కు మద్దతివ్వాలని కోరారు.

బిజినెస్

ఐడీబీఐ బ్యాంక్‌కు రూ.1,836 కోట్ల లాభాలు



హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఐడీబీఐ బ్యాంక్ నికర లాభాలు 39 శాతం పెరిగి రూ.1,836 కోట్లకు చేరాయి. వడ్డీ ఆదాయంలో మెరుగుదల ఆర్థిక ఫలితాలకు ప్రధాన మద్దతును అందించాయి. ఎల్ఐసి ఆధ్వర్యంలోని ఈ బ్యాంక్ గతేడాది రూ.1,323 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.6,924 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో రూ.8,754 కోట్లకు పెరిగింది. ఐడీబీఐ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 3,875 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.90 శాతం నుంచి 3.68 శాతానికి తగ్గాయి. ఏడాది క్రితం 0.39 శాతంగా ఉన్న నికర ఎన్‌పీఏలు.. గడిచిన సెప్టెంబర్ ముగింపు నాటికి 0.20 శాతానికి పరిమితమయ్యాయి.

బీఓబీ ఫలితాలు ఆకర్షణీయం

ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 23 శాతం వృద్ధితో రూ.5,238 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో వడ్డీ ఆదాయం రూ.30,263 కోట్లకు చేరింది. ఏడాదికేడాదితో పోల్చితే స్థూల నిరర్థక ఆస్తులు 3.32 శాతం నుంచి 2.50 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.76 శాతం నుంచి 0.60 శాతానికి పరిమితమయ్యాయి.

పెరిగిన సూర్యోదయ్ ఎస్ఎఫ్‌బీ డిపాజిట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో సూర్యోదయ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నికర లాభాలు 10 శాతం తగ్గి రూ.45 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.50 కోట్ల లాభాలు ప్రకటించింది. అదే సమయంలో రూ.6387 కోట్లుగా ఉన్న డిపాజిట్లు.. గడిచిన క్యూ2లో 38.6 శాతం పెరిగి రూ.8851 కోట్లుగా చోటు చేసుకున్నాయి.

బంధన్ బ్యాంక్‌కు రూ.937 కోట్ల లాభాలు..

బంధన్ బ్యాంక్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన క్యూ2లో 29.99 శాతం వృద్ధితో రూ.937 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. కోల్‌కత్తా కేంద్రంగా పని చేస్తోన్న ఈ బ్యాంక్ వడ్డీ ఆదాయం 22.44 శాతం పెరిగి రూ.5,499.81 కోట్లుగా నమోదయ్యింది. నికర ఎన్‌పిఎలు 2.3 శాతం నుంచి 1.3 శాతానికి తగ్గాయి.

టీసీఐ అమ్మకాల్లో 12.6 శాతం వృద్ధి

లాజిస్టిక్స్ సొల్యూషన్స్ సంస్థ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (టీసీఐ) 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 22.3 శాతం వృద్ధితో రూ.106.4 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో కంపెనీ నికర అమ్మకాలు 12.6 శాతం పెరిగి రూ.1,131.4 కోట్లుగా నమోదయ్యింది. సంస్థ వ్యయాలు 11.84 శాతం పెరిగి రూ.1,037.4 కోట్లుగా ప్రకటించింది.

రూ.10 నాణెంపై అపోహలు వద్దు

- సెంట్రల్ బ్యాంక్ కాయిన్ మేళా



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.10 నాణెం చెల్లుబాటుపై ఉన్న అపోహలు తొలగించడానికి ప్రత్యేక అవగాహన క్యాంపెయిన్‌ను ఏర్పాటు చేసింది. గురువారం కోటిలో ఏర్పాటు చేసిన కాయిన్ మేళాలో రూ.10 నాణెం చెల్లుబాటు అవుతుందని.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని తమ అన్ని శాఖల్లో దీనిపై ప్రజల్లో చైతన్యం కల్పించనున్నట్లు ఆ బ్యాంక్ అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జోనల్ హెడ్ కె ధారాసింగ్ నాయక్, రీజినల్ హెడ్ జి రామక్రిష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

దలాల్‌స్ట్రీట్‌ను వీడని నష్టాలు

- ఐదో రోజూ నేల చూపులు
- సెన్సెక్స్ 600 పాయింట్ల పైగా పతనం



ముంబయి : దలాల్ స్ట్రీట్‌పై బేర్ పంజా కొనసాగుతోంది. అమ్మకాల ఒత్తిడితో వరుసగా ఐదో సెషన్‌లోనూ నష్టాలు కొనసాగాయి. శుక్రవారం సెషన్‌లో సెన్సెక్స్ 650 పాయింట్లు పతనం కాగా.. నిఫ్టీ 24,200 దిగువకు పడిపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఇంట్రాడేలో 900 పాయింట్లు పైగా కోల్పోగా.. తదుకు 663 పాయింట్లు లేదా 0.83 శాతం క్షీణించి 79,402కు పడిపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 218 పాయింట్లు లేదా 0.9 శాతం నష్టపోయి 24,180 వద్ద ముగిసింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6.03 లక్షల కోట్లు ఆవిరై రూ.143.76 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీల బలహీన ఆర్థిక ఫలితాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు వాటాల ఉపసంహరణకు మొగ్గు చూపారు. గతేడాది ఆగస్టు తర్వాత వరుసగా నాలుగు వారాలు స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగియడం ఇదే తొలిసారి. ఐదు సెషన్లలో సూచీలు ఏడు శాతానికి పైగా నష్టపోయాయి. నిఫ్టీ-50లో 38 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. ఇండస్ఇండ్ బ్యాంక్ ఏకంగా 18.99 శాతం విలువను కోల్పోగా.. అదానీ ఎంటర్‌ప్రైజెస్, శ్రీరామ్ ఫైనాన్స్, బీపీసీఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోల్ ఇండియా, ఎల్అండ్‌టీ, అదానీ పోర్ట్స్ సూచీలు 2 శాతం చొప్పున నష్టపోయాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ 1.48 శాతం, స్మాల్ క్యాప్ 2.4 శాతం చొప్పున తగ్గాయి.

ఈప్యాక్ డ్యూరెబుల్‌తో హైసన్స్ ఒప్పందం



హైదరాబాద్ : ప్రముఖ ఒప్పంద తయారీ సంస్థ ఈప్యాక్ డ్యురబుల్‌తో హైసెన్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. ఒప్పందంలో భాగంగా అధునాతనమైన హైసెన్స్ ఎయిర్ కండీషనర్లు, ఇతర గృహోపకరణాలను ఈప్యాక్ సంస్థ ఉత్పత్తి చేయనుంది. మేకిన్ ఇండియా నినాదం ద్వారా స్థానిక ఉత్పత్తుల తయారీని పెంచడంతోపాటు హైసెన్స్ నూతన సాంకేతికంగా ఉన్నతమైన, ప్రీమియం నాణ్యత ఉత్పత్తులను భారత మార్కెట్‌కు పరిచయం చేయనున్నట్లు హైసెన్స్ ఇండియా సిఇఒ పంకజ్ రాణ తెలిపారు. ఈప్యాక్ యూనిట్లలో వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, ఇతర చిన్న గృహోపకరణాలతో సహా ఎయిర్ కండిషనర్ల తయారీకి పెట్టుబడి పెట్టనున్నట్టు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలోని ఈప్యాక్‌లో జూన్ 2025 నాటికి ఉత్పత్తిని ప్రారంభించనున్నామన్నారు.

లాజిస్టిక్స్ రంగంలో రికార్డ్ డిమాండ్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో పారిశ్రామిక, లాజిస్టిక్స్ రంగం రికార్డ్ స్థాయిలో 53.3 శాతం డిమాండ్ వృద్ధిని నమోదు చేసిందని సావిల్స్ ఇండియా తెలిపింది. తయారీ, గోదాములలో పంపిణీ సౌకర్యాలలో ఫ్యాక్టరీ భవనాలకు అధిక నాణ్యత సరఫరాకు గిరాకీ ఎక్కువగా ఉందని పేర్కొంది. ఢిల్లీ, ఎన్‌సిఆర్ సరఫరాలో 22 శాతం పెరుగుదల ఉండగా.. హైదరాబాద్‌లో 2 శాతంగా చోటు చేసుకుంది.

ధాన్యం సేకరణలో జాప్యం

- పంజాబ్‌లో ఎస్కేఎం ఆందోళన
- పలుచోట్ల రోడ్లు దిగ్బంధం
- కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ చర్చలు

న్యూఢిల్లీ-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్‌లో ధాన్యం సేకరణ ఆలస్యానికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన జరిగాయి. పంజాబ్‌లోని పలు చోట్ల రైతులు నాలుగు గంటల పాటు రోడ్లను దిగ్బంధించారు. లూథియానాలో, సమ్రాలా, ఖన్నా, దొరహా, మచివారా, జాగ్రావ్, ముల్లన్‌పూర్, రాయికోట్‌తో సహా పలు చోట్ల రైతులు వీధుల్లోకి వచ్చారు. కపుర్తలలో ఆందోళన చేస్తున్న రైతులు హమీరాలోని జలంధర్-అమృత్‌సర్ జాతీయ రహదారి, ధిల్వాన్ టోల్ ప్లాజా, ముండి మోర్ గ్రామ సమీపంలోని కపుర్తలా-గోయింద్‌వాల్ రహదారి, కొత్త ధాన్యం మార్కెట్ సమీపంలో కపుర్తలా-సుల్తాన్‌పూర్లోధి రహదారిపై ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు రైతులను ప్రయివేట్ వ్యాపారులు మోసం చేస్తున్నారని ఆందోళన చేస్తోన్న రైతులు విమర్శించారు. కపుర్తలా జిల్లాలోని పలు చోట్ల ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరసనలు తెలిపారు. హోషియార్‌పూర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు హోషియా ర్‌పూర్-ఫగ్వారా రోడ్డులోని రహీంపూర్ చౌక్ వద్ద ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. జలంధర్-పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై హాజీపూర్ చౌక్ వద్ద, దోసర్కా-హర్యానా రహదారిలోని పండోరి మాయల్ ధాన్యం మార్కెట్ ముందు కూడా నిరసనలు జరిగాయి. అమృత్‌సర్‌లో అజ్నాలా పట్టణ సమీపంలోని కుక్రవాలా వద్ద హైవేను దిగ్బంధించడంతో పాటు, భగత్వాలాలోని జిల్లా మండి అధికారి కార్యాలయం ముందు రైతులు నిరసన చేపట్టారు. కాగా, ఫగ్వారాలో రైతులు చేపట్టిన నిరవధిక నిరసన శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. శనివారం అక్కడ భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించనున్నట్టు రైతు నేత ప్రధాన కార్యదర్శి సత్నామ్ సింగ్ సాహ్ని తెలిపారు.ఎస్కేఎం నేత బల్బీర్ సింగ్ రాజేవాల్ మాట్లాడుతూ "పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వానికి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఈ విషయంలో సమాన బాధ్యత ఉంది" అని తెలిపారు. రైతులను, పంజాబ్ ఆర్థిక వ్యవస్థను పణంగా పెట్టి ఆటలాడొద్దని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం రెండూ రైతులు, దేశ ప్రయోజనాల కోసం నిజాయితీగా తమ విధులను నిర్వర్తించాలని అన్నారు. రైతుల ఆందోళన నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడి రాష్ట్ర రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

టార్గెట్ మహిళలే... నమ్మితే ముంచుడే

(మొదటిపేజీ తరువాయి)

పనిలేదంటూ నమ్మిస్తున్నది. అయితే, ఒక్కో మహిళను చేర్పితే అదనంగా వెయ్యిరూపాయలు వస్తాయని ఆశచూపుతున్నది. ఫోన్ చేస్తే మాత్రం ఎత్తడం లేదు. కేవలం ఆ ఫోన్‌నెంబర్ వాట్సాప్ గ్రూపునకు రెండు వాయిస్ మెసేజ్‌లు, ఒక స్కానర్ పంపుతున్నది. 'ఈరోజు మీరు ఫోన్ చేశారు కదా. మీకు ప్రత్యేక ఆఫర్ ఉందండి. మీరు వెంటనే చేరితే ప్రతినెలా ఫిక్స్‌డ్‌గా రూ.10 వేల వేతనం పొందచ్చుండి. నార్మల్ టైమ్‌లో అయితే ఇంత బోనస్ ఉండదు. మినిమం పది మంది చూడాలి. 23 గంటల్లో డీపీ స్క్రీన్‌షాట్ తీసి పంపండి. అది డిలీట్ అయితే డబ్బులు రావు. 50 మంది డీపీ చూస్తే రూ.3వేలు, 50 నుంచి 100 మంది వీవర్స్ ఉంటే రూ.4 వేలు, 100మందికిపైగా ఉంటే రూ.5 వేలు, 200 మంది దాటితే రూ.6 వేలు ప్రతి నెలా పొందవచ్చు. నెలంతా డీపీలు పెట్టాలి. నెల అయిపోయిన తర్వాత మీ ఫోన్‌పే నెంబర్ పంపితే రెండు, మూడు రోజుల్లో డబ్బులు ఖాతాలో పడిపోతాయి. ఈరోజు జాయిన్ అయిన వెంటనే కొత్తవాళ్లను మీరు జాయిన్ చేశారనుకోండి ఒక్కొక్కరి బోనస్‌గా వెయ్యి రూపాయల చొప్పున ఇస్తాం. ఐదుగురు సభ్యులు కాగానే మీరు కట్టిన రూ.300 తిరిగి వచ్చేస్తాయి. రూ.5 వేల బోనస్ యాడ్ అవుతుంది. తర్వాత చేస్తే బోనస్ రాదుగానీ రూ.300 మాత్రం రిటర్న్ వస్తుంది. మీరు జాయిన్ అవుతారు కదండి. మీకు కింద పంపిన స్కాన్ ద్వారా రూ.300 పే చేయండి. ఈరోజు రాత్రి 12 లోపు జాయిన్ అయితేనే ఆఫర్ వర్తిసుంది' అని తియ్యని, గౌరవ సూచక మాటలతో నమ్మిస్తున్నది. ఆ సంస్థ ప్రధాన టార్గెట్ మహిళలే. ఆ సంస్థ ప్రచారాన్ని నమ్మి హన్మకొండ, వరంగల్, హైదరాబాద్, పలు జిల్లాల ప్రజలు పెద్ద ఎత్తున అందులో రూ.300 చొప్పున కట్టారు. హన్మకొండ పట్టణానికి చెందిన ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయిని తన ఫ్రెండ్ వాట్సాప్ డీపీ చూసి రుద్ర టెక్నాలజీలో జాయిన్ అయింది. ఇంట్లో కూర్చొని వాట్సాప్ ద్వారా నెలకు రూ.3 వేల పైచిలుకు ఆదాయం పొందచ్చని తన స్నేహితులకూ చెప్పింది. ఇలా ఆమె స్నేహితులు, తన తోటి టీచర్లు, బంధువులు 50 మందికిపైగా వాట్సాప్ వాయిస్ మెసేజ్‌లో చెప్పినట్టుగానే ఒకరి ద్వారా మరొకరు గొలుసుకట్టుగా చేరిపోయారు. ప్రతిరోజూ డీపీలు స్క్రీన్ షాట్ తీసి పెట్టారు. ఇలా నెల పూర్తయింది. వారు చెప్పినట్టు ఫోన్‌పే నెంబర్ కూడా రుద్ర టెక్నాలజీ సంస్థకు వాట్సాప్ ద్వారా పంపారు. ఇలా రోజులు గడుస్తున్నా వారి ఖాతాలో మాత్రం డబ్బులు పడలేదు. ఫోన్ చేస్తే ఎత్తడం లేదు. తాము మోసపోయామని ఆ మహిళలకు అర్థమైంది. తమలా మరొకరు మోసపోవద్దని వేడుకుంటున్నారు. నవతెలంగాణ ప్రతినిధి ఆ నెంబర్‌కు పలుమార్లు ఫోన్‌చేసేందుకు యత్నించగా ఎత్తలేదు. అందరు మహిళలకు పంపినట్టుగానే రెండు వాయిస్ మెసేజ్‌లు, స్కానర్ మాత్రం వచ్చింది. వాట్సాప్ కాల్ ద్వారానైనా మాట్లాడాలని ప్రయత్నించినా లిఫ్ట్ చేయలేదు.

మాలా ఎవ్వరూ మోసపోకండి
రేష్మ, హన్మకొండ

గతంలో ఓ ప్రయివేటు పాఠశాలలో పనిచేసి బంద్ చేశా. అక్కడ పరిచయమున్న టీచర్ వాట్సాప్ డీపీని చూసి నేనూ రూ.300 కట్టా. నెలమొత్తం దానికి కొంత సమయం కేటాయించి డీపీలు పెట్టా. కొందర్ని చేర్పించాను కూడా. నెల అయిన తర్వాత నా ఫోన్‌పే ఖాతాలో డబ్బులు వేయలేదు. నాలుగైదు రోజులు చూసి ఫోన్ చేస్తే ఎత్తడం లేదు. స్నేహితులు, బంధువులకు ఫోన్‌చేస్తే అందరిదీ ఇదే పరిస్థితి. ఇలాంటి సంస్థల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నా.

కాంట్రాక్టు కార్మికునికి విద్యుద్ఘాతం

- సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తుండగా ఘటన
- కాలిపోయిన చేతిభాగం
- సంగారెడ్డిలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స

నవతెలంగాణ- జోగిపేట

సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అన్నాసాగర్ వద్దనున్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తుండగా ఓ కాంట్రాక్టు కార్మికుడు విద్యుద్ఘాతానికి గురయ్యాడు. దీంతో కుడి చేయి భాగం కాలిపోయింది. ఈ దుర్ఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ వద్దనున్న జేఎన్‌టీయూ కళాశాలకు సంబంధించిన సోలార్ కరెంటు కనెక్షన్ అన్నాసాగర్ 132 సబ్‌స్టేషన్ నుంచి ఉన్నది. అయితే కళాశాలలో విద్యుత్ సమస్య ఏర్పడటంతో ఏఈ అలీ హుస్సేన్ కళాశాలలో పనిచేస్తున్న కిషన్ అనే కార్మికున్ని తీసుకొని వెళ్లి సబ్‌స్టే షన్‌లో మరమ్మతులు చేసే ప్రయత్నం చేశారు. ఏఈ చెప్పడంతో ఎర్తింగ్ రాడ్‌తో వెల్డింగ్ పనులు చేస్తుండగా.. ఒక్కసారిగా విద్యుద్ఘాతానికి గురై కిషన్ కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని కుడి చేతి భాగం కాలిపో యింది. మరోపక్క చేతిలో ఎర్తింగ్ రాడ్ ఉండటంతో పెను ప్రమాదం తప్పిం దని స్థానికులు చెబుతున్నారు. కాగా అతన్ని వెంటనే జోగిపేట ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అంది స్తున్నారు. ట్రాన్స్‌కో ఏఈ, జేఎన్‌టీయూ ఏఈ, ఆపరేటర్లు అక్కడే ఉన్న ప్పటికీ.. ప్రమాదం ఎలా జరిగిందో అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ-వేంసూరు

ఓ టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కల్లూరు గూడెంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అడసర్లపాడుకు చెందిన తాటికొండ పాండు రంగాచారి(42) తన ఇంటి నుంచి మర్లపాడులో ఉన్న ఫౌండ్రీకి వస్తుండగా కల్లూరు గూడెం వద్ద ఓ టిప్పర్ గేదెలను తప్పించబోయి రంగాచారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దాంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతు నికి భార్య, పిల్లలు ఉన్నారు. వేంసూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గాడిన పడేనా..?

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో అవకతవకలు



- ఏటా సర్కార్ ఆదాయానికి రూ.కోట్లలో గండి
- అవే తప్పులు మళ్లీ జరుగుతున్నాయని కాగ్ అభ్యంతరం
- కొత్త డీఆర్, సబ్‌రిజిస్ట్రార్ల రాకతో తెరపైకి మరోసారి చర్చ

ఆస్తుల విలువ తగ్గించి...

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ విషయాన్ని కాగ్ ముందుగా పసిగట్టి హెచ్చరించినా అధికారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. చేసిన తప్పులనే మళ్లీ మళ్లీ చేస్తున్నారు. సుంకాలు, రుసుముల్లో భారీగా తేడాలు కనిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా రిజిస్ట్రార్లు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దాంతో అధికారులు ఉద్దేశపూర్వకంగానే అవకతవకలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జిల్లా రిజిస్ట్రార్‌తోపాటు మరి కొందరు సబ్ రిజిస్ట్రార్ల బదిలీ జరగడంతో ఆ శాఖలోని అవకతవకలపై మరోసారి చర్చ మొదలైంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు వసూళ్ల విషయంలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఇలాంటి వాటిని వెలుగులోకి తీసుకొచ్చే 'కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)' హెచ్చరించినా శాఖలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. దాంతో ప్రతి ఏటా జిల్లాలో రూ.కోట్లు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. 2019 నుంచి 2023 ఆర్థిక సంవత్సరాల రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాగ్ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు కీసర, శామీర్‌పేట, బాలానగర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టరైన దస్తావేజుల్లో ఆస్తుల విలువ తక్కువగా లెక్కించి సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు తక్కువగా వసూలు చేశారు. 2019 ఏప్రిల్ నుంచి 2021 సెప్టెంబర్ మధ్య కాలంలో పలు కేసులను పరిశీలించగా.. ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో నష్టం జరిగింది. దీనిపై 2023 ఫిబ్రవరిలో కాగ్ వివరణ కోరగా.. ఇంత వరకు సమాధానం ఇవ్వలేదు. జిల్లా కార్యాలయంతో పాటు బాలానగర్, కీసర, కుత్బుల్లాపూర్, శామీర్‌పేట, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2019 తర్వాత సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లను పరిశీలించిన కాగ్ అధికారులు పలు అవకతవకలను గుర్తించారు. ఈ కార్యాలయాల్లో గతంలో కూడా ఈ తప్పులు జరిగాయని హెచ్చరించినప్పటికీ మళ్లీ ఇప్పుడూ అవే తప్పులు పునరావృతమైనట్టు కాగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ కార్యాలయాలపై సరైన అంతర్గత తనిఖీలు లేనందునే అవే తప్పులు, అవకతవకలు మళ్లీ మళ్లీ జరుగుతున్నాయని కాగ్ ఆక్షేపించింది. అలాగే వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా వీటి విలువను తగ్గించి వాటిపై సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు వసూలు చేస్తున్నారని సైతం కాగ్ తెలిపింది.

రిజిస్ట్రేషన్ శాఖకు కాగ్ మొట్టికాయలు

జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖ పద్దులపై కాగ్ అభ్యంతరాలను వ్యక్తం చేసింది. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు అత్యధికంగా ఆదాయం సమకూరే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని రిజిస్ట్రేషన్ జరిగిన ప్రాపర్టీల అండర్ వ్యాల్యుయేషన్, పత్రాల తప్పు వర్గీకరణ, షార్ట్ లెవీ, నాల్ లెవీ ఆఫ్ డ్యూటీస్, రాబడి, తదితర తీరును తప్పు బట్టింది. శాఖాపరమైన అండర్ అసెస్‌మెంట్లు, ఇతర లోపాలను ఎత్తి చూపింది. కీసర, కుత్బుల్లాపూర్, శామీర్‌పేట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సంబంధించి మొత్తం 100కుపైగా కేసుల్లో స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ రుసుం కలిపి మొత్తం రూ.10 కోట్లు తక్కువ చూపినట్టు కాగ్ గుర్తించింది.

నగర శివార్లలోనే ఎక్కువ..

దస్తావేజులపై తక్కువ సుంకాలు విధించడం, వ్యవసాయేతర భూములకు వ్యవసాయ భూముల విలువ లెక్కించడం, దస్తావేజుల్లో ఆస్తుల విలువ తగ్గించి సుంకాలు, రిజిస్ట్రేషన్ రుసుములు వసూలు చేయడం దాదాపు శివార్లలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ జరుగుతోంది. దీనివల్ల ప్రభుత్వానికి జిల్లాలో రూ.కోట్ల ఆదాయానికి గండి పడుతున్నది. కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఉద్దేశపూర్వకంగానే ఇలాంటి తప్పులు చేస్తూ ప్రయివేటు వ్యక్తులకు మేలు చేస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. గతంలో అనేకసార్లు హెచ్చరిం చినా.. ఈ తప్పులు జరగడం చూస్తే శాఖాపరంగా సరైన తనిఖీలు జరగకపోవడమేనని కాగ్ ఆక్షేపించింది. కాగా, ఇటీవల శాఖలో బదిలీలు జరగడంతో కొత్తగా జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్.అశోక్‌కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన హయాంలోనైనా ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెగ్యులర్‌గా తనిఖీలు నిర్వహించి రిజిస్ట్రేషన్ శాఖను గాడిలో పెడతారో..? లేదో..? వేచి చూడాలి.

డీఏ లేదు...
317 జీవో నివేదికా లేదు



(మొదటిపేజీ తరువాయి)

కలిసిన విషయం తెలిసిందే. స్వయంగా సీఎం శుక్రవారం సాయంత్రంలోగా డీఏలపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అది నెరవేరకపోవడంతో వారు మనోవేదన చెందుతున్నారు. ఇంకోవైపు శుక్రవారం సీఎస్‌తో సమావేశం కావాలనీ, 317 జీవో నివేదికను తీసుకోవాలంటూ రేవంత్‌రెడ్డి చెప్పారు. సీఎస్‌ను ఉద్యోగ జేఏసీ నాయకులు కలిసినా ప్రయోజనం కలగలేదు. దీంతో శనివారం జరిగే మంత్రివర్గ సమావేశంపైనే అందరి ఆశలున్నాయి. డీఏ ప్రకటన, 317 జీవో విడుదల వంటి అంశాలపై స్పష్టత వస్తుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం రెండు లేదా మూడు డీఏలు ప్రకటించే అవకాశముందని తెలిసింది.

మంత్రివర్గంలోనే 317 జీవో నివేదికను బహిర్గతం చేస్తాం : సీఎస్

శుక్రవారం సచివాలయంలో సీఎస్ శాంతికుమారిని ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు నేతృత్వంలోని నాయకులు చావ రవి, శ్రీపాల్‌రెడ్డి, జి సదానందంగౌడ్, పి మధుసూదన్ రెడ్డి, కె జంగయ్య, దామోదర్‌రెడ్డి, నాగిరెడ్డి, అశోక్‌కుమార్, అబ్దుల్లా, కటకం రమేష్, ముజీబ్ హుస్సేనీ, ఎ సత్యనారాయణ, కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, కె కృష్ణుడు తదితరులు కలిశారు. 317 జీవో బాధిత ఉద్యోగులకు సంబంధించి మంత్రివర్గ ఉపసంఘం సమర్పించిన నివేదికపై చర్చించారు. ఆ నివేదికను ఇంకా తెరవలేదంటూ నాయకులతో సీఎస్ చెప్పినట్టు తెలిపారు. శనివారం జరిగే మంత్రివర్గ సమావేశంలో 317 జీవో నివేదికను ఆమోదించి, దాన్ని బహిర్గతం చేస్తామని వివరించారు. ఆ తర్వాత ప్రజలకు అందుబాటులో ఉంచుతామని సీఎస్ చెప్పారు.

317 జీవోను సవరించాలి : జగదీశ్వర్, శ్రీనివాసరావు

317 జీవో బాధిత ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరించాలని ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కోరారు. సీఎస్‌ను కలిసిన అనంతరం సచివాలయంలోని మీడియా కేంద్రంలో వారు మాట్లాడుతూ సీఎంతో ఉద్యోగ సంఘాల జేఏసీ జరిపిన సమావేశం విజయవంతమైందని చెప్పారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగుల ప్రతి దరఖాస్తును పరిశీలించి వారికి న్యాయం చేయాలనీ, అవసరమైతే సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి సర్దుబాటు చేయాలని సూచించారు. 317 జీవో లోపభూయిష్టంగా తెచ్చారనీ, ఉద్యోగ సంఘాలు లోపాలను గత ప్రభుత్వం దృష్టికి తెచ్చినా నిరంకుశంగా ఉద్యోగుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరించిందని అన్నారు. ఆ జీవోను తీసుకొచ్చి ఉద్యోగుల నెత్తి మీద రుద్దారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ జీవో కారణంగా స్థానికతకు అవకాశం ఇవ్వకుండా కేవలం సీనియార్టీ ప్రాతిపదికన కేటాయించడంతో, స్థానికులుగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానికేతరులుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలా ఉద్యోగులను పంపించడం వల్ల కుటుంబాలకు దూరమయ్యారనీ, భార్యాభర్తలు, వికలాంగులు, వితంతువులు, ఆరోగ్య సమస్యలున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 317 జీవో ఫలితంగా ఎన్నికల్లో ఉద్యోగుల ఆగ్రహాన్ని గత ప్రభుత్వం చవిచూసిందన్నారు. ఉద్యోగుల ఆకాంక్షల మేరకు 317 జీవోలో జరిగిన లోపాలన్నింటినీ సవరించి, ప్రతి ఒక్కరినీ వారి సొంత జిల్లాలు, జోన్లు, మల్టీజోన్లకు కేటాయించాలని కోరారు. 1975 రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా 2018 రాష్ట్రపతి ఉత్తర్వులను తేవడం, భార్యాభర్తలను ఒకచోట పని చేసే అవకాశం ఇవ్వకపోవడం వంటి అనే అంశాలున్నాయని చెప్పారు. గతంలో ఉన్న 5,6 జోన్లను ఇప్పుడు రెండు మల్టీ జోన్లుగా మార్చాలని సీఎస్‌ను కోరామన్నారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలనీ, రెండు, మూడు నెలలకోసారి సమావేశాలను నిర్వహించాలని సూచించామని అన్నారు.

317 జీవోలో స్థానికతను పరిగణలోకి తీసుకోవాలి : టీఈజేఏసీ చైర్మెన్ లచ్చిరెడ్డి

317 జీవోలో స్థానికతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని టీజీజేఏసీ చైర్మెన్ లచ్చిరెడ్డి చెప్పారు. సీఎస్‌ను కలిసిన అనంతరం సచివాలయంలోని మీడియా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ 317 జీవోపై సీఎస్‌కు పలు సూచనలు చేశామన్నారు. ఈ జీవో కారణంగా మెదక్, సిద్ధిపేట, నిజామాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ఉద్యోగులు ఎక్కువగా నష్టపోయారని చెప్పారు. బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తాము సూచించిన అంశాలపై క్యాబినెట్‌లో చర్చించాలని సీఎస్‌ను కోరామన్నారు. 2018లో జోనల్ వ్యవస్థపై ఏమాత్రం అవగాహన లేకుండా గత ప్రభుత్వం 317 జీవో తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులను సర్దుబాటు చేసే క్రమంలో అనేక తప్పిదాలు జరిగాయన్నారు. భార్యభర్తలిద్దరినీ ఒకే ప్రాంతానికి సర్దుబాటు చేయాలని కోరారు. అయితే పరస్పర, స్పౌజ్, ఆరోగ్య సమస్యలున్న బాధిత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నిర్మల, హన్మంతరావు, నవాత్ సురేష్, దర్శన్‌గౌడ్, హరికృష్ణ, కొంగల వెంకటి, వివేక్, చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రపు ఫీజులకే మెరుగైన వైద్యసేవలు

- ప్రయివేటు యాజమాన్యాలను కోరిన మంత్రి దామోదర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సామాన్యులకు నామమాత్రపు ఫీజులకే మెరుగైన వైద్యసేవలందిం చేందుకు ప్రయివేటు యాజమాన్యాలు ముందుకు రావాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. మెడిస్టార్ హాస్పిటల్ మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తెల్లరేషన్ కార్డు దారులకు ఓపీ సేవలను రూ.10కే అందించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా మెరుగైన వైద్యసేవలందిస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు వైద్యం భారం కాకుండా ప్రయివేటు, సేవా ఆస్పత్రులు కలిసిరావాలని కోరారు. రూ.10కే సేవలందిం చేందుకు ముందుకొచ్చిన మెడిస్టార్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడిస్టార్ ఆస్పత్రి ఎండి డాక్టర్ వెంకటే శ్వర్లు, డాక్టర్ కిరణ్, డాక్టర్ శివమోహన్ రెడ్డి, డాక్టర్ లత పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు స్పెషలిస్ట్ బోధనా వైద్యులను తరలించొద్దు

- లేకపోతే నిరవధిక సమ్మె తప్పదు : టీటీజీడీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు స్పెషలిస్ట్ బోధనా వైద్యులను తరలించొద్దని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం (టీటీజీడీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం సెక్రటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదల శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరి ంచారు. గ్రామస్థాయిలో వైద్య సేవలను మెరుగుపరిచేందుకు వైద్యుల నియా మకాలు, పట్టణ ప్రాంతాల్లోని వైద్య నిపుణుల ద్వారా టెలీ మెడిసిన్ సేవలు వినియోగించుకోవచ్చని సూచించారు. ఇప్పటికే డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ సిస్టమ్ రూపంలో వైద్య కళాశాల వైద్యులు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. దానికి అదనంగా వైద్య కళాశాలలో ఫ్యాకల్టీని గ్రామీణ ప్రాంతాల్లో నేరుగా ఉపయోగించడం వల్ల ఒకవైపు వైద్యుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న నూతన వైద్య కళాశాలకు ఇది అదనపు భారంతో పాటు జాతీయ వైద్య కమీషన్‌కు అవసరమైన కనీస హాజరు శాతం కరువై ఇవి వైద్య కళాశాలల మనుగడకే కష్టం కావచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో తరలింపు నిర్ణయాలు వ్యవస్థకు ఎంత మాత్రం ఉపయో గపడవని స్పష్టం చేశారు. ఇలాంటి విధానం దేశంలో మరెక్కడా అమలులో లేదని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తిరిగి సమీక్షించాలని కోరారు.

చేసిన పనికి డబ్బులడిగారని మైనర్లపై దాడి

- బంగారం షాపు యాజమాన్యం ఘాతుకం
- మేడిపల్లి పీఎస్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-బోడుప్పల్

చేసిన పనికి డబ్బులడిగితే తోటి మనుషులనే విచక్షణ కోల్పోయి ఇద్దరు మైనర్లపై ఎనిమిది మంది మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ ఆర్ గోవింద్ రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బోడుప్పల్ కార్పొరేషన్ పరిధి ప్రధాన మార్గంలో ఉన్న మంగళ్ గణేష్ జ్యూవెల్లరీ షాపు పై అంతస్తులో నివాసం ఉంటూ అదే భవనం వాచ్‌మెన్‌గా 16 ఏండ్ల బీస్తా పీరం, 14 ఏండ్ల పారోజ్ పనిచేస్తున్నారు. శుక్రవారం యాజమాన్యాన్ని చేసిన పనికి డబ్బులడిగారు. అయితే వారిపై దొంగతనం ముద్ర వేసి జ్యూవెలరీ షాపు నిర్వహకులైన ముఖేష్ సింగ్ చౌదరి, అర్జున్ సింగ్ చౌదరి, మనీష్, గజేందర్, చెన్నారాం, రాకేష్, రాజేష్, రామేష్ విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరిచారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకుని, గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

2019 నుంచే కాళేశ్వరంలో సమస్యలు

కాపర్ డ్యామ్ మునగడంతో ఎత్తు పెంచాల్సి వచ్చింది

- డిజైన్ల తయారీ ఆలస్యమైంది
- విచారణ కమిషన్ ఎదుట మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

2019 నుంచే కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సమస్యలు ఉత్పన్నమయ్యాయని రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు చెప్పారు. వాటిపై శాఖ ముఖ్యకార్యదర్శి, ఈఎన్సీ జనరల్ సమావేశాలు సైతం నిర్వహించారని తెలిపారు. న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ ఎదుట రెండో రోజూ హాజరయ్యారు. శుక్రవారం మరోసారి కమిషన్ ఆయన్ను క్రాస్ ఎగ్జామిన్ చేసింది. మూడు బ్యారేజీలకు సంబంధించిన పలు అంశాలపై వెంకటేశ్వర్లును కమిషన్ ప్రశ్నించింది. తొలుత నిర్మించిన కాపర్ డ్యామ్ వరదలో మునిగిపోవడంతో ఎత్తు పెంచాల్సి వచ్చిందన్న వెంకటేశ్వర్లు, డిజైన్ల తయారీలోనూ ఆలస్యమైందని చెప్పారు. డిజైన్ల ఖరారులో ఆలస్యం, మార్పుల కారణంగా అంచనా వ్యయం పెరిగిందని కమిషన్‌కు వివరించారు. డిజైన్‌లో మార్పులతో అంచనా వ్యయం అంత భారీగా పెరుగుతుందా? అని కమిషన్ ప్రశ్నించింది. ఈ దశలో వెంకటేశ్వర్లుపై కమిషన్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

కాళేశ్వరానికి ముందు ప్రాణహిత-చేవెళ్ల కోసం రూ.14 వేల కోట్లకుపైగా విలువైన పనులు చేశారనీ, అందులో రూ. 750 కోట్ల విలువైన పనులు ఫలితం లేకుండా పోయాయని వెంకటేశ్వర్లు తెలిపారు. సవరించిన అంచనా వ్యయాన్ని అప్పటి నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆమోదించారని గుర్తుచేశారు. మేడిగడ్డ విషయంలో సబ్‌స్టాన్షియల్ సర్టిఫికెట్, మిగతా రెండు బ్యారేజీలకు పూర్తి సర్టిఫికెట్ ఇచ్చామన్న వెంకటేశ్వర్లు, పనులు ఆలస్యం అవుతున్నప్పుడు మౌఖిక ఆదేశాలు జారీచేశామని గుర్తు చేశారు. అత్యవసరం కాబట్టే డ్రాయింగులు ఆలస్యమైనా పనులు చేయాలని చెప్పామని కమిషన్‌కు చెప్పారు.

అఫిడవిట్‌లో ఇచ్చిన సమాచారానికి, చెబుతున్న సమాచారానికి, సమాధానాలకు పొంతన లేదని కమిషన్ చైర్మెన్ మరోమారు నల్లా వెంకటేశ్వర్లుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరో చెబితే వారిని సంతృప్తి పరిచేందుకు పనులు చేశారనీ, వేరే వాళ్లు చేసిన తప్పులు మీద వేసుకునే ప్రయత్నం చేయకూడదని కమిషన్ సూచించింది. సాధారణం అంటూ సమాధానం చెప్పొద్దనీ, మూడు బ్యారేజీలకు సంబంధించి స్పష్టంగా సమాధానాలు ఇవ్వాలని ఆదేశించింది.

మా భూములు ఫార్మాకు ఇవ్వం

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడిని బంధించిన తండావాసులు
- వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఘటన
- ఫార్మా గ్రామాల్లో భారీగా పోలీసుల మోహరింపు

అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ- బొంరాస్‌పేట్

"మా తాతల నుంచి వచ్చిన భూములను ఎట్టి పరిస్థితుల్లో ఫార్మా కంపెనీ ఇవ్వబోమని" రైతులు తేల్చిచెప్పారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని పోలేపల్లి, హకీంపేట, పుల్చర గుంటతాండ, రోటిబండ తండా, లగచర్ల గ్రామాల్లో 1274 ఎకరాల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేసేందుకు రైతుల నుంచి భూమి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై మొదటి నుంచి తమ భూములను ఫార్మాకు ఇవ్వబోమని అంటున్న రైతులు.. కొన్ని రోజుల నుంచి రిలే దీక్షలు సైతం చేపట్టారు. శుక్ర వారం రైతుల అభిప్రాయాన్ని సేకరించేందుకు మండల అధికారులు సమావేశం ఏర్పాటు చేయగా.. ఫార్మా గ్రామాల రైతులు అడ్డుకున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ దుద్యాల మండలాధ్యక్షులు అవిటి శేఖర్ సమావేశానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ నుంచి లగచర్ల వస్తుండగా రోటిబండ తండా వద్ద ప్రజలు ఆయన్ను అడ్డుకుని నిలదీశారు. ఫార్మా రైతులతో మాట్లాడటానికి వెళ్తున్నట్టు చెప్పడంతో రైతులు ఆయనపై దాడి చేసి తండాలోని గ్రామ పంచాయతీ భవనంలో నిర్బంధించారు. తమ భూములు ఎట్టి పరిస్థితుల్లో ఫార్మాకు ఇవ్వబోమని తెలిపారు. పరిస్థితి ఉధృతంగా మారడంతో పోలీసులు రంగంలోకి దిగి రైతులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. అధికారులతో మాట్లాడే అవకాశం ఇస్తామని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కాగా, ప్రభుత్వం ఎకరాకు రూ.10లక్షలు, 125 గజాల స్థలం ఇచ్చేందుకు అంగీకరించింది.

అయినా తమ భూములు ఫార్మా కంపెనీకి ఇవ్వబోమని తేల్చి చెప్పారు.

ఖాన్ యూనిస్‌లో ఊచకోత

- ఇజ్రాయిల్ దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన 38మంది బలి
- మృతుల్లో 14మంది పిల్లలే
- అల్ షాటి శిబిరంపై దాడిలో మరో 20మంది మృతి
- లెబనాన్‌లో మరణించిన ముగ్గురు జర్నలిస్టులు
- కాల్పుల విరమణకే ప్రాధాన్యత అన్న లెబనాన్ ప్రధాని
- జాతి నిర్మూలన ఆపండి : బ్లింకెన్‌తో జోర్డాన్ మంత్రి స్పష్టీకరణ



గాజా, బీరుట్ : ఖాన్ యూనిస్ నగరంలో నివాస భవంతులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ ఆర్మీ జరిపిన దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన 38మంది మరణించారు. వీరిలో 14మంది పిల్లలే వున్నారు. ఆ దాడుల అనంతరం అల్ షాటి శరణార్థ శిబిరంపై కూడా దాడి జరిగింది. ఆ దాడిలో మరో 20మంది మరణించారు. ఉత్తర గాజాలోని జాబాలియా శరణార్థ శిబిరంలో డజనుకు పైగా నివాస భవనాలను ఇజ్రాయిల్ మిలటరీ పేల్చివేసింది. ఈ దాడిని పెద్ద ఊచకోతగా గాజా పౌర రక్షణ దళాలు అభివర్ణిస్తూ, పెద్ద సంఖ్యలో మరణాలు నమోదయ్యే అవకాశం వుందని హెచ్చరించాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ బలగాలు పెద్ద సంఖ్యలో అరెస్టులకు పాల్పడ్డాయి. పలు ఇళ్లపై దాడులు చేసి, వారి ఆస్తులను ధ్వంసం చేస్తూ 65మందిని అదుపులోకి తీసుకున్నారని స్థానిక వర్గాలు తెలిపాయి. ఒక ఇంటిని తాత్కాలిక మిలటరీ ఔట్‌పోస్టుగా మార్చి అరెస్టు చేసిన వారందరినీ అక్కడకు తరలించి, ఇంటరాగేషన్‌కు దిగినట్లు తెలుస్తోంది. జాతి ప్రక్షాళన చర్యలను ఇజ్రాయిల్ తక్షణమే ఆపాలని జోర్డాన్ డిమాండ్ చేసింది. అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్‌తో భేటీలో జోర్డాన్ విదేశాంగ మంత్రి ఐమెన్ సఫాది స్పష్టం చేశారు.

ఆస్పత్రిపై దాడి : చిక్కుకున్న 150మంది రోగులు

ఉత్తర గాజాలో ఇంకా పనిచేస్తున్న అతి కొద్ది ఆస్పత్రుల్లో కమల్ అద్వాన్ ఒకటి. శుక్రవారం ఆస్పత్రిపై దాడి చేయడంతో లోపల 150మంది రోగులు చిక్కుకుపోయారు. గురువారం మధ్యాహ్నం ఆ ఆస్పత్రిపై ఇజ్రాయిల్ సైన్యం దాడులు జరిపింది. ఆస్పత్రిలోని ఆక్సిజన్ స్టేషన్‌పై దాడి చేసిన ట్యాంకులు దాన్ని పూర్తిగా ధ్వంసం చేశాయి. ఈ దాడి ఫలితంగా అనేకమంది పిల్లలు మరణించారు. సిబ్బంది గాయపడ్డారని ఆస్పత్రి డైరెక్టర్ హుస్సమ్ అబూ సఫియా తెలిపారు. గత 20రోజుల దిగ్బంధనంలో వైద్య సేవలు బాగా దెబ్బతిన్నాయని గాజాలోని పౌర రక్షణ దళాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇదిలావుండగా, ఇజ్రాయిల్ ప్రతినిధి బృందం ఆదివారం దోహా బయలుదేరి వెళ్లనుంది. కాల్పుల విరమణ కోసం మళ్ళీ ప్రయత్నాలు ప్రారంభించనున్నట్లు అమెరికా ప్రకటించిన నేపథ్యంలో దోహాలో అందరూ సమావేశం కానున్నారు. ఇప్పటివరకు గాజాలో 42,847మంది మరణించగా, 1,00,544మంది గాయపడ్డారు.

ముగ్గురు జర్నలిస్టులు మృతి

మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు మరణించారు. ఈ దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండిస్తూ ఇదొక దారుణమైన నేరమని వ్యాఖ్యానించింది. దక్షిణ లెబనాన్‌లో జర్నలిస్టులను ఉద్దేశ్యపూర్వకంగానే లక్ష్యంగా చేసుకుని దాడి జరిపారని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ భాగే విమర్శించారు. అంతర్జాతీయ మానవతా చట్టాల కింద జర్నలిస్టులకు రక్షణ వుంటుందని, దాన్ని ఉల్లంఘించి మరీ దాడులు జరపారని పేర్కొన్నారు.

కాల్పుల విరమణ ఒప్పందానికి ప్రాధాన్యత : లెబనాన్

కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని లెబనాన్ తాత్కాలిక ప్రధాని మికతి చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా ఇజ్రాయిల్ దురాక్రమణను నిలువరించవచ్చన్నారు. లండన్‌లో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడుల కారణంగా ఇప్పటికి 14 లక్షల మంది ప్రజలు నిర్వాసితులయ్యారని మికతి తెలిపారు. పౌరులు, జర్నలిస్టులు, వైద్య సిబ్బందిపై దాడులు చేయడం ద్వారా ఇజ్రాయిల్ కూడా అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనకు పాల్పడిందని విమర్శించారు. ముందుగా కాల్పుల విరమణ పట్ల ఇజ్రాయిల్‌కు నిజమైన నిబద్ధత వుండాల్సిన అవసరం వుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో చోటు చేసుకున్న సంఘటనలు ప్రతి ఒక్కరి విశ్వసనీయతను దెబ్బతీశాయని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితులను నిలువరించాలంటే దౌత్య పరిష్కారం అత్యవసరంగా కనుగొనాల్సి వుందని బ్లింకెన్ పేర్కొన్నారు. హిజ్బుల్లా నిరాయుధీకరణపై అవగాహనకు రావడమే అసలైన కీలకాంశంగా వుంటుందన్నారు.

ట్రంప్ ఓ ఫాసిస్టు : కమలా హారిస్

ఫిలడెల్ఫియా: మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ఫాసిస్టు అని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ప్రకటించారు. ట్రంప్ హిట్లర్ నుంచి ప్రేరణ పొందాడని, ఆయన గనుక గెలిస్తే నియంతలా వ్యవహరిస్తాడని వైట్ హౌస్‌లో సుదీర్ఘకాలం పాటు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేసిన జాన్ కెల్లీ పేర్కొన్న మరుసటి రోజే హారిస్ తన రాజకీయ ప్రత్యర్థిపై ఈ వ్యాఖ్యలు చేశారు. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అమెరికాలో రాజకీయ వేడి పెరుగుతోంది. నియంతకు ఉండాల్సిన లక్షణాలన్నీ ట్రంప్‌లో పరిపూర్ణంగా ఉన్నాయని హారిస్ అన్నారు. డొనాల్డ్ ట్రంప్ ఫాసిస్టు అని మీరు నమ్ముతున్నారా? అని సిఎన్ఎన్ ప్రతినిధి అడిగినప్పుడు, అవును ఆయన ఫాసిస్టే అని చెప్పారు.

సీఎం రేవంత్‌రెడ్డిది చారిత్రాత్మక నిర్ణయం

- టీపీసీసీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేపట్టిన మూసీ పునర్జీవ కార్యక్రమం చరిత్రాత్మక నిర్ణయమని టీపీసీసీ అధికార ప్రతినిధి జ్ఞాన సుందర్ చెప్పారు. గతంలో ఉన్న ముఖ్యమంత్రులెవరూ ఈ సాహసం చేయలేదని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మూసీ ప్రక్షాళన చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని చెప్పారు. పేద ప్రజల గుండెల్లో చిరకాలం ఉండి పోతారని తెలిపారు. దక్షిణ కొరియాలో భారత రాయబారి అమిత్ కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కొనియాడుతున్నారని వివరించారు. మూసీతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూసీ గడ్డితిన్న గేదెపాలు కూడా ఎర్రగా వస్తున్నారని చెప్పారు. మూసీలో ఇండ్లు కట్టుకున్న వారు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. మూసీ ప్రక్షాళనకు మద్దతుగా పిల్లాయిపల్లి అవగాహన యాత్రకు రైతులు, కులవృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గుస్సాడీ కనకరాజు మరణం పట్ల మంత్రి సీతక్క సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గుస్సాడీనే తన ఇంటి పేరుగా మార్చుకున్న ప్రముఖ గుస్సాడీ నృత్య కళాకారుడు, గురువు, పద్మశ్రీ గుస్సాడీ కనకరాజు మరణం పట్ల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కనకరాజు మృతితో గుస్సాడీ ఒక పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుస్సాడీ నృత్యానికి జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన విలక్షణ కళాకారుడుగా కనకరాజు తన పేరును సుసంపన్నం చేసుకున్నారని పేర్కొన్నారు. కనకరాజు లేకుండా గుస్సాడీ నృత్యాన్ని ఊహించుకోవడం కష్టమని తెలిపారు. కొమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం మర్లవాయి గ్రామానికి చెందిన కనకరాజు వందల గుస్సాడీ ప్రదర్శనలు ఇవ్వడమే గాక ఎంతోమందికి ఆ నృత్యాన్ని నేర్పించారని ఆయన సేవల్ని గుర్తుచేశారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

బీసీ కులగణనపై కాంగ్రెస్ ఫోకస్

రాష్ట్ర విధానంపై అధిష్టాన పెద్దలకు వివరణ

కేసీతో డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్ భేటీ

- వేర్వేరుగా జరిగిన భేటీల్లో రాష్ట్రంలో తాజా పరిస్థితులపై ఆరా
- క్యాబినెట్ విస్తరణ, కొత్త కమిటీల్లో అన్ని వర్గాలకు చోటుపై సుదీర్ఘ చర్చ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ వ్యాప్తంగా జన గణనలో కుల గణనపై ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు మొదలు పెట్టింది. ఈ దిశలో పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణపై ఫోకస్ చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో బీసీ కులగణనపై హైకమాండ్ పెద్దలు దృష్టి సారించారు. ఈ సందర్భంగా శుక్రవారం అన్ని రాష్ట్రాలతో బీసీ కులగణనపై సమావేశం నిర్వహించారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి కాంగ్రెస్ నేషనల్ జనరల్ సెక్రెటరీ (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌తో భేటీ కావాల్సి ఉంది. అయితే డిప్యూటీ సీఎం భట్టి ఈ సమావేశానికి హాజరుకాగా మహేశ్ కుమార్ గౌడ్ ఫ్లైట్ రెండు గంటలు ఆలస్యం కావడంతో విడి విడిగా నేతలు భేటీ అయ్యారు. ఈ భేటీల్లో బీసీ కులగణన సర్వే విధివిధానాలు, దశల వారీగా చేపట్టనున్న సర్వేపై ఆరా తీశారు. ఈ నెల 28 నుంచి ఉమ్మడి జిల్లాల్లో చేపట్టబోయే కుల గణన విధానాలను నేతలు అధిష్టానానికి వివరించినట్టు తెలిసింది.

ప్రజా రంజకంగా పాలన

తెలంగాణలో కాంగ్రెస్ పాలన ప్రజా రంజకంగా సాగుతోందని కేసీ వేణుగోపాల్‌కు డిప్యూటీ సీఎం భట్టి వివరించారు. శుక్రవారం ఉదయం జరిగిన ఈ భేటీలో బీసీ కులగణన అంశం తర్వాత... రాష్ట్ర రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. గడిచిన మూడు నెలల పాలనపై రిపోర్ట్‌ను అందించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ దిశలో తెరపైకి వచ్చిన హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ, మంత్రి వ్యాఖ్యలు, ఇతర తాజా రాజకీయ పరిస్థితులు, సంక్షేమ కార్యక్రమాలు, అభివద్ధిపై కేసీకి భట్టి వివరించారు. అనంతరం అన్ని రాష్ట్రాల నేతలతో జరిగిన బీసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి పాల్గొన్నట్టు పార్టీ ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం కులగణనకు సర్వం సిద్ధం చేసిందని పార్టీ నేతలకు వివరించారు. కులగణనపై స్పష్టత రాగానే... ప్రభుత్వం అమలు చేయబోయే స్కీంలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల సాధన, ఇతర అంశాలను డిప్యూటీ సీఎం వివరించారు. దాదాపు కాంగ్రెస్ పది నెలల పాలనపై రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నట్లు వెల్లడించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇతర దేశాల వేదికగా సోషల్ మీడియా ప్రచారాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అలాగే జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ స్పెషల్ అబ్జర్వర్‌గా ఉన్న భట్టి ఇటీవల తొలిసారి ఆ రాష్ట్రంలో పర్యటించారు. స్థానిక నేతలతో భేటీ అయి... అక్కడ పార్టీని విజయ తీరాలకు చేర్చడంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ పర్యటనలో అక్కడ సేకరించిన సమాచారాన్ని కేసీతో భేటీలో వెల్లడించారు. అక్కడి పరిణామాలు, రాజకీయాలు, గెలుపు అవకాశాలు, ప్రచార అస్త్రాలపై కేసీ దష్టికి తీసుకెళ్లారు. అనంతరం పార్టీ ట్రెజరర్ అజయ్ మాకెన్‌తోనూ భట్టి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలోనూ జార్ఖండ్‌లో పార్టీ గెలుపు అంశాలను చర్చించినట్టు డిప్యూటీ సీఎం ఆఫీస్ వర్గాలు తెలిపాయి.

నెల పనితీరుపై ప్రోగ్రెస్ కార్డు

అధిష్టానం పిలుపుతో హస్తినకు చేరిన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ శుక్రవారం సాయంత్రం ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కేసీ నివాసంలో దాదాపు అరగంటకుపైగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. ముందుగా పీసీసీ చీఫ్‌గా తన నెలవారి ప్రోగ్రెస్ కార్డును మహేశ్ కుమార్ గౌడ్ అందించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైడ్రా, మూసీ సుందరీకరణ, గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనపై విపక్షాలు రాద్ధాంతం చేస్తోన్నా... ఏ విధంగా వాటిని తిప్పి కొడుతున్న విషయాలను అందులో ప్రస్తావించారు. అలాగే సోషల్ మీడియా, ఇతర దారుల్లోని ప్రజల్ని తప్పు దారిపట్టించేలా బీఆర్ఎస్, బీజేపీ చేస్తోన్న ప్రయత్నాలను ఎలా అడ్డుకుంటున్నారో ఆ అంశాలను వివరించారు. ప్రధానంగా తెలంగాణలో చేపట్టబోయే బీసీ కులగణనపై కేసీకి మహేష్ కుమార్ గౌడ్ వివరించారు. అలాగే పీసీసీ కొత్త కమిటీలపై అధిష్టానంతో చర్చించినట్టు తెలిసింది. అన్ని వర్గాలకు అవకాశం ఇస్తూ.. ఏ విధంగా పార్టీని బలోపేతం చేయబోతున్న అంశాలను కేసీ దష్టికి తీసుకెళ్లారు. కాగా మూడో రోజు పర్యటనలో పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్, ప్రియాంకా గాంధీని మహేశ్ కుమార్ గౌడ్ కలవనున్నట్టు సమాచారం.

త్వరలో కొత్త కమిటీలు

టీపీసీసీ చీఫ్‌గా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొత్త కమిటీలను నియమించలేదు. ఈ నేపథ్యంలో పీసీసీ కమిటీలను నియమించేందుకు ఆయన కసరత్తు చేస్తున్నారు. పీసీసీ కమిటీలో బీసీలకు ఎక్కువ అవకాశాలను కల్పించే విషయంలో అధిష్టానాన్ని ఒప్పించే ప్రయత్నం జరుగుతున్నట్టు సమాచారం. అలాగే కమిటీల్లో అన్ని వర్గాలకు చోటు దక్కేలా కూర్పు ఉండాలని ఆయన యోచిస్తున్నారు. ఇప్పటికే ఈ కమిటీల వ్యవహారం కొలిక్కి వచ్చినా అధిష్టానం పెద్దలను ఒకసారి సంప్రదించి ఫైనల్ చేసే అవకాశం ఉంది. ఈ ఢిల్లీ పర్యటనలో ఈ కొత్త కమిటీలకు ఆమోదం దక్కితే... త్వరలోనే వాటిని ప్రకటించనున్నారు. ఇక పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అలక, ఆయన అనుచరుడి హత్య విషయంపై కూడా అధిష్టానం ఆరా తీసినట్టు తెలిసింది. జీవన్ రెడ్డి రాసిన లేఖలోని సారాంశంపై పార్టీ శ్రేణుల్లో ప్రభావంపై చూపే ఆస్కారం ఉందని సూచించింది. ప్రధానంగా జీవన్ రెడ్డి వ్యాఖ్యలను విపక్షాలు రాజకీయ కోణంలో వాడుకునే అవకాశం ఉన్నందునా... సాధ్యమైనంత త్వరగా ఈ అంశాన్ని ముగించాలని సూచించింది. మరోవైపు త్వరలో జరగబోయే మంత్రి వర్గ విస్తరణ అంశంపై కూడా కేసీ వేణుగోపాల్... డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్ తో చర్చించినట్లు సమాచారం.

బాలలకు సాహిత్య, సంగీత, సాంస్కృతిక పోటీలు


తెలంగాణ సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులు చదివే బాలబాలికలకు సాహిత్య, సంగీత, సాంస్కృతిక రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, తెలంగాణ సంగీత నాటక అకాడమి చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో పద్యకవితలు (ఐదు పద్యాలు మించరాదు), వచన కవితలు(25 పంక్తులకు మించరాదు), కథలు (ఏ4 సైజులో మూడు పేజీలు), వ్యాసాల(ఏ4 సైజులో 3 పేజీలు) పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో సంగీతం(ఒక పాట 3 నిమిషాలకు మించరాదు), నృత్యప్రదర్శన (8నిమిషాలకు మించరాదు), ఏకపాత్రాభినయం(5 నిమిషాలకు మించరాదు) పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, జనజీవన విధానం, చారిత్రక వ్యక్తులు, భాష మొదలైన అంశాలపై రాసిన రచనలను మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. విద్యార్థులు తాము రాసిన రచనల్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ధ్రువీకరింపజేసే పత్రాన్ని విధిగా జతచేయాలని సూచించారు. విద్యార్థులు తమ పూర్తిపేరు, ఫొటో, తల్లిదండ్రుల పేర్లు, ఫోన్‌నెంబర్లు, ఇంటి, పాఠశాల చిరునామాలు పొందుపర్చాలని పేర్కొన్నారు. రచనలను నవంబర్ ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయానికి అందేటట్టు పంపించాలని కోరారు. ఆ తర్వాత వచ్చే రచనలను పరిగణనలోకి తీసుకోబోమనీ, బహుమతుల కోసం రచనల ఎంపికలో తుది నిర్ణయం తెలంగాణ సాహిత్య అకాడమి వారిదేనని స్పష్టం చేశారు. సాంస్కృతిక పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 9440966107ను సంప్రదించి నవంబర్ ఐదో తేదీలోగా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు.

ప్రపంచ వాణిజ్యంలో సుస్థిర అభివృద్ధి, మహిళా ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత

- అంగీకరించిన జి 20 వాణిజ్య మంత్రులు




బ్రసీలియా : సుస్థిర అభివృద్ధి, మహిళల ప్రాతినిధ్యం, వాతావరణ మార్పులపై కార్యాచరణ. డబ్ల్యుటిఓ సంస్కరణలు వంటి అంశాలకు ప్రపంచ వాణిజ్యంలో ప్రాధాన్యతనిచ్చేందుకు జి-20 వాణిజ్య మంత్రులు అంగీకరించారు. ఘర్షణల పరిష్కార వ్యవస్థ మరింత వేగంగా, సమర్ధవంతంగా పనిచేసేందుకు ప్రపంచ వాణిజ్య సంస్థలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం వుందని కూడా వారు అంగీకరించారు. బ్రెజిల్ ఉపాధ్యక్షుడు, వాణిజ్య మంత్రి గెరాల్డో అల్కమిన్ విలేకర్లతో మాట్లాడుతూ తెలిపారు. బ్రసీలియాలో జరిగిన జి20 వాణిజ్య మంత్రుల సమావేశంలో అంగీకరించిన ఈ ప్రతిపాదనలను నవంబరులో రియో డీ జెనీరోలో జరిగే వార్షిక సదస్సులో గ్రూపు నేతలకు తెలియచేస్తారు. అంతర్జాతీయ వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని కూడా పెంచాలన్న అంశంపై జి 20లో చర్చించడం ఇదే తొలిసారి అని అల్కమిన్ చెప్పారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా దీనిపై పట్టుబట్టారని, దాంతో ఇది జి 20 సిద్ధాంతంగా మారిందని చెప్పారు. అంతర్జాతీయ పాలనా సంస్థలను సంస్కరించాల్సిన అవసరం వుందని కూడా లూలా స్పష్టం చేశారు. ఆ మేరకే ప్రపంచ వాణిజ్య సంస్థల్లో సంస్కరణలకు మద్దతివ్వాలని, బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను బలోపేతం చేయాలని జి 20 మంత్రులు అంగీకరించినట్లు చెప్పారు. ఒక రోజు జరిగిన ఈ సమావేశంలో విభజనకర అంశాలను దూరం పెట్టారు. ఉక్రెయిన్, గాజాల్లో పరిస్థితులపై సభ్యులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. కొంతమంది చర్చ జరగాలని కోరగా, మరికొంతమంది ఇది సరైన వేదిక కాదని పేర్కొన్నారని బ్రెజిల్ ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. అనంగీకారం వున్న అంశాలను తొలగించి, ఏకాభిప్రాయంతోనే ఈ ప్రకటన జారీ చేసినట్లు అల్కమిన్ తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల కొరత?

2025-26 ఏడాదికి గానూ సమయానికి అందటం అనుమానమే

- ఎంప్యానెల్డ్ ప్రింటర్ల సంఖ్యను తగ్గించటమే కారణం
- 120 నుంచి 15కు కుదింపు
- ఏడాదికి 5 కోట్ల పుస్తకాలు ముద్రించిన కౌన్సిల్
- ఇప్పుడు పెరిగిన సిలబస్‌తో ఆ సంఖ్య 15 కోట్లకు
- ఎన్‌సీఈఆర్‌టీ తీరుపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన
- ప్రింటర్ల అసోసియేషన్ సైతం విస్మయం





న్యూఢిల్లీ : దేశంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) తీరు చర్చనీయాంశంగా మారుతున్నది. 2025-26 విద్యా సంవత్సరానికి పుస్తకాల కొరత ఉండనున్నట్టు తెలుస్తున్నది. కారణం, ఎన్‌సీఈఆర్‌టీ.. ఎంప్యానెల్డ్ ప్రింటర్ల సంఖ్యను తగ్గించటమే. ఈ సంఖ్యను 120 నుంచి 15కు కుదించింది. దీంతో ఎన్‌సీఈఆర్‌టీ తీరుపై పలు సీబీఎస్ఈ స్కూళ్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు.. ఇటు ప్రింటర్ల అసోసియేషన్ నుంచి కూడా ఆందోళన వ్యక్తమవుతున్నది. రాబోయే విద్యాసంవత్సరానికి గానూ పాఠ్యపుస్తకాల అవసరాలు మూడు రెట్లు పెరుగుతాయన్న అంచనాలు ఒకపక్క ఉన్న తరుణంలో ఎన్‌సీఈఆర్‌టీ ఈ నిర్ణయం తీసుకోవటం గమనార్హం.

దేశవ్యాప్తంగా సీబీఎస్ఈ స్కూళ్లలో విద్యార్థులందరికి కావాల్సిన పుస్తకాల సంఖ్య దాదాపు 5 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇందుకు దాదాపు 120 ఎంప్యానెల్డ్ ప్రింటర్లు పాఠ్యపుస్తకాలను ముద్రించేవి. ఇప్పుడు కౌన్సిల్ కూడా కొత్త పుస్తకాలను ప్రవేశపెట్టే యోచన చేస్తున్నది. ఇలాంటి తరుణంలో 2025-26 విద్యా సంవత్సరం నాటికి కావాల్సిన పుస్తకాల సంఖ్య మూడు రెట్లు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఒక అధికారి మాట్లాడుతూ.. పలు ఎంప్యానెల్డ్ ప్రింటర్ల పని తీరును ఎత్తి చూపారు. అవి పాత ప్రింటింగ్ మెషన్లను వాడుతున్నందున నాణ్యమైన పుస్తకాలను ముద్రించలేకపోతు న్నాయని చెప్పారు. ఆ ప్రింటర్ల సమస్య నుంచి దూరం కావటానికి ఏడాది క్రితం ఎన్‌సీఈఆర్‌టీ తాజా ఎంప్యానెల్‌మెంట్ ప్రక్రియను ప్రారంభించింది. ముద్రణలో నాణ్యతను మెరుగు పర్చటం కోసం 2000 ఏడాది తర్వాత తయారైన ప్రింటర్లను అనుమతించాలని నిర్ణయించినట్టు సదరు అధికారి వివరించారు. ఈ ప్రక్రియలో భాగంగా వంద ప్రింటర్లు దరఖాస్తు చేసుకోగా.. తగిన పత్రాలు లేకపోవటంతో 29 తిరస్కరణకు గురయ్యాయి. అధునాతన మెషన్ల విషయంలో ఫిజికల్ వెరిఫికేషన్ కోసం కన్సల్టెన్సీ సంస్థ రైట్స్‌ను ఎన్‌సీఈఆర్‌టీ ఆహ్వానించింది. వెరిఫికేషన్ తర్వాత 15 ప్రింటర్లు ఎంపికయ్యాయని అధికారి తెలిపారు. ఈ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కొందరు ప్రింటర్లు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించినా.. వారికి మాత్రం ఉపశమనం లభించలేదు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఎన్‌సీఈఆర్‌టీ నాలుగు, ఐదు, ఏడు, ఎనిమిదో తరగతుల కోసం కొత్త పుస్తకాలను ప్రవేశపెట్టనున్నది. 2022-23 విద్యా సంవత్సరంలో ఒకటి, రెండో తరగతులు, 2024-25 విద్యా సంవత్సరానికి మూడు, ఆరో తరగతుల కోసం కొత్త పుస్తకాలను ఎన్‌సీఈఆర్‌టీ తీసుకొచ్చింది. ప్రతి ఏడాదీ ఎన్‌ఈసీఆర్‌టీ ఐదు కోట్ల కొత్త పుస్తకాలను ఉత్పత్తి చేస్తుంది.

అయితే, కొత్త సిలబస్ కారణంగా 2025-26 విద్యా సంవత్సరానికి ఆ సంఖ్య దాదాపు మూడు రెట్లు పెరిగి 15 కోట్లుగా ఉంటుందని విద్యా మంత్రిత్వ శాఖ అంచనా. ఇటు ఎన్‌సీఈఆర్‌టీ తీరుపై ప్రింటర్ల అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నది. గ్రేటర్ నోయిడాకు చెందిన ఒక ప్రింటర్ శివ కుమార్ మాట్లాడుతూ.. ఐదు కోట్ల పుస్తకాల ముద్రణ కోసం 120 ప్రింటర్లు పని చేశాయనీ, ఇప్పుడు పెరిగిన పుస్తకాల డిమాండ్‌కు అనుగుణంగా 15 ప్రింటర్లు దానిని చేరుకోవటం అసాధ్యమని అన్నారు. అసలు ఎన్‌సీఈఆర్‌టీ వ్యూహమేమిటో తమకు అర్థం కావటం లేదని చెప్పాడు. ఇలా జరిగితే విద్యార్థులకు పుస్తకాలు సకాలంలో అందవని కుమార్ తెలిపాడు. రాబోయే విద్యా సంవత్సరానికి పుస్తకాల కొరతపై ప్రింటర్ల ఆందోళనల గురించి స్పందించటానికి ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ అందుబాటులోకి రాకపోవటం గమనార్హం.

ప్రపంచ సమనం

భారత - చైనాల స్నేహ పునరుద్ధరణ వెనుక

- భారత పరిశ్రమ వర్గాలు - బ్లూమ్‌బెర్గ్



ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ మధ్య ఇటీవలి పురోగతి వెనుక భారతీయ వ్యాపారాల వత్తిడి ఉందని బ్లూమ్‌బెర్గ్ రాసింది. ఈ రెండు పొరుగు దేశాలు ఈ వారం ప్రారంభంలో హిమాలయాలలోని వివాదాస్పద సరిహద్దు ప్రాంతంపై ఒక ఒప్పందానికి వచ్చాయి. రష్యాలోని కజాన్‌లో బుధవారం జరిగిన బ్రిక్స్ సదస్సులో దాదాపు ఐదేండ్ల తర్వాత మోడీ, జింగ్‌పింగ్‌ల మధ్య తొలి ద్వైపాక్షిక సమావేశం జరిగింది.

2020 సరిహద్దు ఘర్షణ తర్వాత చైనాపై విధించిన ఆంక్షలను సడలించాలని భారత పెట్టుబడిదారులు నెలల తరబడి మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఈ విషయం గురించి తెలిసిన పేరులేని అధికారులను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ రాసింది. ఈ చర్యల కారణంగా భారతీయ కంపెనీలకు ఎదురుదెబ్బలు తగిలాయని, ముఖ్యంగా చిప్‌మేకింగ్‌లో భారత్‌ను తయారీ కేంద్రంగా మార్చాలనే మోడీ పుష్‌ను దెబ్బతీస్తున్నాయని వివిధ కంపెనీల సీఈఓలు పేర్కొన్నారు. హిమాలయ పర్వతాలలో 3,500-కిమీ వివాదాస్పద సరిహద్దు అయిన లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్ ఏ సీ) వద్ద 2020లో జరిగిన ఒక సంఘటన తర్వాత న్యూ ఢిల్లీ , బీజింగ్‌ల మధ్య సంబంధాలు క్షీణించాయి. సైనికుల మధ్య జరిగిన ఘర్షణల్లో 20 మంది భారతీయ, నలుగురు చైనా సైనికులు మరణించారు. ఈ సంఘటన తరువాత, మోడీ ప్రభుత్వం భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలని కోరుకునే చైనా వ్యాపారాలపై కఠినమైన నిబంధనలను విధించింది. వందలాది చైనీస్ యాప్‌లను నిషేధించింది. వీసా ఆమోదాలను పరిమితం చేసింది. ఈ చర్యలు భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాలను నిర్మించడానికి చైనా కంపెనీ బివైడి 1 బిలియన్ డాలర్ల ప్రణాళికతో సహా అనేక పెట్టుబడుల ప్రతిపాదనలు పతనానికి దారితీశాయని బ్లూమ్‌బెర్గ్ నివేదించింది.తమ సంబంధాలను మెరుగుపరచడం , అభివ ృద్ధి చేయడంపై మోడీ సూచనలకు చైనా అధ్యక్షుడు "సూత్రప్రాయంగా" అంగీకరించాడు. జిన్హువా వార్తా సంస్థ ప్రకారం, మొత్తం సంబంధాలను ప్రభావితం చేయకుండా కొన్ని విభేదాలను నిరోధించడానికి ఇద్దరు నాయకులు అంగీకరించారు. చైనీస్ సాంకేతిక నిపుణుల కోసం వీసాలను వేగంగా ట్రాక్ చేయడం, రెండు దేశాల మధ్య నేరుగా విమానాలను నడపటం ద్వారా న్యూఢిల్లీ సంబంధాలను మెరుగుపర్చవచ్చని ఈ విషయం తెలిసిన అధికారులను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ నివేదించింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో కూడిన చైనీస్ తయారీ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పెట్టుబడి ప్రతిపాదనలు ఒక్కొక్కటిగా క్లియర్ చేయబడతాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి రంగాలలో మెజారిటీ యాజమాన్యంలోని భారతీయ కంపెనీలలో 10 శాతం వరకు చైనా పెట్టుబడులను అనుమతించే ప్రతిపాదనను కూడా భారతదేశం పరిశీలిస్తోందని, పేరు చెప్పని భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారిని ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇరాన్, ఇథియోపియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల బ్రిక్స్ ఆర్థిక సమూహంలో చైనా, భారతదేశం వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నాయి.

రష్యాను ఓడించగలమనే పశ్చిమ దేశాల కల

- 'కేవలం భ్రమ' : పుతిన్



పశ్చిమ దేశాలు రష్యా భద్రతకు ముప్పు తెచ్చేందుకు ఉక్రెయిన్‌ను ఉపయోగించుకుంటున్నాయని, అదే సమయంలో మాస్కో వ్యూహాత్మకంగా ఓటమి పాలవుతుందనే భ్రమను విశ్వసిస్తున్నారని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నాడు. గురువారం రష్యాలోని కజాన్‌లో జరిగిన ఔట్‌రీచ్/బ్రిక్స్ ప్లస్ ఫార్మాట్ సెషన్‌లో పుతిన్ మాట్లాడుతూ, "అన్నిటిపైనా, ప్రతి ఒక్కరిపైనా ఆధిపత్యం చెలాయించే తర్కంతో ఆలోచించడం, పనిచేయడం అలవాటు చేసుకున్న శక్తులు" "మరింత న్యాయమైన ప్రపంచ క్రమం" ఆవిర్భావానికి ఆటంకం కలిగిస్తున్నాయని అన్నాడు. "చట్టవిరుద్ధమైన ఏకపక్ష ఆంక్షలు", "ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పట్ల ఆందోళన" అనే నెపంతో పశ్చిమ దేశాలు ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ ప్రాంతీయ, ప్రపంచ వ్యూహాత్మక స్థిరత్వాన్ని తీవ్రంగా బలహీనపరుస్తున్నాయి. అలాగే "అంతర్రాష్ట్ర కలహాలు" ప్రోత్సహిస్తున్నాయని పుతిన్ పేర్కొన్నాడు. పుతిన్ ఉక్రెయిన్‌ను ఉదాహరణగా చూపుతూ, "రష్యా భద్రతకు సంపూర్ణమైన ప్రమాదాన్ని స ృష్టించడానికి" ఉపయోగించబడుతుందని పేర్కొన్నాడు. అదే సమయంలో మాస్కో ముఖ్యమైన ప్రయోజనాలతో పాటు దాని "రష్యన్ మాట్లాడే ప్రజల హక్కుల ఉల్లంఘన గురించి పట్టించుకోలేదు". కీవ్ విదేశీ మద్దతుదారులు "రష్యాపై వ్యూహాత్మక ఓటమిని కలిగించే వారి లక్ష్యాన్ని ఇకపై దాచుకోరు." పాశ్చాత్య దేశాలు తమ లక్ష్యాలను సాధించగలవని నమ్మడం కేవలం భ్రమ మాత్రమేనని పుతిన్ అన్నాడు. "రష్యా చరిత్ర తెలియని వారు మాత్రమే దీనిని విశ్వసించగలరు. ఎందుకంటే వారు శతాబ్దాలుగా రష్యన్ల ఐక్యత, వారి ఆత్మ బలాన్ని పరిగణనలోకి తీసుకోరు" అని పుతిన్ అన్నాడు.



కొత్త టీచర్ల నియామకపు తేదీ, వేతనాల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలి

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నూతన ఉపాధ్యాయుల ప్రథమ నియామకపు తేదీ, వేతనాల చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య ప్రధాన కార్యదర్శి చావ రవి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ-2024 ద్వారా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయుల మొదటి నియామకపు తేదీపై స్పష్టతనిచ్చి వేతనాలు చెల్లించాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఈనెల తొమ్మిదిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక ఉత్తర్వులు ఇచ్చిన సందర్భంగా విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం ఈనెల పదో తేదీ నుంచి వేతనాలు చెల్లిస్తామంటూ ప్రకటించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు ఈనెల 10,11 తేదీల్లో డీఈవో కార్యాలయాల్లో రిపోర్టు చేశారని తెలిపారు. ఇదేనెల 15న కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయిస్తూ పోస్టింగ్ ఆర్డర్లను ఇచ్చారని పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల్లో ఈనెల పదో తేదీన విధుల్లో చేరినట్టు పేర్కొన్నారని వివరించారు. కానీ ఉపాధ్యాయులు పాఠశాల లేదా ఎంఆర్సీలో రిపోర్టు చేసిన తేదీని (అక్టోబర్ 16న లేదా ఆ తర్వాత తేదీ) మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని కొందరు ప్రధానోపాధ్యాయులు /మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవో) అంటున్నారని తెలిపారు. నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరిన కొన్ని పాఠశాలల్లో ఈనెల 15 వరకు బదిలీ అయిన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల పది నుంచి 15 వరకు నూతన ఉపాధ్యాయుల వేతనాలు ఎలా చెల్లించాలనే సందేహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎంప్లాయీ ఐడీ కోసం దరఖాస్తు చేసిన సందర్భంలో ట్రెజరీ అధికారులు కూడా ఈనెల పదో తేదీని పాఠశాలల్లో చేరిన తేదీగా పరిగణించటం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రభుత్వ శాఖలు లేదా అధికారుల మధ్య సమన్వయం లోపించినందున నూతన ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. కావున క్షేత్రస్థాయిలో నెలకొన్న ఈ గందరగోళాన్ని తొలగించటం కోసం నూతన ఉపాధ్యాయుల ప్రథమ నియామకం తేదీని ఈనెల పదిగా పరిగణించాలని కోరారు. అప్పటి నుంచి జిల్లాలో ఉన్న ఖాళీ పోస్టుల నుంచి వారికి వేతనాలు క్లెయిమ్ చేయటానికి ప్రొవిజన్ ఇవ్వాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారుల (డీఈవో)కు, ట్రెజరీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ సంచాలకులకు లేఖలు ఇచ్చామని తెలిపారు.

పదో తేదీన చేరినట్టుగా పరిగణించాలి : డీటీఏకు వినతి

నూతన ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఈనెల పదో తేదీన చేరినట్టుగా పరిగణించాలని డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ (డీటీఏ)ను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి కలిసి వినతిపత్రం సమర్పించారు. పలు అంశాలపై చర్చించారు. నూతన ఉపాధ్యాయుల జాయినింగ్ తేదీని ఈనెల పదిగా పరిగణించాలని కోరగా నియామకపు తేదీలో ఇచ్చినట్టు ఎస్‌ఆర్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. డీఎస్ఈ నుంచి లేఖ వస్తే ఆ విధంగా వేతనాలు కూడా చెల్లించమని ట్రెజరీలకు ఆదేశాలు ఇస్తామన్నారని పేర్కొన్నారు. ఎంప్లాయీ ఐడీ నెంబర్ కోసం ఏ తేదీ వేసినా ఇబ్బంది లేదన్నారని స్పష్టం చేశారు. అర్హతలు లేక 24 ఏండ్ల స్కేలు పొందని వారు ఎస్‌ఏ, పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతుల పోస్టుల్లో ఎఫ్ఆర్ 22బీ ప్రకారం ఫిక్సేషన్ చేసుకోవచ్చని తెలిపారు. అయితే ఎస్‌పీపీ-2 స్కేలు పొందడానికి తగిన అర్హతలు లేవని ప్రొసీడింగ్స్‌లో పేర్కొనాలని సూచించారు. 24 ఏండ్ల సర్వీసు పూర్తైనప్పటికీ ఎస్‌పీపీ-2 స్కేలు పొందనివారికి ఎఫ్ఆర్ 22బీ వర్తింపుపై మరింత స్పష్టత కోసం ఆర్థిక శాఖకు వివరణ కోసం రాస్తామన్నారని పేర్కొన్నారు. బదిలీ అయి ఇటీవల రిలీవ్ అయిన ఉపాధ్యాయుల ఈనెల పూర్తి వేతనం (ఎల్‌పీసీ, ఎన్‌డీసీ)లో కొత్త స్టేషన్‌లో అనుమతించబోమని ట్రెజరీ అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారని తెలిపారు.

భళా బీఎస్‌ఎన్‌ఎల్..

- కొత్తగా 55 లక్షలకు పైగా ఖాతాదారుల చేరిక
- ప్రయివేటు టెల్కోలకు గుడ్‌బై

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెల్కో బీఎస్‌ఎన్‌ఎల్‌కు ఆదరణ భారీగా పెరుగుతోంది. ప్రయివేటు టెల్కోలు అడ్డగోలుగా పెంచిన టారీఫ్‌లను వినియోగదారులు భరించలేక.. బీఎస్‌ఎన్‌ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు. కొత్త ఖాతాదారులు లక్షల్లో వచ్చి చేరుతున్నారు. కేవలం రెండు నెలల్లోనే బీఎస్‌ఎన్‌ఎల్‌లో కొత్తగా 55 లక్షల మంది పైగా చేరారు. ఇదే సమయంలో ప్రయివేటు టెల్కోలు ఏకంగా 1.21 కోట్ల ఖాతాదారులను పోగొట్టుకున్నాయి. టెలికం నియంత్రణ సంస్థ ట్రాయ్ శుక్రవారం వెల్లడించిన గణంకాల ప్రకారం.. ఈ ఏడాది ఆగస్టులో బీఎస్‌ఎన్‌లో కొత్తగా 25.3 లక్షల మంది వినియోగదారులు చేరారు. ఇంతక్రితం నెల జులైలోనూ 29.3 లక్షల మంది కొత్తగా వచ్చారు.

టారీఫ్‌ల దెబ్బకు.. రిటర్న్ గిఫ్ట్

రిలయన్స్ జియో జులైలో తొలుత భారీగా టారీఫ్‌లను పెంచడం.. ఆ బాటలోనే భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు 25 శాతం వరకు టారీఫ్‌లను పెంచేశాయి. దీంతో ఆ భారాన్ని భరించలేక అనేక మంది బీఎస్‌ఎన్‌ఎల్ వైపు మొగ్గు చూపుతున్న విషయం తెలిసిందే. గడిచిన ఆగస్టు నెలలో జియో, ఎయిర్‌టెల్, విఐలు ఏకంగా 83 లక్షల మంది ఖాతాదారులను పోగొట్టుకున్నాయి. ఒక్క నెలలోనే రిలయన్స్ జియోను ఏకంగా 40.2 లక్షల మంది వదులుకున్నారు. భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌కు 24.1 లక్షల మంది గుడ్‌బై చెప్పగా.. విఐ 18.7 లక్షల మందిని కోల్పోయింది. ఇంతక్రితం జులైలోనూ ఈ మూడు టెల్కోలకు 38.6 లక్షల మంది ఖాతాదారులు గుడ్‌బై చెప్పారు.

ప్లాన్ల ధరలు పెంచం : బీఎస్‌ఎన్‌ఎల్

ప్రయివేటు టెల్కోలు ఉచిత కాల్స్ పేరుతో తొలుత స్వల్ప చార్జీలతో మార్కెట్లోకి వచ్చి.. కాలక్రమేణ అమాంతం పెంచేశాయి. కాగా.. బీఎస్‌ఎన్‌ఎల్ మాత్రం ఇటీవల తన ఖాతాదారులకు బలమైన హామీ ఇచ్చింది. తమ సంస్థ భవిష్యత్తులో టారీఫ్‌లను పెంచే యోచనలో లేదని ఇటీవల నూతన లోగో ఆవిష్కరణ సమయంలో స్పష్టం చేసింది. దీంతో ప్రయివేటు టెల్కోల్లో మరింత గుబులు మొదలయ్యిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బీఎస్‌ఎన్‌ఎల్‌కు ప్రయివేటు టెల్కోల ఖాతాదారుల వలస మరింత కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.

వాట్ ఈజ్ దిస్..

- బాధ్యత కలిగిన పదవిలో ఉండి అలాంటి వ్యాఖ్యలు తగవు
- కేటీఆర్ పరువునష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై నాంపల్లి కోర్టు అసహనం

హైదరాబాద్ : బాధ్యత కలిగిన పదవిలో ఉండి అలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని మంత్రి కొండా సురేఖపై నాంపల్లి కోర్టు అసహనం వ్యక్తం చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యల విషయంలో మంత్రి కొండా సురేఖపై నాంపల్లి కోర్టు పై విధంగా స్పందించింది. కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం దావాపై శుక్రవారం న్యాయస్థానం విచారించింది. ఒక ప్రజా ప్రతినిధి నుంచి ఇలాంటి మాటలు రావడం తీవ్ర అభ్యంతరకరమని కోర్టు అభిప్రాయపడింది. మంత్రి సురేఖ వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని చూపుతాయనీ. మరోసారి కేటీఆర్‌పై అలాంటి వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరించింది. ఆమె వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, ఇతర ప్లాట్‌ఫామ్‌ల నుంచి వెంటనే తొలగించాలని న్యాయస్థానం ఆదేశించింది.

కర్బన సామ్రాజ్యవాదం ఆందోళనకరం

- 96శాతం కర్బన ఉద్గారాలు అగ్రదేశాలవే
- అయినా పేద దేశాలను కట్టడి చేస్తున్న పశ్చిమ దేశాలు
- మార్పులను తట్టుకునేలా వంగడాలను సిద్ధం చేసుకోవాలి
- కేంద్ర పంటల బీమా డొల్లా
- మార్కెట్ నష్టాలను పట్టించుకోవడం లేదు
- పంట బీమాను గుర్తించడంలోనే లోపాలు
- గ్రామం యూనిట్‌గా పంటల బీమా రావాలి : చైతన్య సేద్యం, రైతు సంఘం సదస్సులో ప్రొఫెసర్ ఆర్ రామ్‌కుమార్



వాతావరణ మార్పులకు ఇదే ప్రధాన కారణం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రపంచాన్ని కర్బన సామ్రాజ్యం ఆందోళనకు గురి చేస్తున్నదని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ ఆర్. రామ్‌కుమార్ చెప్పారు. వాతావరణ మార్పులకు ప్రధాన కారణం కర్బన ఉద్గారాలేనన్నారు. 94 శాతం కర్బన ఉద్గారాలు అగ్రదేశాల నుంచి వస్తున్నాయన్నారు. సార్క్ దేశాల నుంచి 6 శాతం మాత్రమే అది విడుదల అవుతుందన్నారు. అయినా సార్క్ దేశాలపై కర్బన సామ్రాజ్యవాదులు దాన్ని కట్టడి చేయాలంటూ ఒత్తిడి పెంచుతున్నారని చెప్పారు. దీంతో వాతావరణంలో వస్తున్న మార్పులు వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. అకాల వర్షాలు, వరదలు, తుఫాన్లు, కరువులతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని తెలిపారు. ఇప్పటికే దేశంలో 76వేల కోట్ల మంది రైతులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎస్వీకేలో చైతన్యసేద్యం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చైతన్య సేద్యం పదవ వార్షికోత్స వాలను పురస్కరించుకుని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాదరావు అధ్యక్షతన 'ప్రతికూల వాతావరణ పరిస్థితులు- పంటలు, రైతుల బీమా అవసరాలు' అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ కర్బన ఉద్గారాలకు సరిహద్దులు లేవని చెప్పారు. కానీ బాధ్యత తమది కాదంటూ అగ్రదేశాలు చెబుతున్నాయని విమర్శించారు. కర్బనాలను తగ్గించుకునేందుకు పేద దేశాలకు రుణాలు ఇవ్వడం ఆశ్చర్యం కల్గిస్తోందన్నారు. వాతావరణ మార్పులను తట్టుకునేందుకు పంటలల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. కరువు పరిస్థితుల్లోనూ పంటలను రక్షించుకునేందుకు కొత్త పద్ధతులను అవలంబించాలని కోరారు. నూతన వంగడాలను తయారు చేసుకోవడం, రసాయనాలను తట్టుకోవడం, దిగుబడి పెంచుకోవడం, వరదలను తట్టుకునేందుకు ఖర్చులు పెంచుకోవడం, వ్యవసాయ పరిశోధనలను, నీటి ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడం, చెక్‌డ్యామ్‌లు నిర్మించుకోవడం వంటి కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. తాగునీరు, ఆహారం, ఉపాధి వంటి సామాజిక బాధ్యతను పెంచాల్సిన అవసరముందన్నారు. సాగు నేలలను శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసి, ఆయా నేలలకు సరిపడిన పంటలను వేయాలని సూచించారు. దేశంలోనే హరిత, క్షీర విప్లవం సాధించినప్పటికీ సమగ్ర పంటల బీమాను రూపొందించడంలో వైఫల్యం ఉందని చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు బీమా రావడం లేదనీ, నష్టపోయి రైతులకు బీమా అందుతుందన్నారు. వర్షపాతాన్ని మండల యూనిట్‌గా తీసుకోవడం వల్ల ఇలాంటి పొరపాట్లు జరుగుతున్నాయన్నారు. మండల కేంద్రంలోనే కాకుండా గ్రామాల్లో రెయిన్ గేజ్ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు రుణాలు తీసుకుంటున్న రైతులకు మాత్రమే పంట బీమా వర్తిస్తున్నదన్నారు. ప్రయివేటు అప్పులు తీసుకుని సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులకు పంటలబీమా వర్తించకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన తప్పులతడకగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్రాల వాటాల్లో కేంద్రం క్రమక్రమంగా తన వాటాను తగ్గించుకుంటున్నదని విమర్శించారు. రాష్ట్రాల వాటా సకాలంలో చెల్లించకపోయిన బీమా వర్తింప చేయడం లేదని విమర్శించారు. దీంతో గుజరాత్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్‌తోపాటు చాలా రాష్ట్రాలు పంటల బీమా నుంచి బయటకు వచ్చాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అసలు పంటల బీమా విధానమే లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో పంటల బీమా అమలు విషయంలో కాగ్ కేంద్ర ప్రభుత్వ డొల్లతనాన్ని బయట పెట్టిందన్నారు. 66శాతం మంది రైతులకు పంటల బీమా గురించి తెలియదనీ, ఆయా కంపెనీలకు రూ. 20వేల కోట్ల ప్రీమియం చెల్లిస్తే...ఎంత మంది రైతులకు బీమా చెల్లించారనే లెక్కలు కూడా అందుబాటులో లేవన్నారు. అందులో ఎస్సీ, ఎస్టీలు ఎంత మంది ఉన్నారో తెలియడం లేదని కాగ్ తప్పుపట్టిందన్నారు. పంటల బీమా ఉత్పత్తి, దిగుబడిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుందనీ, మార్కెట్ ఒడిదుడుకులను పరిగణనలోకి తీసుకోకపో వడం పెద్ద లోపమన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ పంటల బీమా అమలు జరుగుతున్న తీరును వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కందాల ప్రమీల, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి పౌండేషన్ బోర్డు సభ్యులు అమర్‌నాథ్, తెలంగాణ రాష్ట్ర రైతు సమితి అధ్యక్షులు జక్కుల వెంకయ్య తదితరులు ఉన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్‌శోభన్ వేదికపైకి ఆహ్వానించారు. చైతన్య సేద్యానికి సహకరిస్తున్న వారిని మెమోంటోలిచ్చి సన్మానించారు. అంతకు ముందు 'ప్రతికూల వాతావరణం మార్పులు రైతుల దుస్థితి నివారణ' బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

జగిత్యాల ఎమ్మెల్యే రాజకీయ వ్యభిచారి

- కాంగ్రెస్ వాళ్లు వాళ్లను వాళ్లే చంపుకుంటున్నారు
- సీఎం రేవంత్ రెడ్డి మోడీ నాయకత్వంలో పనిచేస్తున్నారు
- అమృత్ స్కీమ్‌లో రేవంత్ రెడ్డి బావమరిదికి రూ.1137 కోట్ల కాంట్రాక్టు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



నవతెలంగాణ - సిరిసిల్ల

"జగిత్యాల ఎమ్మెల్యే బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదని చెబుతున్నాడు.. మరి గాడిదలు కాయడానికి రేవంత్ రెడ్డితో కండువా కప్పించుకున్నాడా.. పార్టీకి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరితే.. ఒకరికి విడాకులు ఇవ్వకుండా మరొకరిని పెండ్లి చేసుకున్నట్టు.. దాన్ని వ్యభిచారం అంటారు. జగిత్యాల ఎమ్మెల్యే ఒక రాజకీయ వ్యభిచారి. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలూ రాజకీయ వ్యభిచారులే" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణమండపంలో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సెస్ వినియోగదారుల బహిరంగ విచారణలో శు క్రవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియా ఎదుట ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అంటుండగా, ఫిరాయింపులు జరగలేదని శ్రీధర్‌బాబు చెబుతున్నారని అన్నారు. పోలీసుల కుటుంబాలను పోలీసులే కొడుతున్నారని ఇంతకంటే సిగ్గుచేటు ఏమన్నా ఉంటుందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం ప్రధాని మోడీ నాయకత్వంలో పనిచేస్తున్నారన్నారు. అమృత్ స్కీమ్‌లో ముఖ్యమంత్రి బావమరిదికి రూ.1137 కోట్ల కాంట్రాక్టు ఇచ్చారని తాను చెబుతుంటే.. బీజేపీ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తన మీద ఏమైనా కేసులు పెట్టుకోవాలనుకుంటే ఏం పెట్టుకుంటారో పెట్టుకోండని, ఎందుకంటే ఇలాంటి కొత్త బిచ్చగాళ్లను ఎంతోమందిని చూశామని.. రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు నాయుడుతోనే కొట్లాడామని గుర్తుచేశారు. కేసులకు తాము భయపడబోమని చావుకు తెగించి తెలంగాణ ఉద్యమంలో కొట్లాడామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ పేరుతో ఉన్న విద్యుత్ కూడా లేకుండా చేస్తున్నదని, రూ. 18500 కోట్ల అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచే ప్రతిపాదనను తిరస్కరిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యుత్ సంస్థలపై గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలతో పదేండ్లు స్వర్ణయుగంగా మారిందని అన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే కరెంట్ కోతలు మొదలయ్యాయని తెలిపారు. దానికి తోడు ఇప్పుడు కరెంట్ చార్జీల వాతలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.



మందులకు, జీతాలకు కటకట

- బిల్లులు రాక ఈఎస్ఐ ఆస్పత్రుల విలవిల
- మూడేండ్ల నుంచి ఇదే పరిస్థితి
- భర్తీ కాని ఖాళీలు
- కార్మికులకు తప్పని కష్టాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్మికులకు సేవలందించాల్సిన ఈఎస్ఐ ఆస్పత్రులు సకాలంలో నిధులు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రంలో 17 లక్షల మందికిపైగా ఈఎస్ఐ కార్డుదారులుండగా, వారి కుటుంబాలతో కలుపుకుని దాదాపు 80 లక్షల మంది ఉన్నారు. రాష్ట్రంలో ఈఎస్ఐ డైరెక్టరేట్ పరిధిలో 6 ఆస్పత్రులు, 70కి పైగా డిస్పెన్సరీలున్నాయి. ఆరోగ్య సంరక్షణ కోసం ఉద్దేశించిన ఈఎస్ఐ కాస్తా పెద్ద రోగిగా మారిపోయింది. మందులకు, పరికరాలకు, ఈఎస్ఐ అద్దె భవనాలకు సకాలంలో కిరాయి చెల్లించకపోవడం, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు పెండింగ్‌లో పెట్టడం వంటి సమస్యలన్నింటికీ రాష్ట్ర ఆర్థికశాఖ నుంచి సకాలంలో బిల్లులు క్లియర్ కాకపోవడమే కారణంగా కనిపిస్తున్నది. దీనికి తోడు ఈఎస్ఐలోని సీనియర్ ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్ సొమ్మును కూడా పిల్లల వివాహాలు, ఇంటి నిర్మాణాలు తదితర కార్యక్రమాలు పెట్టుకుని దరఖాస్తు చేసుకుంటే అవి చెల్లించేందుకు కూడా నెలల తరబడి సమయం పడుతుండటం ఈఎస్ఐలో నెలకొన్న దుస్థితికి దర్పణం పడుతున్నది. రాష్ట్రంలో దీర్ఘకాలంగా పూర్తిస్థాయిలో భర్తీలు సైతం చేపట్టకపోవడంతో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. వైద్య, నర్సింగ్, పారామెడికల్, నాలుగో తరగతి ఉద్యోగుల్లో దాదాపు సగం వరకు ఖాళీలుండటంతో ఉన్నవారిపై పనిభారం షరామామూలుగా మారిపోయింది.

ఈఎస్ఐసీ నిబంధనల మేరకు ప్రతి ఐపీకి (ఇన్సూర్డ్‌పర్సన్) ఏడాదికి రూ.2,600 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేస్తున్నది. ఈ మేరకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.284 కోట్లకు బడ్జెట్ అంచనాలను రూపొందించింది. తొలి ఆరు నెలలకుగానూ రూ.142 కోట్లను ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద డిపాజిట్ చేసింది. ఇక్కడి నుంచి ఈఎస్ఐకు బిల్లుల క్లియరెన్స్‌లో జరుగుతున్న జాప్యం అంతిమంగా కార్మికుల ఆరోగ్య సేవలకు తీవ్ర ఆటంకంగా మారుతున్నది. ఈఎస్ఐకు మందులను సరఫరా చేసే పలు కంపెనీలు బిల్లుల రాక మందుల సరఫరాను నిలిపేశాయి. దీంతో అత్యవసర పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు కార్మికశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని చేసిన ప్రయత్నాలతో రూ.12 కోట్ల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడంతో కొంత మేర సమస్య పరిష్కారమైంది. అయినప్పటికీ ఇంకా రూ.15 నుంచి రూ.16 కోట్ల వరకు చెల్లింపులు చేయాల్సి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు రాకపోవడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి జరుగుతున్న జాప్యమే కారణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రికవరీ అయ్యేనా?

ఒకవైపు కార్మికుల సొమ్మును వారి ఆరోగ్య పరిరక్షణకు సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బందులుంటే మరోవైపు గతంలో జరిగిన స్కామ్‌ల విచారణ పూర్తి చేసి రికవరీ అవుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఔషధాలు, కిట్ల కొనుగోలు రూ.300 కోట్ల కార్మిక నిధుల గల్లంతు, టెలి మెడిసిన్ పేరుతో జరిగిన అవినీతిలో రూ.10 కోట్ల చెల్లింపులు, ఈఎస్ఐ ఆస్పత్రుల్లో నిర్మాణమే చేయని ఎస్టీపీల పేరుతో ఒక ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు రూ.80 లక్షల చెల్లింపు తదితర ఆరోపణలున్నాయి. వీటన్నింటిపై తగిన సమయంలో విచారణ జరిపించి రికవరీ చేయించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా ఆర్థికశాఖ సకాలంలో బిల్లులు క్లియర్ చేసి ఈఎస్ఐ ఆస్పత్రుల ద్వారా మెరుగైన సేవలందించాలని కోరుతున్నారు.

సీఎం సమీక్షించాలి
సమస్యల పరిష్కారానికి చొరవ చూపించాలి



నిధుల మళ్లింపు కారణంగా ఈఎస్ఐ కార్మికులకు మెరుగైన వైద్యసేవలందించలేకపోతున్నదని సీపీఐ(ఎం) నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు.

అవుట్‌సోర్సింగ్, యాక్టివిటీ ఉద్యోగులకు గత ఏడెనిమిది నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడం, అద్దెభవనాలకు కిరాయిలను చెల్లించకపోవడం, రకరకాల అవసరాలకు నిధుల లేమి, ఈఎస్ఐ ఆస్పత్రుల్లో బీపీ, షుగర్ టెస్టులకు అవసరమైన కిట్స్ లేక ఆపేయడం వంటి సమస్యలు పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులు తెలంగాణ డయాగ్నస్టిక్స్‌కు వెళ్లి టెస్టులు చేయించుకోవాలని సూచిస్తున్నారని చెప్పారు.

ఈఎస్ఐకు సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడం, విడుదలైన నిధుల్లో అవినీతి జరగడం, కార్మికశాఖ మంత్రి లేకపోవడం వెరసి ఈఎస్ఐ సమస్యల కుప్పగా మారిందన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ఈఎస్ఐపై సమీక్షించి ఇబ్బందులు, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్

తలసేమియా, సికిల్ సెల్, ఎనీమియా వ్యాధులను

అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- భద్రాచలంలో 20 పడకల తలసేమియా వార్డు ప్రారంభం
- భద్రాద్రి రామయ్య దర్శనం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాల్లోని చిన్నారుల నుంచి పెద్దవాళ్ల వరకు వచ్చే తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధులను అరికట్టేందుకు అన్ని చర్యలు చేపడతామని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శు క్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో రూ.46 లక్షలతో నూతనంగా నిర్మించబడిన 20 పడకల తలసేమియా, సికిల్ సెల్, ఎనీమియా వార్డును మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ పోదెం వీరయ్య, గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, సీఎస్ కమిటీ సభ్యుల సమక్షంలో గవర్నర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలో వైద్య సేవలను అభివృద్ధి చేయడంతో పాటు భద్రాచలం ఏరియా ఆస్పత్రిని కేంద్రం నిధుల నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం వార్డులను పరిశీలించి 21 సంవత్సరాల నుంచి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వెంకట రామమ్మ, ప్రవర్ష, ఇందు, సంపత్, కార్తికేయను పరామర్శించారు. వారికి నూతన దుస్తులు బహూకరించారు. తదుపరి రక్తనిధి కేంద్రాన్ని సందర్శించి తలసేమియా, సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి నిర్ధారణా పరికరాలు అందజేస్తున్న ఐటీసీ పీఎస్‌పీడీని అభినందించారు. తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు వైద్య సదుపాయాలు మెరుగు పరుస్తామని, ఆరోగ్యశ్రీ పథకంలో నమోదు చేయడానికి అర్హత పొందినందున తప్పనిసరిగా మారుమూల ప్రాంత గిరిజన కుటుంబాల్లో ఈ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. 2022, ఏప్రిల్ 11న అప్పటి గవర్నర్ తమిళి సై సౌందర రాజన్.. చేతుల మీదుగా శంకుస్థాపన చేయగా, పూర్తి చేసిన భవనాన్ని తాను ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, ఐఆర్‌సీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కాంతారావు, సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏటీడీఓ అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, డీఈ హరీష్, ఏఈ శ్రీనివాస్, ఐఆర్‌సీఎస్ సంస్థ సభ్యులు రాములు, సూర్యనారాయణ, భాను ప్రసాద్, రాజారెడ్డి, కామేశ్వరరావు, పాకాల దుర్గాప్రసాద్, ఎంవీఐ పుల్లయ్య, అబ్రహం, సత్యనారాయణ, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం దర్శించుకున్నారు. గవర్నర్‌కు దేవస్థానం ఈవో, అర్చకులు స్వాగతం పలికారు. ముందుగా బలిపీఠం వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గర్భగుడిలో పూజలు నిర్వహించారు. లక్ష్మీ తాయారు అమ్మ వారిని, శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో, అర్చకులు..గవర్నర్‌కు పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

ఏసీబీకి చిక్కారు

- కాంట్రాక్టు బిల్లుల మంజూరుకు లంచం
- రూ.1.10 లక్షలు తీసుకుంటూ పట్టుబడిన ఘట్‌కేసర్ మున్సిపల్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్



నవతెలంగాణ-ఘట్కేసర్

వినాయక నిమజ్జనం సందర్భంగా క్రేన్లు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేసేందుకు రూ.80 వేలు లంచం తీసుకుంటుండగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మున్సిపల్ ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సన్నీలను ఏసీబీ అధికారులు శు క్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ రంగారెడ్డి యూనిట్ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపల్‌లో కాంట్రాక్టర్ శివరాత్రి కుమార్ వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా టెండర్‌లో పాల్గొని ఎదులాబాద్ లక్ష్మీ నారాయణ చెరువు వద్ద మూడు క్రేన్లు ఏర్పాటు చేశాడు. దానికి సంబంధించి రూ.10 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. ఇదిలా ఉండగా బోడుప్పల్ కార్పొరేషన్ ఏఈ మంగురావు రాజశేఖర్ ప్రస్తుతం ఘట్‌కేసర్ మున్సిపల్ ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అవుట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా సన్నీ పనిచేస్తున్నాడు. అయితే వారు పలు కారణాలు చెప్పి బిల్లుల మంజూరులో జాప్యం చేస్తున్నారు. ఈ క్రమంలో బిల్లు మంజూరు కావాలంటే రూ.1.50 లక్షలు కావాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ శివరాత్రి కుమార్ చేసేది లేక ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచనల మేరకు ఏఈకి రూ.80 వేలు, వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు రూ.30 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. శు క్రవారం మధ్యాహ్నం లంచం డబ్బులు ఇచ్చేందుకు బోడుప్పల్ కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లగా ఆఫీసులో వద్దు.. ఇంటి వద్ద తీసుకుంటానని ఏఈ అన్నారు. దాంతో కాంట్రాక్టర్ ఏఈ ఇంటికి వెళ్లి లంచం ఇస్తుండగా ఏసీబీ రంగారెడ్డి యూనిట్ డీఎస్పీ ఆనంద్ కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. అలాగే సన్నీకి ఫోన్ పే ద్వారా రూ.30 వేలు పంపటంతో అతన్ని కూడా అదుపులోకి తీసుకొని లంచం డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఎవరెవరి పాత్ర ఉంది. ఇంకెవరైనా ఉన్నారా అనే అంశంపై విచారణ జరుపుతున్నట్టు అధికారులు తెలిపారు. లంచం తీసుకున్న ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు.

యువతి అదృశ్యం



నవతెలంగాణ-నాగోల్

ఓ యువతి అదృశ్యమైన ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివనాగ ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. నాగోల్ డివిజన్‌లోని బండ్లగూడ పరిధిలో గల ఆనంద నగర్ రోడ్ నెంబర్ 4లో నివాసం ఉంటున్న సీత అనూష.. ఈ నెల 25న మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో తన తల్లి స్నానం చేస్తుండగా బాత్రూం డోర్ బయటి నుండి గడియ పెట్టి, తల్లి ఫోన్ తీసుకొని వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆమె తల్లీదండ్రులు తీసుకెళ్లిన ఫోన్‌కు కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. వెంటనే ఆమె ఆచూకీ కోసం బంధుమిత్రుల వద్ద విచారించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె తల్లీదండ్రులు తమకు నరేష్ అనే యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు గుండోజి రఘునందన్ చారి తండ్రి స్వర్గీయ కీర్తిశేషులు రాఘవాచారి దశదినకర్మను బాలాపూర్ గ్రామంలోని వైబీఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆమెతో పాటు బీఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, చిగిరింత పెద్ద నర్సింహారెడ్డి, టి.గిరీష్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

కాంట్రాక్టు

కార్మికులను పర్మినెంట్ చేయాలని ధర్నా



- అర్హత కలిగిన కార్మికులకు ఇండ్లు ఇవ్వాలి
- దూర ప్రాంతాల నుండి వచ్చే కార్మికులకు బస్ పాస్ ఇవ్వాలి

నవతెలంగాణ-ఎల్బీనగర్

జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చంద్రమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కీసారి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనారోగ్య కారణాలతో పని చేయలేని వారి స్థానంలో వారి వారసులను అవకాశం ఇవ్వాలని కోరారు. డబ్బులు ఇచ్చిన వారిని నియామకం చేస్తూ, డబ్బులు ఇవ్వని వారిని కాలయాపన చేస్తూ తమ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. మిడ్ పంచిని ఎత్తివేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. పారిశుద్ధ్య సేవలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. జీహెచ్ఎంసీ కార్మికుల్లో అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, దూర ప్రాంతాల నుండి వచ్చే కార్మికులకు బస్ పాస్ ఇవ్వాలన్నారు. ఎస్ఎఫ్ఏలను దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో ఉంచొద్దని, దాని వలన కార్మికులకు వేధింపులు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో ప్రకారం మూడు సంవత్సరాలకు ఒకసారి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల నుండి డబ్బులు వసూలు చేసే ఎస్ఎఫ్ఏలను విచారణ చేసి ఉద్యోగం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్‌లో కాలనీలు అభివృద్ధి చెందిన కారణంగా కొత్త కార్మికులను నియమించాలని కోరారు. ఈ ధర్నాలో సరూర్ నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లెపాక వీరయ్య, సిహెచ్ వెంకన్న, జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, జీహెచ్ఎంసీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జంగయ్య, కమిటీ సభ్యులు యాదమ్మ, జయమ్మ, కలమ్మ, అంజమ్మ, ఎల్లమ్మ, బుచ్చమ్మ, పద్మ, లక్ష్మీ, అరణ, సంతోష, మంజుల, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్

డంపింగ్ యార్డు పక్కన నుంచి పోచంపల్లికి పోయే రహదారిని నిర్మించే కార్యక్రమంలో భాగంగా ఆ రోడ్డు గుండా పోయే దారిలో క్రీడాకు సంబంధించిన గోడ అడ్డుగా ఉన్న నేపథ్యంలో ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం క్రీడా డైరెక్టర్ వినోద్ కుమార్ సింగ్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన్సూరాబాద్ నుండి పాత పోచంపల్లి జెడ్.పీ. రోడ్డుకు సంబంధించి పోచంపల్లి రోడ్డు ఈ రహదారి 90 సంవత్సరాలకు పైగా ఉనికిలో ఉండే ఈ ప్రాంత వాసులకు కీలక అనుసంధానంగా ఉండేదని తెలిపారు. అటవీశాఖ(క్రీడా) రహదారికి అడ్డుగా గోడను నిర్మించడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని, అడ్డంకులు తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సంబంధిత విభాగాలతో జరిపిన విచారణలో, వివిధ అధికారిక రికార్డులలో వివరించిన విధంగా, రహదారి నిజానికి దీర్ఘకాల ప్రజామార్గం అని అన్నారు. అటవీశాఖ గోడ కారణంగా ఏర్పడిన అడ్డంకి కీలకమైన ప్రజా మార్గాన్ని అడ్డుకోవడమే కాకుండా చాలా మంది నిర్వాసితులకు తమ రోజువారీ రాకపోకలకు ఆధారపడే ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కి ప్రవేశానికి ఆటంకం కలుగుతుందని అన్నారు. ప్రజా ప్రయోజనం రహదారి ఉనికికి చారిత్రక, చట్టబద్ధమైన ప్రాతిపదికన, అడ్డంకిని తొలగించడం ద్వారా ఈ ముఖ్యమైన మార్గంలో ప్రజలు స్వేచ్ఛగా ప్రయాణించే హక్కును నిర్ధారించడం ద్వారా రహదారిని పునరుద్ధరించడానికి తక్షణమే చర్య తీసుకోవాలని కోరారు.

కమిషనర్ ఇలంబర్తి

కుక్కల బెడద నివారణకు స్టెరిలైజేషన్

అధిక సంఖ్యలో చేపట్టాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో కుక్కల బెడద నివారణకు స్టెరిలైజేషన్ అధిక సంఖ్యలో చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఎల్బీనగర్ జోన్ ఫతుల్లగూడ జంతు సంరక్షణ కేంద్రాన్ని, డాగ్ క్యాచింగ్ వెహికల్, కుక్కల ఆపరేషన్ థియేటర్, పెంపుడు కుక్కల క్రిమిటోరియం, సీ అండ్ డీ ప్రాసెసింగ్ ప్లాంట్‌లను పరిశీలించారు. కుక్కలను పట్టుకునే వాహనాలు రోజుకు ఎన్ని కుక్కలను పట్టుకుంటున్నారు? రోజుకు ఎన్నింటికి స్టెరిలైజేషన్ జరుగుతున్నాయి అంటూ కమిషనర్ చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్‌ను అడిగారు. స్టెరిలైజేషన్ చేసిన కుక్కల వివరాలు, జోన్‌లోని సర్కిల్ వారీగా పట్టుకున్న కుక్కల వివరాలను డాక్టర్ వకీల్ కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...సర్కిల్ వారీగా వెహికల్ ఉన్న నేపథ్యంలో ఎక్కువ మొత్తంలో పట్టుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుక్కల బెడద, కుక్క కాటు నివారణకు శస్త్ర చికిత్సలు చేసినప్పుడు మాత్రమే ఫలితాలు ఉంటాయన్నారు. అందుకు రోజు వారీగా సమీక్షించి అధిక సంఖ్యలో కుక్కలను పట్టుకునే విధంగా క్షేత్ర స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేయాలన్నారు. డాగ్ క్యాచర్‌లకు సెట్లను అందజేయాలని సూచించారు. పెట్ డాగ్‌ల క్రిమిటోరియం పరిశీలించి నెలకు ఎన్ని జరుగుతున్నాయని నిర్వాహకులను అడుగగా నెలకు సుమారు 30 నుండి 35 వరకు క్రిమిటోరియం చేస్తున్నట్లు వారు కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్ భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ యూనిట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా 500 టన్నుల కెపాసిటీ గల నాలుగు భవన నిర్మాణ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ఈ ఈ శ్రీనివాస్ రెడ్డి కమిషనర్‌కు వివరించారు. రాంకీ ద్వారా జీడిమెట్ల, ఫతుల్లగూడలలో ఏర్పాటు చేయగా, సోమా శ్రీనివాస్ రెడ్డి ద్వారా శంషాబాద్, తూముకుంటలలో యూనిట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషనర్ వెంట ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హెల్త్ అడిషనల్ కమిషనర్ పంకజ, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, జోనల్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ రంజిత్, హయత్ నగర్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

28న బీసీ హక్కుల

సాధన సమితి రాష్ట్ర సదస్సు



నవతెలంగాణ -నాగోల్

ఈ నెల 28న బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర సదస్సును హైదరాబాద్‌లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ డాక్టర్ నిరంజన్, మాజీ రాజ్యసభ సభ్యులు, బీసీ రాష్ట్ర నాయకులు ఆర్. కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ టి. చిరంజీవి, కొత్తగూడెం శాసనసభ్యులు కే. సాంబశివరావు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్. బాల మల్లేష్, టి. వెంకట రాములు హాజరవుతారని పేర్కొన్నారు. సదస్సులో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య వైద్య రంగాలన్నింటిలో వెనుకబడి, తీవ్ర అన్యాయానికి గురవుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల సమస్యలపై అవలంబిస్తున్న విధానాలు పైన, దేశంలో, రాష్ట్రంలో కుల గణన, చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంపు మొదలైన అంశాలపై చర్చించనున్నట్టు వెల్లడించారు. బీసీల సమస్యల సాధన కోసం తగు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుండి బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

పురుషులతో సమానంగా మహిళలు రాణించాలి

- కార్పొరేటర్ బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

నేటి సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం ఎంతో అవసరమని కార్పొరేటర్ బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ 5వ డివిజన్ వినాయక హిల్స్ కాలనీ కమ్యూనిటీ హాల్, పార్క్ నందు జన శిక్షణ సంస్థాన్ వారి ఆధ్వర్యంలో మహిళలకు వృత్తి నైపుణ్య (బ్యూటీషన్, టైలోరింగ్, క్యాండిల్ మేకింగ్ మొదలగు) శిక్షణ తరగతులను శుక్రవారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు వివిధ వృత్తి శిక్షణలో రాణించి.. ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. నేటి సమాజంలో మహిళలు పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఆసక్తి గల మహిళలు ఉచిత నైపుణ్య శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థాన్ సంస్థ సభ్యులు, పలు కాలనీల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ రెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం

- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రగన్నగూడ గ్రామవాసి, బీజేపీ సీనియర్ నాయకులు సామ అల్వాల్‌రెడ్డి ఇటీవల గుండె పోటుతో మరణించారు. ఈ మేరకు రాగన్నగూడలోని అల్వాల్‌రెడ్డి నివాసంలో ఆయన సతీమణి సంధ్య, చిన్నారులను శుక్రవారం వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి శశిధర్, తదితరులతో కలిసి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పరామర్శించారు. అనంతరం త్రిపుర గవర్నర్ మాట్లాడుతూ అల్వాల్‌రెడ్డి పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు మరువలేనవని, ఆయన కుటుంబానికి అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సామ భీమ్‌రెడ్డి, సామ సంజీవరెడ్డి, సామ బాలకృష్ణారెడ్డి, హరికృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నేతలు కళ్లెం బాల్‌రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, గోగిరెడ్డి లచ్చిరెడ్డి, జీఆర్ కరుణాకర్, బచ్చిగళ్ల రమేష్, తూళ్ల నర్సింహాగౌడ్, కొత్త రాంరెడ్డి, కడారి అనిల్‌కుమార్, ఎల్మటి వెంకటరెడ్డి, మైలారం బాబు, దార వెంకటేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

'30న మాదిగల ధర్మయుద్ధ మహాసభ'



నవతెలంగాణ-చంపాపేట్

ఈ నెల 30న నిర్వహించనున్న మాదిగల ధర్మయుద్ధ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టీవీ నరసింహారావు మాదిగ కోరారు. యాకత్‌పుర నియోజకవర్గం చంద్రయ్య హట్స్ కాలనీలో రెడ్డపాక శరత్ కుమార్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే మహాసభకు ముఖ్య అతిథులుగా మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నట్టు తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా దేశంలో వర్గీకరణను మేమే మొదట అమలు చేస్తాం, అన్ని నోటిఫికేషన్లకు వర్తించేలా ఆర్డినెన్స్ తెచ్చి ఉద్యోగాలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి మాట ఇచ్చారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా పంజాబ్, తమిళనాడు, హర్యానలో అమలు అవుతుంటే.. ఇక్కడ నమ్మించి, మోసం చేసి కమిటీలు, కమిషన్లతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోవడం వలన డీఎస్సీతో పాటు యూనివర్సిటీలలో, విద్య రంగంలో అడ్మిషన్లు, న్యాయబద్ధంగా రావాల్సిన వాటా దక్కకుండా పోతుందని ఆవేనద వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును ధిక్కరిస్తూ.. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను తప్పి, వర్గీకరణ లేకుండానే ఉద్యోగ నియమకాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం చేపడుతున్న ఉద్యోగ నియమకాలను వెంటనే నిలిపివేసి, కమిషన్ రిపోర్టు అనంతరం వర్గీకరణ అమలు చేస్తూ నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న జరగబోవు జిల్లా మహాసభను విజయవంతం చేయడానికి నియోజకవర్గ పరిధిలోని మాదిగ, మాదిగ ఉప కులాలు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద ఆంజనేయులు, భూమయ్య, రామచందర్, యాదగిరి, శంకర్, అంజయ్య, మునేష్ వెంకటస్వామి, రమేష్, గారా లక్ష్మి యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా పాలన అందించడమే లక్ష్యం : మేయర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

అవినీతికి తావు లేకుండా ప్రజా పాలన అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్ 12వ డివిజన్ మహమ్మద్ మసీదు సమీపంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్‌తో కలిసి శుక్రవారం మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్ సుక్క శివ కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-హయత్‌నగర్

ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీజ, వేమాచారి దంపతులు సామ నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 23న భార్యభర్తలు ఇద్దరు గొడవ పడ్డారు. దీంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వేమాచారి బయటకి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేస్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సరస్వతికి ప్రతి రూపం పులిగడ్డ విజయ లక్ష్మి

నవతెలంగాణ-కల్చరల్

జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని బాల్య వివాహం చేసుకున్నా..చదువుకోవాలన్న లక్ష్యంతో డాక్టరేట్ పొంది ఆచార్యులుగా పదవీ విరమణ చేసిన పులిగడ్డ విజయ లక్ష్మి చదువుల సరస్వతికి ప్రతి రూపం అని సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కేవీ రమణ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా లలిత కళా వేదికపై సాహితీ జిగీష సాహిత్య సంస్థ నిర్వహణలో ఆచార్య పులిగడ విజయ లక్ష్మి సహస్ర పూర్ణ చంద్ర దర్శనం అనగా 82 ఏళ్ల జన్మ దిన వేడుక సాహిత్య సమ్మిళితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ.. జన్మ దినం అర్థవంతంగా తనకు అభిరుచి ఉన్న సాహిత్య వేదికగా జరుపుకోవచ్చు అని, విజయ లక్ష్మి ఆదర్శంగా నిలిచారు అని అన్నారు. తల్లిని గురువుగా భావించే సంప్రదాయంతో విద్యావంతులు కుమార్తెలు విజయ లక్ష్మి జన్మ దినాన్ని శోభాయమానంగా జరపడం అభినందనీయమన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ..విజయ లక్ష్మి జీవితం నేటి మహిళలందరికీ స్ఫూర్తి కావాలన్నారు. చిన్న తనంలోనే వివాహం చేసుకొన్న విజయ లక్ష్మి.. తన లక్ష్యం వదలక ఉన్నతవిద్య చదివి భిన్న ప్రక్రియలలో రచయిత్రిగా గుర్తింపు పొందారని కొనియాడారు. డాక్టర్ లలితా వాణీ స్వాగతం పలికిన సభలో సంస్థ అధ్యక్షుడు రామ చంద్ర రావు వందన సమర్పణ చేశారు. కార్యక్రమం తొలుత సాహితీ వేత్తలు దత్తాత్రేయ శర్మ పోతన భాగవతం లోని ప్రహ్లాద చరిత్ర, ఆచార్య పతంజలి కృష్ణ కుచెల, ఆచార్య ఉమా శశి గజేంద్ర మోక్షము ఘట్టాలు ఆసక్తికరంగా ప్రసంగించారు.



వ్యభిచారం నిర్వాహకురాలికి జీవిత ఖైదు

నవతెలంగాణ-హయత్ నగర్

సులభంగా డబ్బు సంపాదించడం కోసం ఓ మైనర్‌ను కొనుగోలు చేసి.. ఆమెను వ్యభిచార గృహంలోకి దింపిన మహిళకు జీవిత ఖైదుతో పాటు రూ.3,19,000 జరిమానాను హయత్ నగర్ కోర్టు విధించినట్లు హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ వెల్లడించారు. 2023లో హయత్ నగర్‌లో ఖమ్మం జిల్లాకు చెందిన కుక్కల ఆశ అలియాస్ సాయి దాజీ..వ్యభిచారం నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పూర్తి ఆధారాలను కోర్టులో సమర్పించారు. ఒక్క ఏడాదిలోనే ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ ద్వారా తీర్పువెలువడింది. కుక్కల ఆశ కు జీవిత ఖైదుతో పాటు జరిమానాను కోర్టు 9వ అడిషనల్ డిస్టిక్ అండ్ స్టేషన్స్ జడ్జి హరిశ విధించారు. అభియోగపత్రం దాఖలు చేసిన వారిలో ఇన్‌స్పెక్టర్లు హెచ్ వెంకటేష్, కే పురుషోత్తం రెడ్డి. ఉన్నారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోమలత, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేష్ కుమార్ , డ్యూటీ పోలీసులు ప్రవీణ్ కే సతీష్ ఉన్నారు.

సెల్ ఫోన్ దుకాణంలో చోరీ



నవతెలంగాణ - హయత్‌నగర్

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ జరిగిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుంట్లూర్‌లోని గణేష్ నగర్ కాలనీలో గల సత్య సెల్ ఫోన్ దుకాణం నిర్వహిస్తున్న ఎర్రోజు సత్యనారాయణ.. రోజులాగే ఈనెల 24 దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు అనగా శుక్రవారం దుకాణం తెరిచి చూడగా దుకాణంలో ఉన్న పలు రకాల కంపెనీలకు చెందిన తొమ్మిది సెల్ ఫోన్లు, దానికి సంబంధించిన పరికరాలను అపహరించుకుపోయారు. ఈ మేరకు సత్యనారాయణ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫోన్ల విలువ సుమారు 50వేలు ఉంటుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-హయత్ నగర్

జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) యూనిట్ 1, యూనిట్ 2 లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జోత్స్న ప్రభ ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని, రక్తం దానం చేయడం ద్వారా ఎలాంటి నష్టం లేదన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ విడిజి 1 గవర్నర్ డాక్టర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావచ్చని, యువతీ యువకులు, విద్యార్థులు, వాలంటీర్లు మూడు నెలల విరామంతో ఎన్ని సార్లైనా రక్తదానం చేయవచ్చని సూచించారు. ఈ రక్తదాన శిబిరంలో 40 మంది రక్త దానం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. నరసింహ, ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ మధు ధర్మపురి, అధ్యాపకులు డా. ఇందిరా, డా. శ్రీపతి నాయుడు, డా. సుబ్రమణ్యం, డా. అపర్ణ చతుర్వేది, డా వెంకటేశ్వర్లు, ఎస్. బాల, డా. వి నాగరాజు, డా. జి శశిధర్, రమాదేవి, మల్లేశం, సత్యనారాయణ, విద్యాసాగర్, శేఖర్, యాదగిరి, గీత నాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఈ. యాదగిరి రెడ్డి, డా.ఎస్ శారదా దేవి, లైబ్రేరియన్ డాక్టర్ ఏ.దుర్గాప్రసాద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు జి. సారంగపాణి, మహేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, సురేందర్, లింగయ్య, దార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గురుకులాల అభివృద్ధికి సర్కారు కట్టుబడి ఉంది

పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్



నవతెలంగాణ-బోడుప్పల్

గురుకులాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్ అన్నారు. శుక్రవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను స్థానిక కార్పొరేటర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..రాష్ట్రంలోని అన్ని వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని చెప్పారు. అనంతరం 400 మంది విద్యార్థులకు పరుపులు, ఇతర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎంపల్ల అనంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు చింతల నరసింహ రెడ్డి, జయేందర్, నాగరాజు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టి ద్విచక్రవాహనదారుడు మృతి

నవతెలంగాణ-శామీర్‌పేట



ఓ ద్విచక్ర వాహనదారుడు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీ కొట్టి ఆర్టీసీ బస్సు వెనక టైరు కింద పడి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కార్ఖానా గడ్డకు చెందిన షైక్ సఫ్లిన్ తన స్నేహితుడు మహమ్మద్ ఫర్హాన్‌తో కలిసి గురువారం రాత్రి యాక్టివా (టీఎస్10 ఈ ఎక్స్7515)పై హైదరాబాద్‌లోని మెహిదీపట్నం వెళ్తుతుండగా రోటరీ శామీర్ పేట దగ్గరరాగనే షేక్ సఫ్లిన్ అతివేగంగా ఆర్టీసీ బస్సును ఓవర్టేక్ చేస్తుండగా యాక్టివా అదుపుతప్పి డివైడర్‌కు ఢీ కొట్టింది. దీంతో వారు ఆర్టీసీ బస్సు వెనకవైపు టైర్ కింద పడడంతో షైక్ సక్లిన్ తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వెనక కూర్చున్న ఫర్హాన్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎంబీఏ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



- ఉస్మానియా విశ్వ విద్యాలయ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ జహంగీర్
- విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం
- కేజీఆర్ కళాశాల చైర్మెన్ కె.గోవింద్‌రెడ్డి

నవతెలంగాణ-కీసర

ఎంబీఏ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ఉస్మానియా విశ్వవిద్యాలయ బిజినెస్ మేనేజిమెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ జహంగీర్ అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామంలోని కేజీఆర్ కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సును కళాశాల చైర్మెన్ కె.గోవిందరెడ్డి ప్రారంభించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ జహంగీర్ మాట్లాడుతూ..ఎంబీఏ విద్యార్థులు మంచి ప్రతిభతో చదువుకుంటే జీవితంలో గొప్ప వ్యక్తులుగా రాణిస్తారని తెలిపారు. ఆర్థిక, పారిశ్రామిక మార్పులను గమనిస్తూ తమ పరిజ్ఞానాన్ని మెరుగు పరుచుకుంటేనే పోటీలో నిలబడతారని పేర్కొన్నారు. అనంతరం కేజీఆర్ కళాశాల చైర్మెన్ కె.గోవింద్ రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలను లాభాపేక్షతోగాక నాణ్యమైన విద్యను అందించే అభిరుచితో ప్రారంభించామన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరైతే ఉద్యోగంతో పాటు వార్షిక ఉపకార వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. డైరెక్టర్ ప్రొఫెసర్ రమణారావు మాట్లాడుతూ.. కేజీఆర్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక విద్యా సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. శీఘ్రంగా పురోగమిస్తున్న భారత ఆర్థిక వ్యవస్థలో ఎంబీఏ విద్యార్థులకు అమితమైన ఉపాధి అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కె.నితిన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎస్. విజయలక్ష్మి, ప్రొఫెసర్ జి. విజయకుమార్, ప్రొఫెసర్ సునీత, ప్రొఫెసర్ రంగేశ్వరరెడ్డి, డాక్టర్ వేణు, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవాలయ సమస్యను పరిష్కరించాలి



- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఆలయ చెర్మెన్ వినతి

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయం సమస్యను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డికి ఆలయం చైర్మెన్ అంబటి జగదీష్, కొంపల్లి రవీందర్‌లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. దేవాలయానికి ప్రహరీ గోడ నిర్మించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం దేవాలయాల సందర్శించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గోనె అంజయ్య, పాల్వంచ విఠల్, పిట్టల నరేష్, పోనేబోయిన సుధాకర్, కొండ బాలేందర్, తెలంగాణ సంపత్, నరసింహ, రాధాకృష్ణ, తౌటిగిరి ముదిరాజ్, సిద్ధ మల్లేష్, ఎక్కల దేవి, నర్సింహులు, వినయ్ తదితరులున్నారు.

ఈసీ నగర్ వీధి కుక్కల స్వైర విహారం

భయభ్రాంతుల్లో పెద్దలు, చిన్నారులు

ధరణి తెలుగు దినపత్రిక ఎడిటర్ జి రోజారాణి పై కుక్కలు దాడి

నవతెలంగాణ-కాప్రా



ఈ మధ్య కాలంలో వీధి కుక్కలు చిన్నపిల్లలు, పెద్దవారు అనే తేడాలేకుండా అందరిపై దాడులు చేస్తున్నాయి. చర్లపల్లి ఈసీ నగర్‌లో ధరణి తెలుగు దినపత్రిక ఎడిటర్ జి.రోజారాణిపై వీధి కుక్కలు దాడి చేశాయి. తన ఇంటి కాంపౌండ్‌లో పనిచేసు కుంటున్న రోజా రాణిపై ఇంటి లోపలికి చొరబడి మరి దాడి చేశాయి. ఆమె శరీరంపై 17 చోట్ల రక్తం కారేలా కరిచింది. వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం అందించడంతో ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఈ సందర్భంగా ఆమెకు వైద్యం చేసిన డాక్టర్ అనురాధ మాట్లాడుతూ.. ఈ సమయంలోనే వీధి కుక్కలకు రెబీస్ వ్యాధి సోకే ప్రమాదం ఉందని తెలిపారు. ఆ పిచ్చితనంతో అవి ఏం చేస్తున్నాయో వాటికి తెలియదని, అందుకే కనిపించిన ప్రతి ఒక్కరిని కరిచి గాయం చేస్తున్నాయన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు వీధి కుక్కలను పట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని కాలనీ వాసులు కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వి. శ్రీనివాస్, నాయకులు వెంకట్, ఆర్ నర్సింగ్, అక్బర్, శనిగరం అశోక్, టి డబ్ల్యూ జె ఎఫ్ నాయకులు పటేల్ నరసింహ, సీనియర్ జర్నలిస్టులు కీర్తి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, డి. కిరణ్ కుమార్ రావు, డి శ్రీనివాస్, రామచంద్ర మూర్తి టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు పరామర్శించి మనో ధైర్యం చెప్పారు.

కేఎల్‌రెడ్డి నగర్‌లో పన్నాల పర్యటన



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేఎల్ రెడ్డి నగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ వాటర్ బోర్డ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీకి మంజూరైన సీసీ రోడ్డును పరిశీలిస్తూ, నూతన భూగర్భ డ్రయినేజీ పైపులైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపించాలని వాటర్ బోర్డ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ శ్రవంతి, వాటర్ బోర్డ్ మేనేజర్ సిరాజుద్దీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానిక కాలనీ వాసులు మహేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, యాకుబ్ రెడ్డి, నాయకులు తండా వాసుదేవా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలని కమిషనర్‌కు వినతి

నవతెలంగాణ-శామీర్‌పేట

అక్రమ నిర్మాణాలను అరికట్టాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్‌కు కాంగ్రెస్ నాయకుడు సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దొంగల మైసమ్మ సమీపంలో డోమాస్ ప్రక్కన గల 177 సర్వే నెంబర్‌లోని భూమిలో ప్రహరీ గోడతోపాటు పలు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొరుతున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

21వ అఖిల భారత పశుగణన

- 16 రకాల జంతువుల లెక్క ఇక పక్కా
- కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేంద్ర ప్రభుత్వ పాడి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం నిర్వహించనున్నారు. నెల రోజులపాటు జరుగనున్న ఈ కార్యక్రమాన్ని శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రంలో భాగంగా పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కుక్కలు, కోళ్ల ఇలా 16 రకాల జంతువుల లెక్కను పక్కాగా సేకరించనున్నారు. ప్రతి ఐదేండ్లకోసారి దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో తాజా లెక్కలను కచ్చితంగా గణనను చేయడానికి జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులు సిద్ధంగా ఉన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బందితోపాటు గోపాల మిత్రులు, ఇతర ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కూడా ఈ గణనలో వినియోగించనున్నారు. ఇందు కోసం సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలను చేపట్టారు. గ్రామ, పట్టణ స్థాయి నుంచి ఇంటింటినీ సందర్శించి పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, కుక్కలు ఇలా 16 రకాల పెంపుడు జంతువుల వివరాలను సేకరించనున్నారు. వివరాలను పక్కాగా నమోదు చేయడానికి సిబ్బంది ఇంటింటకీ వెళ్తారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ టి.సుధాకర్, సహాయ సంచాలకులు డాక్టర్.జి.ప్రభు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్టిన్ యూనివర్సిటీతో గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఒప్పందం



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రపంచవ్యాప్తంగా అకాడమిక్ సంబంధాలను బలోపేతం చేస్తూ, పరిశోధన కార్యక్రమాలను పెంచాలనే ఆలోచనతోనే గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మలేషియాలో ని ప్రతిష్టాత్మక కర్టిన్ యూనివర్సిటీతో అవగాహనా ఒప్పందంపై సంతకం చేసినట్టు ప్రకటించింది. ఈ సందర్భంగా జీఆర్‌ఐఈటీలో సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ కేవీఎస్ రాజు మాట్లాడ తూ.. అంతర్జాతీయ భాగస్వామ్యాలను సృష్టించేం దుకు ఇనిస్టిట్యూట్స్ నిబద్ధతను వివరించారు. విద్యార్థుల ప్రయోజనాలను మెరుగుపరచడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర ఉన్నత ర్యాంక్ ఉన్న విశ్వ విద్యాలయాలతో భవిష్యత్ అవగాహనా ఒప్పందాల కోసం ప్రణాళికలను సూచిస్తు న్నామని తెలిపారు. కర్టిన్ విశ్వవిద్యాలయం ప్రొ-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విన్సెంట్ చియెంగ్ చెన్ మాట్లాడుతూ.. ఇది రెండు సంస్థలకు ప్రయోజనకరంగా ఉంటుందనీ, ఈ భాగస్వామ్యం తమ విద్యార్థులు, అధ్యాపకులకు అసమానమైన అవకాశాల కోసం తలుపులు తెరుస్తుందని వ్యాఖ్యానిం చారు. గోకరాజు రంగరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ జీవీకే రంగ రాజు మాట్లాడుతూ "మా విద్యార్థులకు ప్రపంచీకరణ ప్రపంచానికి సిద్ధం చేసే అర్థవంతమైన అనుభవాలను అందించడానికి మేం కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. ఈ ఒప్పంద కార్యక్రమానికి డాక్టర్ మూల మోహన్‌రెడ్డి, ప్రొఫెసర్ సుజన్ దేబ్‌నాథ్ హాజరయ్యారు.

నగర అభివృద్ధికి కృషి చేస్తా





- కాలనీల్లో ప్రజలను కలుస్తూ..
- సమస్యలు తెలుసుకుంటూ
- మేయర్ అజయ్ బిజీ బిజీ

నవతెలంగాణ-బోడుప్పల్

నగర ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నగరాభివృద్ధికి కృషి చేస్తానని బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. శుక్రవారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 7వ డివిజన్ కేశవ నగర్‌లో కాలనీ వాసులు ఎదుర్కొంటున్న డ్రయినేజీ సమస్యను త్వరలోనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నగర పరిధిలోని 5,17వ డివిజన్లలో రూ.67.50 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు, భూగర్భ డ్రయినేజీ పనులను స్థానిక కార్పొరేటర్లు పోగుల నరసింహ రెడ్డి, సింగిరెడ్డి పద్మారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బోడుప్పల్‌లో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఈ ప్రాంతంలోని సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డికి పూర్తి అవగాహన ఉండడంతో అభివృద్ధి పనులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల ప్రధాన కార్యదర్శి విశ్వం గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫకీర్ హరినాథ్ రెడ్డి, కార్పొరేషన్ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆకలిని జయించి జ్ఞానాన్ని సంపాదించిన వ్యక్తి ఏఎస్‌రావు



- ఆయన జీవితం అందరికీ ఆదర్శం
- విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి రమేష్

నవతెలంగాణ-కాప్రా

కడు పేదరికంలో పుట్టి ఉన్నత చదువులు చదివి జ్ఞానాన్ని సంపాదించిన డాక్టర్ ఏఎస్‌రావు నేడు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి.రమేష్ అన్నారు. డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞానోత్సవాల్లో భాగంగా ఏఎస్ రావు చిత్ర ప్రదర్శనను జమ్మిగడ్డ బీజేఆర్ కాలనీలోని మహనీయుల విగ్రహాల వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ ఏఎస్ రావు కడు పేదరికంలో జన్మించి, చదువు కొరకు ఆకలిని సైతం జయించి విజ్ఞానం సంపాదించారని చెప్పారు. అమెరికాలో చదివినప్పటికీ భారతదేశానికి వచ్చి దేశ స్వావలంబన కొరకు గొప్ప గొప్ప ఉత్పత్తులను సృష్టించారని చెప్పారు. మూఢనమ్మకాలు వ్యతిరేకంగా ఆయన నిలబడ్డారని తెలిపారు. మనందరం మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయంగా జీవించాలని కోరారు. అనంతరం మహా మనిషి ఏఎస్ రావు బయోపిక్ సినిమాను ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించిన కాలనీవాసులు భావోద్వేగానికి గురయ్యారు. ఇలాంటి మహా మనిషి జీవిత చరిత్రను భవిష్యత్ తరాలు తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన వేదిక, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్, విజ్ఞాన దర్శిని, జ్ఞానమాల టీం సంయుక్తంగా ఈ కార్యమన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు జ్ఞానమాల టీం బాధ్యులు తాడూరి గగన్ కుమార్ మాట్లాడుతూ.. డాక్టర్ ఎస్ రావు గొప్ప శాస్త్రవేత్తే కాకుండా ఈ ప్రాంతం అభివృద్ధికి ఆయన చేసిన కృషిని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, శోభారాణి, నర్సింహ చారి, సరేందర్ రావ్, దయానంద్, అనిల్, శ్రీనివాస్, వెంకటయ్య, ప్రవీణ్, సన్నీ పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు
- మార్కంటి నాగరాజ్



నవతెలంగాణ-మేడ్చల్

మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పూడూరు గ్రామ ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు మర్కంటి నాగరాజు అన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేసిన చేప పిల్లలను శుక్రవారం గ్రామంలోని ఎర్ర చెరువు, మొగుళ్ల చెరువు, మోతుల కుంట, నెల్లికుంట చెరువులలో 70వేల చేప పిల్లలను వదిలినట్టుగా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చేప పిల్లల పంపిణీ ఆలస్యమైన ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కాగా చెరువుల విస్తీర్ణంలో కేవలం 50శాతం మాత్రమే పంపిణీ చేసిందన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సర్కార్ గత ప్రభుత్వం ఇచ్చినట్టుగా 100శాతం సబ్సిడీతో మొత్తం చేప పిల్లలను రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం యూత్ ఉపాధ్యక్షులు జీ.పరమేశ్, నీరుడి శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి నీరుడి శ్రవణ్, మర్రిచెట్టు పాండు, మర్రి చెట్టు శ్రీనివాస్, కొండా శ్రీనివాస్, తుపాకుల గోపాల్, బీ. సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆర్ఎంపీల సేవలను వియోగించుకోవాలి



నవతెలంగాణ-శామీర్‌పేట

బస్తీ దవాఖానాల్లో ఆర్ఎంపీ డాక్టర్ల సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలని రాష్ట్ర ఆర్ఎంపీల జేఏసీ అధ్యక్షుడు మల్లేషం అన్నారు. శుక్రవారం శామీర్ పేట మండలం అలియాబాద్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్లో రాష్ట్రస్థాయి ఆర్ఎంపీల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 50 వేల మంది ఆర్ఎంపీలు క్లినిక్ లు పెట్టుకుని గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేస్తున్నారని చెప్పారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి డబ్ల్యూహెచ్ఓ ఆదేశాల మేరకు ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. రాజశేఖర్ రెడ్డి మృతి చెందడంతో అది నిలిచిపోయిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్‌కు ఈ అంశంపై పలుమార్లు విన్నవిస్తే సానుకూలంగా స్పందించి కాలయాపన చేశారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఓ పక్క ఆర్ఎంపీలకు మద్దతు తెలుపుతూ వారిపై రైడింగ్‌లు చేయిస్తుందన్నారు. 50 ఏండ్లుగా ఆర్ఎంపీ విధుల్లోనే ఉంటూ జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలు చేపడితే ఆర్ఎంపీల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. వెంటనే ఆర్ఎంపీలకు శిక్షణనిచ్చి సర్టిఫికెట్లను అందజేసి బస్తీ దవాఖానాల్లో వారి సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లోని ఆర్ఎంపిలు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌ను ఆకస్మిక తనిఖీ

- మేడ్చల్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్
- షేక్ జాన్ షాహిద్



నవతెలంగాణ-కీసర

కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న 108 అంబులెన్స్ వాహనాన్ని మేడ్చల్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్ జాన్ షాహిద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని రికార్డ్స్‌ను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న అత్యవసర సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాలను పరిశీలించి వాటి పనితీరును ఈ.ఎం.టీ రవిని అడిగి తెలుసుకున్నారు. ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉన్నాయా.. లేవా అని సిబ్బందిని అడిగి తెలుసుకొని మందుల స్టాక్ రికార్డ్స్‌ను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అత్యవసర ఏర్పడినా అంబులెన్స్ సేవలు సత్వరమే అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచనలు చేశారు. వైద్యం చేయడానికి అన్ని రకాల వైద్య పరికరాలు, ఎమర్జెన్సీ మందులు అంబులెన్స్‌లో అందుబాటులో ఉంచామని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర 108 సిబ్బంది ఈ.ఎం.టీ చిత్రం రవి, పైలట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

కాలనీ అసోసియేషన్ అధ్యక్షులకు సన్మానం



నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని మల్లికార్జున్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన అశోక్‌చారిని, బీరప్ప గడ్డ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కోకొండ జగన్‌లను కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ శుక్రవారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..కాలనీ సంక్షేమ సంఘాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకార అందిస్తానని, కాలనీలల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఘనంగా పరమేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి, ఉప్పల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మందుముల పరమేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించారు. అనంతరం కార్పొరేటర్ శ్రీదేవి మాటాడుతూ..ఆయూరారోగ్యలతో చల్లగా ఉండాలని, భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత పదవులు చేపట్టాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ నాగిళ్ల బాల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బుడిగ ప్రభుగౌడ్, బత్తుల శ్రీకాంత్ యాదవ్, గోపాల్ యాదవ్, క్రాంతి, వెంకట్ గౌడ్, శ్యామ్, హిరాలాల్ నాయక్, వెంకటరెడ్డి, వాల్యా నాయక్, హరి ప్రసాద్, లాలు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలి

- ఎంసీ మండల విశ్వకర్మ సంఘం
- అధ్యక్షుడు బాలకృష్ణ



నవతెలంగాణ-శామీర్‌పేట

యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి కొల్తూరు ప్రజలకు, భక్తులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మూడుచింతలపల్లి మండల విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ మేడ్చల్ డిపో మేనేజర్‌ను కోరారు. శుక్రవారం ఆయన నవ తెలంగాణతో మాట్లాడారు. తెలంగాణ తిరుపతిగా ప్రాచుర్యంలోకి వచ్చిన యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక భక్తులు, ప్రజలు వ్యయ ప్రయాసలు పడుతున్నారని తెలిపారు. మేడ్చల్ నుంచి అలియాబాద్ చౌరస్తా మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సును ఉదయం ఒక ట్రిప్ సాయంత్రం ఒక ట్రిప్ వయా కొల్తూరు, ఆనంతారం, నారాయణ పూర్ మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మూడుచింతలపల్లి మండల కేంద్రానికి వెళ్లడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని హకింపేట, కంటోన్మెంట్ ఆర్టీసీ డిపో అధికారులకు విన్నవించారు.

టోలిచౌకిలో 'కేర్' మల్టీ-స్పెషాలిటీ క్లినిక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

కేర్ హాస్పిటల్స్ టోలిచౌకి ప్రాంతంలో అంతర్జాతీయ రోగుల కోసం అత్యాధునిక మల్టీ-స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని కేర్ హాస్పిటల్స్ గ్రూప్ సీఈఓ జస్‌దీప్ సింగ్ ప్రారంభించి మాట్లాడారు. "టోలిచౌకి ప్రాంతంలో నివసిస్తున్న ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, సార్క్ దేశాల విదేశీ రోగుల అవుట్‌పేషంట్ ఆరోగ్య అవసరాలను తీర్చడంలో ఈ క్లినిక్ ముఖ్య పాత్ర వహిస్తుంది. కార్వాన్ నియోజకవర్గం సహా టోలిచౌకి, పరిసర ప్రాంతాల్లో నివసించే అంతర్జాతీయ రోగులకే గాకుండా స్థానిక ప్రజలకు ఈ సెంటర్ కేవలం క్లినిక్‌గా మాత్రమే కాకుండా, కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్స్, ప్రసూతి, స్త్రీ వ్యాధులు, ఇంటర్నల్ మెడిసిన్ వంటి ప్రత్యేకతల్లో డాక్టర్ కన్సల్టేషన్లతో పాటు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తుంది" అని తెలిపారు. చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శలభ్ డాంగ్ మాటాలడుతూ "అత్యాధునిక వైద్య సదుపాయాలు అతి తక్కువ ఖర్చుతో అందించడంలో హైదరాబాద్ నగరానికి ప్రాధాన్యత ఉంది. ఈ నగరం, పశ్చిమ దేశాల కంటే 60-80శాతం తక్కువ ఖర్చుతో కార్డియాక్ సర్జరీలు వంటి వైద్య సేవలను అందిస్తుంది. దీంతో గణనీయ సంఖ్యలో అంతర్జాతీయ రోగులను ఆకర్షిస్తోంది," అని వివరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సీఈఓ దీపక్ ఖన్నా, కేర్ హాస్పిటల్స్ హైటెక్ సిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సునీత్ అగర్వాల్, పీడియాట్రిక్ సీటీవీఎస్ సర్జరీ విభాగం హెడ్ డాక్టర్ టపన్ కుమార్ దాస్, కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ లక్ష్మీ నాథ్, కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కైలేశ్ మిర్చి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శరత్ బాబు, ఆంకాలజీ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ సుధా సిన్హా, సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
శనివారం | అక్టోబర్ 26, 2024 | www.navatelangana.com

గ్రూప్-1 పరీక్ష పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో జరుగుతున్న గ్రూప్-1 పరీక్ష నిర్వహణను శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తనిఖీ చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరుగుతుందా..? సీసీ కెమెరాలు పని చేస్తున్నాయా..? అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష గదుల్లో తిరిగి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. కలెక్టర్ వెంట దుండిగల్ తహశీల్దార్ మతిన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత..

- దుండిగల్ రెవిన్యూ అధికారులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మండలంలో సర్వే నెంబర్ 120లో ఇటీవల అక్రమ నిర్మాణాలు యేథేచ్ఛగా జరగడం వివిధ దిన పత్రికలలో వరుస కథనాలు రావడంతో.. శుక్రవారం దుండిగల్ తహసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్ ఆదేశాలతో.. అర్.ఐ.అవినాష్ నేతృత్వంలో.. కూల్చి వేతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ మహేందర్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డును వెంటనే బాగు చేయాలి



- సీపీఐ(ఎం)నాయకుల నిరసన

నవతెలంగాణ-కూకట్‌పల్లి

బాలకృష్ణ నగర్ వైన్ షాప్ ముందు ఆగి ఉన్న వర్షపు నీరును తొలగించి.. రోడ్డును వెంటనే బాగు చేయాలనీ, సీపీఐ(ఎం) కూకట్‌పల్లి శాఖ డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం సీపీఐ(ఎం) నాయకులు, బాలకృష్ణ నగర్ నుంచి జగద్గిరిగుట్ట రోడ్డు వడ్డేపల్లి ఎంక్లేవ్ సర్కిల్, వైన్ షాపు ముందు రోడ్డు గుంతల మాయంగా మారి.. వర్షపు నీరు నిలవడం వలన స్థానిక ప్రజలకు, జగదిరిగుట్ట నుంచి కూకట్‌పల్లి వైపు వెళ్లే వారికి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నార న్నారు. అక్కడ వర్షపు నీరును వెంటనే తొలగించి.. గుంతల మయంగా మారిన రోడ్డులో సిమెంట్ రోడ్డు వేసి వెంటనే బాగు చేయాలని తెలిపారు. సీపీఐ(ఎం) కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి.ధర్మారావు ఆధ్వర్యంలో... రోడ్డుపై నిల్చొని నిరసన చేపట్టారు. రోడ్డు బాగా లేనందున అక్కడి నుంచి వెళ్లే వాహన దారులు కింద పడిపోతూ గాయాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. కావున ప్రభుత్వ అధికారులు మొద్దు నిద్ర వీడి, వెంటనే రోడ్డును బాగు చేయాలన్నారు. లేని పక్షంలో సీపీఐ(ఎం) కూకట్‌పల్లి శాఖ కమిటీ ఆధ్వర్యంలో... ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు తిరుపతి లక్ష్మీనారాయణ బాలరాజ్ శీను తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటిక కబ్జాదారులపై చర్యలు..



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రశాంత్ నగర్ పాత కోర్ట్ భవనం ఎదురుగా ఉన్నా.. స్మశానవాటిక స్థలాన్ని ఇటీవల కొందరు వ్యక్తులు తప్పుడు సర్వే నంబర్లతో కబ్జా చేస్తున్నట్లు దయర్ గూడా బస్తీ వాసులు, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకురావడం జరిగింది. దీంతో శుక్రవారం ఉదయం స్థానిక బస్తీ వాసులతో కలిసి ఎమ్మెల్యే స్మశానవాటికను పరిశీలించారు. 200 వందల సర్వే నంబర్‌లో సుమారు ఐదు ఎకరాలకు పైగా భూమిని.. స్మశాన వాటిక కోసం కేటాయించడం జరిగిందని.. ఇందుకు ఆధారంగా రెవెన్యూ రికార్డులు ఉన్నాయని తెలిపారు. ఇప్పటి వరకు స్మశాన వాటిక ఆధీనంలో ఉన్న భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. కబ్జాదారులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. జీహెచ్ఎంసీ రెవెన్యూ, పోలీసు అధికారులు ఈ విషయంపై విచారణ చేసి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రశాంత్ నగర్ ప్రాంతంలో నాలాలు స్మశాన వాటికలను కబ్జా చేస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి.. చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారు: ఎమ్మెల్యే..

హైదరాబాద్ మహా నగరంలో, ప్రజల బాగోగులు పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, కేపిహెచ్‌బీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్‌లు చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదన్నారు. హైదరాబాద్ మహా నగరాన్ని ప్రపంచంలోనే ప్రత్యేకమైన నగరంగా తీర్చిదిద్దారని తెలిపారు. గత పదినెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నగరంలోని అన్ని రంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.. గత ప్రభుత్వంలో వేలకోట్ల రూపాయలతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామని గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళదామని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా మళ్లీ తిరిగి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందటం ఖాయమన్నారు. అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనతో, ప్రజలు ఇప్పటికే విసిగెత్తిపోయారని తెలిపారు. ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ రాజేష్, సాయిబాబు, నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



హత్యచారానికి గురైన పాప కుటుంబానికి కోలన్ పరామర్శ..



నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మునిసిపల్ బౌరంపేట్ వాసులు నాగరాజు దంపతుల 4సం॥రాల కుమార్తె అత్యాచారానికి గురవడం చాలా బాధాకరమని.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. ఈ సంఘటన కోలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి రాగా.. శుక్రవారం రెయిన్బో హాస్పిటల్ చేరుకొని.. పాప కుటుంబాన్ని పరామర్శించారు. వాళ్లకు మనో ధైర్యం కల్పించి.. అన్ని విధాలుగా ఆదుకుంటానని తెలిపారు. అదేవిధంగా నిందితుడికి కఠినంగా శిక్ష పడేల చేస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవరెడ్డి, ఎస్ఎంసి అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, 125 డివిజన్ అధ్యక్షులు ఎం.డి లాయక్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసరావు, గఫ్ఫార్, అబ్బు, రహీం, కలీం, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగాన్ని గాలికొదిలేసిన రాష్ట్ర ప్రభుత్వం

- రాష్ట్రంలో మెడికల్ మాఫియా హల్‌చల్
- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-అంబర్‌పేట

రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేటు హాస్పిటల్స్‌లో ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారనీ, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేటు హాస్పిటల్స్‌లో మెడికల్ మాఫియా రెచ్చిపోతుందన్నారు. సాధారణంగా వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల వచ్చే దగ్గులకు, తుమ్ములకు ప్రయివేటు హాస్పిటల్స్, యాజమాన్యాలు టెస్టుల పేరుతో పేదల నుంచి రూ.వేలు అడ్డగోలుగా వసూలు చేస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా రోజురోజుకూ ప్రయివేటు హాస్పిటల్స్ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. గ్రామాల్లో సాధారణ జ్వరం వచ్చినా టెస్టుల పేరుతో పేదల నుంచి రూ.5-10 వేలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో సరైన వైద్య సదుపాయం లేకపోవడంతోనే పేద ప్రజలు ప్రయివేటు హాస్పిటల్స్‌ను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారని తెలిపారు. పేద ప్రజల మీద ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వైద్య రంగాన్ని పూర్తిగా ప్రభుత్వపరంగా మార్చాలనీ, రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ మాఫియాను ఆరికట్టాలనీ, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ప్రాథమిక కేంద్రంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలనీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిత్యం వైద్యులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైద్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



- కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని, వివేకానంద నగర్ కాలనీలో సుమారు కోటి యాభై లక్షల రూపాయల నిధులతో మొదలైన.. సెంటర్ డివైడర్ మరియు సిమెంట్ రోడ్డు పనులను ఏఈ. శ్రావణి, స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వివేకానంద నగర్ కాలనీలో సెంటర్ డివైడర్ లేకపోవడంతో.. పాదచారులు, మోటార్ సైకిల్ దారులు, రోడ్డు క్రాస్ చేస్తూ యాక్సిడెంట్లకు ట్రాఫిక్‌కి ఇబ్బంది కారణమవుతున్నారు. కావున సెంటర్ డివైడర్ పనులు, అలాగే సిమెంట్ రోడ్డు పనులు తొందరగా.. నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరావు, రామకృష్ణ స్ట్రీట్ అధ్యక్షులు పురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ మాల మహానాడు నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంద రంజిత్ కుమార్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంద రంజిత్ కుమార్ నియమితులయ్యారు. ఈ నియామకాన్ని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ.. నియామక పత్రాన్ని అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలురుపాడు మండల కేంద్రానికి చెందిన మంద రంజిత్ కుమార్ తెలంగాణ మలిదశ ఉద్యమంతో పాటు జేఎన్‌టీయూహెచ్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులుగా విద్యారంగ సమస్యలపై.. సామాజిక ఉద్యమంలో ముందుండి పోరాటం చేస్తూ.. దళిత హక్కులకై పోరాటం చేస్తున్న మంద రంజిత్ కుమార్‌ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం చేశామని పత్రిక ప్రకటన ద్వారా జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద రంజిత్ కుమార్ మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. బూరుగు వెంకటేశ్వర్లు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాల మహానాడు సవాలు చేసిందని, రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు మాలలకు వ్యతిరేకంగా ఉందని తీర్పును రివ్యూ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల్లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలను చైతన్య పరచాలనీ అలాగే మాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి భవిష్యత్తులో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తానని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేత



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు, సంక్షేమ సంఘాల నాయకులు కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానందని కలిసి పలు శుభకార్యాలకు ఆహ్వానించారు. అలాగే సంక్షేమ సంఘాల నాయకులు తమ కాలనీలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. అలాగే మిగిలి వున్న, నూతనంగా చేపట్టవలసిన అభివృద్ధి పనులపై వ్యయ ప్రణాళికలను రూపొందించి తొందరగా పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

'కాంతి కుమార్‌కు ఎమ్మెల్యే అభినందనలు'

కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, హాట్రిక్ ఎమ్మెల్యే కె.పి. వివేకానందని, కుత్బుల్లాపూర్ గ్రామ నివాసి క్రాంతి కుమార్ కలిశారు. అనంతరం బాడీ బిల్డింగ్, అథ్లెటిక్ క్రీడాకారుడు మిస్టర్ రంగా రెడ్డి జిల్లా బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన క్రాంతి కుమార్‌ని ఎమ్మెల్యే అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ క్రీడ శారీరక దారుడ్యానికే కాకుండా.. మానసిక పట్టుదలకూ ఎంతో మేలుచేస్తుంది. ఇది మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, స్వీయ శక్తిని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శరీరాన్ని దృఢంగా ఉంచుకోవడంతో పాటు మనస్సు ప్రశాంతంగా ఉండేలా చేస్తుందనీ వారు తెలిపారు..

అదే విధంగా రానున్నరోజుల్లో క్రాంతి కుమార్ రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో మరిన్ని విజయాలు సాధించి..కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరు కుత్బుల్లాపూర్ గ్రామానికి, నియోజకవర్గానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే నియోజకవర్గంలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తాను ఎప్పుడూ ముందు ఉంటానని తెలిపారు. గత ప్రభుత్వం హాయంలో నియోజకవర్గం పరిధిలోని పలు పార్కులలో ఓపెన్ జిమ్ములను ఏర్పాటు చేసిన సంగతి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంక్షేమ సంఘం నాయకుడు ఆటో బలరాం, తోటి క్రీడాకారులు ఈడుగుల ఈశ్వర్, సంపత్, నరేందర్, బంతి, సాయి కిరణ్, వెంకులు, శివ, తదితరులు పాల్గొన్నారు.



గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతికగా నిలుస్తాయని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమీర్ ఆధ్వర్యంలో.. గురువారం రాత్రి అల్లాపూర్ డివిజన్ సఫదర్ నగర్‌లో నిర్వహించిన గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మూడువేల మందికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తూము వేణు, మొయి జుద్దీన్, విఠల్ రెడ్డి, కనకయ్య, సయ్యద్ ఐజాజ్, మస్తాన్ రెడ్డి, నజీర్, ఇర్ఫాన్, శివ చౌదరి, సంతోష్, కార్యకర్తలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కులు అందజేత



- చెక్కులను అందజేస్తున్న గోవిందా చారుల ట్రస్ట్ సభ్యులు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని స్ప్రింగ్స్ స్కూల్‌లో శ్రద్ధగా చదువుకునే విద్యార్థులకు గోవిందా చారుల ట్రస్ట్ ద్వారా.. రూ.5 వేల చొప్పున ఇద్దరు విద్యార్థులకు భరత్ నగర్ కాలనీ సంక్షేమం అధ్యక్షులు, హరి హర క్షేత్ర దేవస్థానం పాలక మండలి చైర్మెన్ డాక్టర్ పి.నాగిరెడ్డి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదువుకోవాలన్నారు. సంస్కృతి, గీత పద్యాల ద్వారా మంచిని మార్గానికి మళ్ళించే అవకాశం ఉందన్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు చదవటం సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలకు గాను.. పుస్తకాలు ఇవ్వడము జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శేషవతరము, ఇగ్రేశ్వర్ రావు, సభ్యులు సూర్యా నారణన మూర్తి స్ప్రింగ్స్ స్కూల్ హెడ్ మాస్టర్‌లు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



- బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో శుక్రవారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మంజూరు చేయించిన.. 34 సీఎం రిలీఫ్ ఫండ్ సంబంధిత చెక్కులను లబ్దిదారులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 లబ్దిదారులకు రూ.13,14,000 ఆపదలో ఉండి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి.. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారికి.. ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, కౌన్సిలర్లు సాయి యాదవ్, భారత్ కుమార్, విష్ణు వర్ధన్ రెడ్డి తదితరులున్నారు.

మూసీ బాధితులకు అండగా ఉంటాం: కార్పొరేటర్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మూసి బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి అన్నారు. మూసి పరివాహక ప్రాంతంలోని ఇళ్ళు కూల్చివేతకు నిరసనగా బాధితులకు మద్దతుగా శుక్రవారం ఇందిరాపార్క్ (ధర్నాచౌక్) వద్ద చేపట్టిన ధర్నాకు డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత నేతృత్వంలో.. అన్నపూర్ణేశ్వరి మాత దేవాలయం నుంచి బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన బీజెపి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని చెప్పుకుంటూ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. గడిచిన కాంగ్రెస్ తొమ్మిది నెలల పాలనలో తెలంగాణ రాష్ట్రం ఎటు పోతోందని ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.పేద ప్రజలకు ఎప్పుడు కష్టం వచ్చినా బీజేపీ నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదిరించి కొట్లాడి సాధించుకుంటామన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో గ్రేటర్ పీఠం బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని దానికి స్వచ్ఛందంగా ప్రజలు మద్దతు తెలుపుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్ పటేల్, డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు లక్ష్మణ్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు రేవతి సింగ్, ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, నాయకులు జగదీష్, నవీన్, మధు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కందాడి జ్యోత్స్నా శివారెడ్డికి శుభాకాంక్షలు



- టీపీసీసీ లేబర్ సెల్ సప్పిడి భాస్కర్

నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలిగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా.. కందాడి జ్యోత్స్నా శివారెడ్డికి టీపీసీసీ లేబర్ సెల్ తరఫున సప్పిడి భాస్కర్ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ లేబర్ సెల్ సప్పిడి భాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం కోసం విద్యారంగాభివృద్ధి, నాణ్యమైన విద్యావ్యవస్థ రూపొందించేందుకు.. అంతర్జాతీయంగా విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులు, సవాళ్లను పరిగణలోకి తీసుకుని పాఠ్యాంశాల అభివృద్ధి, పరీక్ష సంస్కరణలు, ప్రీప్రైమరీ విద్య, ఉన్నత విద్య, సాంకేతిక విద్య నుండి విశ్వ విద్యాలయాల వరకు విద్యా వ్యవస్థకు సంబంధించిన అన్ని రంగాలకు పునాది వేస్తున్నారని తెలిపారు. నైపుణ్యాలు, విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి పుననిర్మాణానికి మార్గ దర్శకాలను నిర్దేశిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పాఠశాలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్య సంస్థలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. రిజర్వేషన్లు, అడ్మిషన్స్, ఫీజులు, ఉన్నత విద్య ప్రవేశాలు, ర్యాగింగ్, వేదింపుల పిర్యాదులపై పరిష్కారం, క్రమశిక్షణ చర్యలు, తెలుగు భాషా, సంస్కృతిని ప్రోత్సహించడం వంటివి, విద్యా కమిషన్, ప్రభుత్వం తరపున తెలంగాణలో విద్యార్థులందరికీ న్యాయం జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షులు కందాడి సుదర్శన్ రెడ్డి, ఎ. శ్రీధర్ గౌడ్, మహేష్, తదితరులు ఉన్నారు.

నాలా విస్తరించాలని డీసీకి వినతి పత్రం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

నాలాను విస్తరించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరుతూ.. శుక్రవారం జీహెచ్ఎంసీ మూసాపేట్ సర్కిల్ కమిషనర్ రమేష్‌ను యువజన కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జిట్ట సునీల్ కుమార్ యాదవ్. కలిసి వినతి పత్రం అందజేశారు. మూసాపేట్ ప్రగతి నగర్ వసుంధర ఆస్పత్రి వెళ్లే దారి తరచుగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దానికి గల కారణం అక్కడ ఉన్న నాలాను విస్తరించకపోవడమే అంటూ.. ఆ నాలాను పరిశీలించి విస్తరింపజేసి ప్రజలు పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తీర్చాల్సిందిగా వినతి పత్రంలో కోరారు.

శ్మశానవాటికను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

శ్మశానవాటిక పరిసరాలను సితఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న దీపావళి పండుగ సందర్భంగా పెద్దలకు పూజలు చేస్తారు కాబట్టి స్మశాన వాటికకు వచ్చి పూజలు చేసే వారికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ పనులకు దాదాపు రూ. 3 లక్షలు ఖర్చు చేసినట్టు ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏ ఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు కుమార్ , పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌కు స్వాగతం



నవతెలంగాణ-ఓయూ

మూసీ నది పునరుజ్జీవం ప్రాజెక్టును వేగవంతం చేయడంలో భాగంగా సౌత్ కొరియా సియోల్ నగరంలోని నదుల నిర్వహణ విధానాలను రాష్ట్ర ప్రత్యేక బందం అధ్యయనం చేసి తెలంగాణకు తిరిగి వచ్చిన జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డికి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు ఏ. సన్నీ కుమార్, ఎస్. శ్రీనివాస్ రెడ్డి, దీపక్ స్వాగతం పలికారు.

ఎట్టకేలకు కంటోన్మెంట్‌లో కారుణ్య నియామకాలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డులో ఎట్టకేలకు కారుణ్య నియామకాలు జరిగాయి. 14 ఏండ్లుగా నిరీక్షించిన అనంతరం 22 మంది ఆశావాములకు కారుణ్య ద్వారా బోర్డ్ అధికారులు ఉద్యోగం నియమాకాలు చేశారు. 122 మంది కారుణ్య ఉద్యోగాల అర్హులైనప్పటికీ ప్రస్తుతం 22 మందికి నియామకాలు చేశారు.కంటోన్మెంట్ బోర్డ్ లో వివిధ విభాగాలలో పనిచేసిన వారి సంబంధికులు చనిపోయిన తర్వాత 14 ఏండ్ల పాటు పోరాటాలు చేయగా 22 మందికి కారుణ్య ద్వారా ఉద్యోగాలు లభించాయి. మిగతా 100 మంది మాత్రం నిరాశతోనే ఉన్నారు. కేవలం ఒక శానిటరీ విభాగంలోనే 22 మందిని కారుణ్య ద్వారా భర్తీ చేసుకున్నారు. ఇటీవలనే వారికి అపాయింట్మెంట్ ఆర్డర్ కూడా ఇవ్వడంతో వారు శానిటరీ విభాగంలో అధికారికి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు మిగతా ఆశావాహులకు ఎప్పుడొస్తాయి అన్నది ఇంకా ఇప్పుడే చెప్పలేని పరిస్థితని అధికారులు అంటున్నారు. యూనియన్ కార్యదర్శి పరశు రామా ఆధ్వర్యంలో అనేక పోరాటాలు ఉద్యమాలు చేసిన ఫలితంగానే 22 మంది ఉద్యోగాలు పొందగలిగారని పలువురు చెబుతున్నారు.

వరద సమస్యలకు కొత్త పైపులైన్‌తోనే పరిష్కారం

- లక్డీకాపూల్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో వరద ముప్పు తీవ్రంగా ఉన్న 30 ప్రాంతాల్లో క్షేత స్థాయిలో పరిశీలించి వచ్చే వర్షాకాలానికి అక్కడ సమస్య తలెత్తకుండా చూడాలని హైడ్రా కమిషనర్, ఐజీ ఏవీ రంగనాథ్ అధికారులకు సూచించారు. వరద ముప్పును ఎదుర్కొంటున్న లక్డీకాపూల్ ప్రాంతంలో శుక్రవారం ట్రాఫిక్ అదనపు కమిషనర్ పీ. విశ్వప్రసాద్‌తో కలిసి హైడ్రా కమిషనర్ పరిశీలించారు. టెలిఫోన్ భవన్‌వైపు వెళ్లే మార్గంలోని ద్వారకా హెూటల్ పరిసరాల నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే మార్గంలో ఉన్న లక్ష్మీ రెస్టారెంట్ వరకూ జలమండలికి చెందిన ఎయిర్‌టెక్ మెషిన్‌తో వరుసగా మ్యాన్‌హెూళ్ల పరిశీలించారు. పైపులన్నలో పేరుకుపోయిన పూడికను తొలగించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో క్షేత్రస్థాయిలో కమిషనర్ పరిశీలించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన వరదనీటి పైపు లైన్లు, కాలువలు పూర్తిగా శిథిలం అయినట్టు గుర్తించారు. శిథిలమైన వరద నీటి పైపు లైన్, కాలువ స్థానంలో కొత్తగా పైపు లైన్లు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటికప్పుడు జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడిన హైడ్రా కమిషనర్ .. కొత్త లైన్ల ఏర్పాటుపై వివరించారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ తెలిపారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఒకటి రెండు రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్టు సమాచారం. లక్డీకాపూల్ చౌరస్తాలో దశాబ్దాల క్రితం వేసిన వరద నీటి పైపులైన్లు పూర్తిగా శిథిలమవ్వడంతో 20 ఏండ్లుగా ఈ సమస్య ఉత్పన్నమవుతోందని స్థానికులు, దుకాణదారులు రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. వర్షం వస్తే చాలు ఈ చౌరస్తాలో వరద నీరు నిలిచిపోతున్నాయని, తమ దుకాణాల్లోకి వరద నీరు చేరుతుందంటూ మొరపెట్టుకున్నారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

నిజమైన హక్కుదారులకు న్యాయం చేస్తాం

- తప్పడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- ప్రకటన విడుదల చేసిన రాచకొండ పోలీసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మాల్కాజిగిరిలో పోలీసులు కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని ఓ వరఘ్గరం ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో రాచకొండ సీపీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 'మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో సర్వే నెంబర్ 398, 399, 410, 411, 574 లో ఉన్న సుమారు 18 ఎకరాల భూమిపై మూడు వర్గాలు తమదేనని క్లెయిమ్ చేసుకుంటున్నాయి. ఇట్టి భూమిపై 1966 సంవత్సరం నుండి వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ వివాదంపై వారు కోర్టుకు వెళ్లారు. గతంలో 2020 సంవత్సరంలో మూడు కేసులు మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్లో నమోదు అయ్యాయి. తాజాగా మరో మూడు కేసులు నమోదయ్యాయి. తాజాగా నమోదైన కేసులపై విచారణ కొనసాగుతోంది. ఈ భూమిపై హక్కుదారులు తగిన పత్రాలు సమర్పించినచో తగు న్యాయం చేస్తాం. కొందరు నిరాధారమైన కథనాలు, వీడియోలు పోస్ట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాక, పోలీసులతోపాటు ప్రభుత్వ పెద్దలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. పోలీసులకు గాని, ప్రభుత్వ పెద్దలకు గాని ఎలాంటి సంబంధం లేదు.' అని తెలిపారు. ఎవరైనా తప్పుడు ఊహాజనిక కథనాలు, వీడియో ప్రచారం చేస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మా స్థలాలను మాకు ఇప్పించండి



- ముఖ్యమంత్రికి భూ బాధితుల వినతి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలు వారికి కొమ్ము కాసే కొంతమంది మార్చులానికి, కుటుంబ సభ్యులకు మేలు చేస్తూ ప్రజలపై అన్యాయంగా దౌర్జన్యానికి దిగడం అన్యాయం అని మల్కాజిగిరికి చెందిన కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది రాకేష్ రెడ్డి వాపోయారు. కబ్జా చెరల నుంచి తమ స్థలాలను తమకు ఇప్పించాలని కోరారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 40 సంవత్సరాలుగా మల్కాజిగిరిలో 398,399, 409,410,411/1,411/2,579 మొత్తంగా 19 ఎకరాల 18 గుంటలలో ఉన్న ఇండ్లను అక్రమంగా పోలీసులను పెట్టి మరి కూల్చి వేయించడం దాని చుట్టూ ఫెన్సింగ్ నిర్మించడం చూస్తుంటే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ లేదనిపిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండుసార్లు పనిచేసిన సీనియర్ నాయకులైన సూర్యనారాయణ రెడ్డి కూడా బాధితుడుగా మారడం, కోర్టు ఉత్తర్వులు కూడా పోలీసులు పాటించకపోవడం, పోలీసులు తమ విధులను నిర్వర్తించకుండా ప్రయివేటు సైన్యంగా మారడం శోచనీయమన్నారు. దీని వెనక సీఎం అతి సన్నిహితులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారని ఆరోపించారు. బాధితులు బయటికి వచ్చి తమ గోడు వినిపించుకోవడానికి భయపడుతున్నారంటే రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ఒక్కసారి ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే తమ స్థలాలు తమకు ఇప్పించాలని బాధితులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు అరుణ దేవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నేలమట్టం





నవతెలంగాణ-జూబ్లీహిల్స్

యూసుఫ్ గూడా డివిజన్‌లో పలు అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసి సర్కిల్ 19 టౌన్ ప్లానింగ్ అధికారులు ఏసీపీ కృష్ణవేణి, టీపీఎస్ఓ నరేష్‌లు శుక్రవారం సిబ్బందితో వెళ్లి పూర్తిగా తొలగించారు. శ్రీకృష్ణ నగర్‌లో సంజయ్ సింగ్ అనే ఇంటి యజమాని అక్రమంగా పిల్లర్లు వేసి నిర్మాణం చేపట్టిన విషయం తెలుసుకుని గ్యాస్ కట్టర్లతో పిల్లర్ రాడ్లు కట్ చేసి పూర్తిగా నేలమట్టం చేశారు. అలాగే యూసఫ్ గూడా డివిజన్ లోని లక్ష్మీ నరసింహ నగర్ లో ఇంటి యజమాని కిష్టమ్మ అనుమతులు లేకుండా ఇల్లు నిర్మిస్తుండగా ఆ ఇంటిని కూడా నేలమట్టం చేశారు.

ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణవేణి మాట్లాడుతూ, ఎవరైనా ఇంటి యజమానులు పట్టాలు ఉన్న యెడల, జీహెచ్ఎంసి ఆఫీసులో అనుమతి తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని, రాజకీయ నాయకులు అండగా ఉంటారని నమ్మి అనుమతులు లేకుండా ఇండ్లు నిర్మించి నష్టపోవద్దని, ప్రజలకు సూచించారు. అనుమతులు కోరితే తప్పకుండా అనుమతిస్తామని నాయకులైనా, ఎవరైనా అనుమతి లేకుండా ఇండ్లు నిర్మించి నష్టపోవద్దన్నారు.



'సే టూ నో డ్రగ్స్' పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇండియన మెడికల్ అసోసియేషన్ బంజారాహిల్స్, షాలోమ్ ఆఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సే టూ నో డ్రగ్స్' పోస్టర్‌ను చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, ఇండియన మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ (బంజారాహిల్స్) డాక్టర్ ప్రభుకుమార్ చల్లగాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఎంపీ ప్రసాద్‌రావు మాట్లాడుతూ పంజాబ్‌లో డ్రగ్స్ వల్ల రాష్ట్రమే నాశనం అయ్యిందన్నారు. యువత డ్రగ్స్ వాడకుండా నివారణకు రాష్ట్ర ప్రజలు, పోలీసు అధికారులు నడం బిగించాలన్నారు. ఐఎంఏ ప్రెసిడెంట్ ప్రభకుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వాడటం వల్ల అనేక అనారోగ్య సమస్యల బారిన పడి జీవితాలను నాశం చేసుకుంటున్నారని తెలిపారు. షాలోమ్ ఆఫ్ హెూప్ ఫౌండేషన్ గతేడాది నుంచి స్కూల్స్, కాలేజీల్లో డ్రగ్స్ డ్రగ్స్, మాదక ద్రవ్యాల నిర్మూలనకు అనేక అవహనా సదస్సులు నిర్వహిస్తుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీహెచ్.అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ పుల్లారెడ్డి, డాక్టర్ కె.ఎస్.రంగనాయకులు, డాక్టర్ ఇమ్రాన్ అలీ, హాస్పిటల్ సిబ్బంది ప్రభాకర్, ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కులగణన నిర్వహించి బీసీలకు రిజర్వేషన్లను పెంచాలి



- బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్‌కు బీసీ నేత లింగంగౌడ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో సమగ్ర కులగణన సర్వేను వేగవంతం చేసి బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజ్వేషన్లను కల్పించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో బీసీ కమీషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతు సమగ్ర కులగణనపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం కల్పించాలని, మీడియా ద్వారా ప్రతి పల్లెకూ, ప్రతి బస్తీకీ చేరుకునేలా విసత ప్రచారం నిర్వహించడానికి కమిషన్ ప్రణాళిక రూపొందించాలని కోరారు.సమగ్ర కులగణనకు తక్షణమే ప్రశ్నావళిని రూపొందించి మార్గదర్శకాలు విడుదల చేసి వారి సామాజిక ఆర్థిక రాజకీయ స్థితిగతులను లెక్కించాలన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఈనెల 28వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో బీసీ కులాలను అధ్యయనం చేయడం కోసం చేపట్టనున్న జిల్లాల పర్యటనకు బీసీ సంఘాలు, కుల సంఘాలు, ఉద్యోగ యువజన మహిళ సంఘాలు సయుక్తంగా మద్దతు తెలుపుతున్నాయని చెప్పారు. కమిషన్ పర్యటనను పూర్తిగా విజయవంతం చేయాలని రాష్ట్రంలోని బీసీ శ్రేణులకు లింగంగౌడ్ విజ్ఞప్తి చేశారు. బీసీ కమిషన్‌ను కలిసిన వారిలో తెలంగాణ కల్లు గీత వత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్న గౌడ్ బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్య, మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి,ఉపాధ్యక్షురాలు సంధ్య పాల్గొన్నారు.

వీసీకి సీఐటీయూ నాయకుల శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఓయూ

నూతనంగా నియమితులైన ఉస్మానియా యూనివర్శిటీ వీసీ ప్రొ. కుమార్‌ను శుక్రవారం ఓయూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చెయ్యాలని కోరిన వెంటనే వీసీ సానుకూలంగా స్పందించి ఉద్యోగులు సంతోషంగా ఉంటేనే యూనివర్శిటీ బావుంటుందని, వారి సమస్యలపైన అధ్యయనం చేసి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ ఓయూ లో కార్మికులు దాదాపుగా 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నా కనీస వేతనాలు అమలు కాలేదని చెప్పారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు పలుమార్లు కోరినా ఇప్పటి వరకు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ కార్మికుల అందరిని రెగ్యులరైజ్ చెయ్యాలని కోరారు. వేతనాలు పెరగకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నాం న్నారు. గతంలో ఉన్న కాంట్రాక్టర్ లు ఈపీఎఫ్ డబ్బులు వెయ్యకుండా కార్మికులను మోసం చేస్తున్నారని, వెంటనే కార్మికుల పీఎఫ్ డబ్బులు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో వీరి పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి కోరారు. అందుకు వీసీ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీతారాం, ,ఉపాధ్యక్షులు , శ్రీనివాస్,నాగరాజు, సహాయ కార్యదర్శులు కుమార్,అనిల్, నాయకులు, శ్రీనివాస్, లక్ష్మీ, యాదమ్మ, ప్రమీల,పద్మ,సత్యం,అరుణ, పర్మేశ్, యాదగిరి, మక్బూద్, ప్రవీణ్, రాము, సుఖన్య, రాణి పాల్గొన్నారు.



నాచారంలోని ఎస్‌టీపీ వద్దకు ఆదివారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్న సందర్భంగా ఎస్‌టీపీని శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, పార్టీ గ్రేటర్ హైదరాబాద్ నాయకులు సాయి జెన్ శేఖర్ పాల్గొన్నారు. నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా యూనివర్సిటీ నూతన వీసీగా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం. కుమార్‌ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి ,గంధం నాగేశ్వర్ రావు, సాయి జెన్ శేఖర్, కంచర్ల సోమిరెడ్డి ఉన్నారు. నవతెలంగాణ-ఓయూ

ఓయూ లా కళాశాలలో సింపోజియం



నవతెలంగాణ-ఓయూ

పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డైరెక్టర్ జనరల్ ఇపిటీఆరి, ఐఏఎస్ అహ్మద్ నదిమ్ తెలంగాణ ప్రభుత్వం అధ్యక్షతన ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ), యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ లా, ఓయూ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఓయూలోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ లా లో "జస్ట్-గ్రీనింగ్ ఫర్ క్లైమేట్ జస్టిస్" పై సింపోజియం నిర్వహించాయి. మోహన్ చంద్ర పర్గయిన్, ఐఎఫ్ఎస్ (రిటైర్డ్), తెలంగాణ ప్రభుత్వ మాజీ పిసీసీఎఫ్, ఓయూ దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ,సీనియర్ ప్రొఫెసర్ జిబి రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రాధికా యాదవ్, ప్రొ. బి. విజయలక్ష్మి ప్రొఫెసర్ అండ్ డీన్, యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ లా, ఓయు, డాక్టర్ రాజేశ్వర జోన్నలగడ్డ హెడ్, క్లైమేట్ చేంజ్ అండ్ ట్రైనింగ్ డివిజన్లు, ఇపిటిఆర్ఎ వాతావరణ న్యాయంపై కీలక వక్తలుగా మాట్లాడారు. వాతావరణ మార్పులను పరిష్కరించాల్సిన అత్యవసర అవసరం గురించి అవగాహన పెంచడం సింపోజియం లక్ష్యం. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, అందరికీ పచ్చదనం , మరింత స్థిరమైన భవిష్యత్తు కోసం పనిచేయడం ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందన్నారు.యూనివర్శిటీ ఆఫ్ లా కాలేజ్ ఓయూ పలు వివిధ విభాగాల నుండి విద్యార్థులు, అధ్యాపకులు, సమకాలీన వాతావరణ పాలనపై విద్యార్థులు తమ సొంత ఆలోచనలు వ్యక్తం చేశారు. భాగస్వామ్య వాతావరణ చర్యలకు తగిన సిఫార్సులను సూచించారు. ఎం. ప్రవీణ్, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్, రీసెర్చ్ ఫెలో సాధన చాగంటి, పి. భాస్కర్ నాయక్, పి. ప్రవీణ్ చారి, ఇపీటీఆర్ఐ , ఇపీటీఆర్ఐకి చెందిన ప్రాజెక్ట్ అధ్యాపకులు ప్రశాంతి, షిరిషా ఈ సింపోజియం లో పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



- వెస్లీ విద్యావిధానం భేష్
- డీసీపీ రేష్మి పెరుమాల్

నవతెలంగాణ-ఓయూ

విద్యార్థులు రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా చేసేందుకు కృషి చేయాలని నార్త్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు, ఎస్.రేష్మి పెరుమాల్ అన్నారు. శుక్రవారం వెస్లీ పీజీ కళాశాల ఎంబీఏ, ఎంసీఏ , యం.ఎస్సీ , ఎంఏ , కోర్సుల విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వారు హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత విద్యా లో ప్రవేశిస్తున్న వేళా గొప్ప లక్ష్యాలు నిర్దేశించుకొని జీవితంలో స్థిర పడేందుకు నిరంతరం శ్రమించలన్నారు. వెస్లీ విద్యా సంస్థ సామాజిక స్పృహ తో అందిస్తున్న విద్యావిధానాన్ని ప్రశంసించారు. డైరెక్టర్ డా.బి.విమల్ సుకుమార్ మాట్లాడుతూ.గత కొన్ని సంవత్సరాలుగా అందిస్తున్న విద్యా విధానం గురించి వివరించారు. క్రమశిక్షణ, ఉపాధికి పెద్దపీత వేస్తున్నట్లు డా.విమల్ సుకుమార్ చెప్పారు. ప్రిన్సిపాల్ డా.పి.యం.యోహాన్ మాట్లాడుతూ. వివిధ కోర్సుల వివరాలాలో అవగాహన తో పాటుగా అందిస్తున్న సౌకర్యాలు, వివరించారు. విద్యార్థుల అభ్యున్నతికి ,వారి పురోగతి ప్రత్యేకంగా అర్హులైన అధ్యాపకులు భోదిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చిషఫ్ కమిషనరి రెవ బి.విన్ స్టాన్ ,ఎడ్యుకేషన్ సెకరేటరి రేవ వి.రవి కుమార్ , మినిస్ట్రీయల్ బోర్డ్ కన్వీనర్ రెవ విల్ సన్ , రెవ జయానంద్ , జాన్ జోంతన్ , ప్రభు కిరణ్ ,సోలో మెన్ ,డా.దయనంద్ ,రవులా సంసొన్ లు ప్రసంగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రం పరిశీలించిన ఈడీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఈడీ మాయాంక్ మిట్టల్ ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ లో ఉన్న తాగు నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఆయన నీటి శుద్ధి ప్రక్రియ, అందులో ఉపయోగించే పద్ధతులు, టర్బిడిటీ, పీహెచ్ స్థాయి, అల్కలైనిటీ తదితర వాటిని పరిశీలించారు. ఈడీ వెంట టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ట్రాన్స్ మిషన్ సీజీఎం, జీఎం, క్వాలిటీ వింగ్ అధికారులు ఉన్నారు.

ఓయూలో బయోమెడికల్ సెమినార్



నవతెలంగాణ-ఓయూ

బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సహకారంతో "వైద్య పరికరాలలో ఇటీవలి ట్రెండ్స్,ఆర్‌టీఎంఈ-2024" అనే అంశంపై 2 రోజుల జాతీయ సెమినార్‌ను శుక్రవారం బీఎంఈ విభాగం లో ఘనంగా నిర్వహించారు. ఓయూ వీసీ ప్రొ.యం.కుమార్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బయోమెడికల్ ఇంజినీరింగ్ విశిష్టమైన అంశాల ను సాంకేతిక ఆవిష్కరణలను ఉపయోగించుకునేందుకు విద్యార్థులు, అధ్యాపకులను శక్తివంతంగా కషి చేయాలన్నారు. రోబోటిక్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పురోగతి ద్వారా బీఎంఈ హెల్త్‌కేర్ ల్యాండ్‌స్కేప్‌ను మారుస్తోందని, రోగనిర్ధారణ, చికిత్స, రోగుల సంరక్షణలో కొత్త క్షితిజాలను సష్టిస్తోందని పేర్కొన్నారు. ప్రొ.కుమార్ స్వీయ-నిరంతర సమాజాన్ని అభివద్ధి చేయడంలో విద్య, పరిశోధన, ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. సాంకేతికత, జ్ఞాన సష్టిలో పురోగతి అత్యంత మారుమూల, పేద జనాభాకు సరసమైన ఆరోగ్య సంరక్షణను అందిస్తుంది. వైద్య పరికరాల కోసం సీడీఎస్‌సీఓ ఏర్పాటులో కేంద్ర ప్రభుత్వం ఇటీవలి చొరవను ఈ సెమినార్ పరిధిలోకి చేర్చినందుకు నిర్వాహకులను ఆయన అభినందించారు. ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమ కోఆర్డినేటర్లు డా.డి.సుమన్, డాక్టర్ కె.ఇ.సి.విద్యాసాగర్, బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొ. ఎం.మాలినిలను ఆయన అభినందించారు. ఆరోగ్య సంరక్షణ పరిశ్రమలోని నిపుణుల ద్వారా వైద్య పరికరాలలో వినూత్నమైన పురోగతిని అన్వేషించడం ఈ సెమినార్ లక్ష్యం. ఈ ఈవెంట్ బీఎంఈ ఫీల్డ్‌లోని ప్రాక్టీస్ చేసే ఇంజినీర్‌లతో పరస్పరం వ్యవహరించడానికి, నెట్‌వర్క్ చేయడానికి మనలో ప్రతి ఒక్కరికీ సరైన వేదికను అందిస్తుందన్నారు. ఇలాంటి సెమినార్ల ద్వారా బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో అత్యాధునిక అంశాల్లో జ్ఞానాన్ని అందించేం దుకు పాఠ్యాంశాల్లోని లోపాలను పరిష్కరిస్తారన్నారు. ఈ సందర్భంగా సెమినార్ సావనీర్‌ను వీసీ చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో హెడ్ డా.మాలిని, డా.మేడి శ్రీనివాస్, డా.శ్రవణ్య ,డా.హరీష్ ,డా.కిరణ్ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో కార్పొరేటర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ - బంజారా హిల్స్..

ఖైరతాబాద్ కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి, జన్మదిన వేడుకలు శుక్రవారం నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో ప్రవీణ్ యాదవ్,బబ్లూ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రోగులు, వారి సహాయకులతో కలిసి కేక్ కటింగ్,అన్నదాన కార్యక్రమలు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు కోఠి ప్రభుత్వ ఆసపత్రిలో ఆమె జన్మదిన వేడుకలు ఘనంగా ఏర్పాటు చేసి రోగులందరికీ ఫ్రూట్ జ్యూస్ పంపిణీ చేశారు.

మహాధర్నాలో పాల్గొన్న కార్పొరేటర్



నవతెలంగాణ-అంబర్‌పేట

మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడ నివాసించే పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని శుక్రవారం తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా పార్క్‌ని ధర్నాచౌక్ వద్ద తలపెట్టిన మహాధర్నాలో కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు నాగభూషణం చారి, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన మహిళా ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేవిక రొక్కం తదితరులు

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గిరిజన సంక్షేమ హాస్టళ్ల టీచర్లు, వార్డెన్లకూ ఎఫ్ఆర్ఎస్

- పాఠశాల, హాస్టల్స్ విద్యార్థులకు ఇప్పటికే అమలు
- ప్రతిరోజు యాప్‌లో 600 మంది విద్యార్థుల హాజరు నమోదు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) హాజరును నమోదు చేస్తున్నారు. గత కొంతకాలంగా ఈ విధానం అమలుతో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. ఈ విధానం అమలు చేయకముందు చాలా తక్కువగా ఉండేదని విద్యాశాఖ అధికా రులు, హెచ్ఎంలు చెబుతున్నారు. రెండు నెలలుగా జిల్లాలోని గిరిజన హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతీ రోజు హాస్టలలో వసతి పొందుతున్న విద్యార్థుల హాజరు వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్ నమోదు చేయడంతో మంచి ఫలితాలు కనిపిస్తుండటంతో ఆయా పాఠశాలలు, హాస్టల్స్ టీచర్లు, వార్డెన్లకూ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సంక్షేమ హాస్టళ్లపై నమ్మకం పెరుగనుంది. కాగా త్వరలోనే ఈ విధానాన్ని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో కూడా అమలు చేస్తారని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

రిజిస్టర్..బయోమెట్రిక్..ఇప్పుడు ఎఫ్ఆర్ఎస్..!

నగరంలో రెండు గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ ఉన్నాయి. వీటిల్లో మొత్తం 600 విద్యార్థులు చదువుతో పాటు వసతి పొందుతున్నారు. కరోనాకు ముందు విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లో నమోదు చేయగా.. అనంతరం బయోమెట్రిక్ విధానాన్ని తీసుకొచ్చారు. అనంతరం కరోనా కట్టడిలో భాగంగా బయోమెట్రిక్ విధానానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇప్పుడు మళ్లీ ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. వాస్తవానికి సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య, సరుకుల వివరాల నమోదులో పారదర్శకత పాటించే వారు కాదని విమర్శలున్నాయి. బయోమెట్రిక్ హాజరుతో అది కొంతమేరకు తొలిగింది. కాగా ప్రస్తుతం కొత్త విధానం ఎఫ్ఆర్ఎస్ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లపై మరింత విశ్వాసం పెంచేలా కనిపిస్తున్నాయి. గిరిజన సంక్షేమ హాస్టలలోనూ ఇటీవల నుంచి ఎఫ్ఆర్ఎస్ అమలవుతోంది. ప్రతిరోజు ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని దాదాపు 600నుంది విద్యార్థుల హాజరును ప్రతీ రోజు ఎస్ఆర్ఎస్ యాప్ సంబంధిత ఉపాధ్యాయులు, వార్డెన్లు నమోదు చేస్తున్నారు. విద్యార్థుల హాజరు నమోదు కాగానే ఏ పాఠశాల, హాస్టల్లో ఎంత మంది విద్యార్థులున్నారనే సంఖ్య ఎప్పటికప్పుడు గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు నమోదవుతున్నాయి. ఒకవేళ హాజరుపై అనుమానం వస్తే ఆన్‌లైన్‌లోనే హాజరైన విద్యార్థులు ఎంతమంది.. గైర్హాజరైన వారు ఎంతమంది అనే వివరాలు అధికారులు తెలుసుకునే అవకాశం ఉంది. ఎఫ్ఆర్ఎస్‌లో గిరిజన పాఠశాలల్లోని విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు హాస్టలోని సరుకుల నిర్వ హణలో అవకతవకలు జరుగకుండా గిరిజన సంక్షేమ శాఖ పటిష్ట చర్యలు చేపడుతోంది. అయితే ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల వివరాలు నమోదుకు చేసేందుకు ఎక్కువ సమయం తీసు కుంటుందని, తద్వారా కొంత ఇబ్బం దులు ఎదురవుతున్నట్టు తెలిసింది. మొత్తానికి విద్యార్థుల హాజరును ఎఫ్ఆర్ఎస్ నిర్వహించడం ద్వారా విద్యార్థులను మరింత ప్రతిభా వంతులుగా తీర్చిదిద్దేంచుకు అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

నొప్పులకు ఆధునిక పద్ధతులతో చికిత్సలు

- దీర్ఘకాలిక, తీవ్రమైన నొప్పులపై 'కిమ్స్'లో వర్క్‌షాప్



నవతెలంగాణ-సిటీబ్యూరో

దీర్ఘకాలిక, తీవ్రమైన నొప్పికి చికిత్స చేయడంలో వస్తున్న ఆధునిక పద్ధతులపై మత్తు మందు వైద్య నిపుణులు, పెయిన్ ఫిజిషియన్ల కోసం కిమ్స్ ఆస్పత్రిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెయిన్ మెడిసిన్ అండ్ ఎనస్థీషియాలజీ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. నొప్పి నివారణకు అందుబాటులో ఉన్న చికిత్స విధానాలపై వైద్య నిపుణులను అప్‌డేట్ చేయడం, రోగుల వారీగా ఎవరికి అవసరమైన నొప్పి నివారణ పద్ధతులు వారికే అందజేసేలా శిక్షణ ఇవ్వడం ఈ వర్క్‌షాప్ లక్ష్యం. ఈ కార్యక్రమా న్ని కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎనస్థీషియాలజీ హెచ్ఓడీ డాక్టర్ నరేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ "పెరిఆపరేటివ్ సెటప్, దీర్ఘకాలిక నొప్పి నివారణ క్లినిక్‌లలో.. నొప్పిని సమర్థంగా తొలగించడానికి అల్ట్రాసౌండ్, ఫ్లూ రోస్కొపీల విస్తత వాడకంపై ప్రధానంగా దృష్టిపెట్టాం. అవగాహన పెంపొందించడానికి, విజ్ఞానం చేరవేయడానికి మేం ఒక ప్లాట్ ఫాం సష్టించడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించు కున్నాం. అనుభవజ్ఞులైన మా ఫ్యాకల్టీ నుంచి రియల్-టైం ఇమేజింగ్ పద్ధతుల గురించి నేర్చుకోడానికి హాజరైనవారికి ఒక అవకాశం లభించింది" అని చెప్పారు. కన్సల్టెంట్ పెయిన్ ఫిజిషియన్ డాక్టర్ నాగలక్ష్మి పట్నాల మాట్లాడుతూ రెండు రోజుల పాటు కిమ్స్ ఆస్పత్రి లో వర్క్ షాప్ నిర్వహిస్తున్నామనీ, మూడో రోజు ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లో కెడవర్ మీద శిక్షణ చేస్తారని వెల్లడించారు. కాగా రాష్ట్రంలోను, రాష్ట్రం వెలుపల ఉన్న అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో ఈ వర్క్‌షాప్‌ను డాక్టర్ నరేష్ కుమార్‌రెడ్డి నేతత్వంలో డాక్టర్ నాగలక్ష్మి పట్నాల, ఉస్మానియా మెడికల్ కాలేజ్ అనస్థీషియాలజీ విభాగం నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి నిర్వహించారు.

తెలుగుదేశం పిలుస్తోంది రా! కదలి రా!! అనే నినాదంతో...

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించిన సాయిబాబా



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలుగుదేశం పిలుస్తోంది రా! కదలి రా!! అనే నినాదంతో... టీడీపీ సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా నాయకులు తెలిపారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సికింద్రాబాద్ పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు పి.సాయి బాబా సభ్యత్వ నమోదు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. (నేడు) శనివారం ఉదయం 9 గంటలకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారని తెలిపారు. తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయి నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. 1982లో తెలుగుదేశం పార్టీని ముషీరాబాద్ నియోజకవర్గంలోని రామకృష్ణ స్టూడియోలో స్థాపించారని, అక్కడి నుండే తెలుగుదేశం పార్టీ ప్రస్థానం ప్రారంభమైందని గుర్తు చేశారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన అభివృద్ధి సంస్కరణల వల్ల ఈరోజు హైదరాబాద్ నగరం హైటెక్ సిటీగా ఆవిర్భవించిందన్నారు. తెలుగుదేశం పార్టీ విధానాల పట్ల, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ క్షేత్రస్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పిలుస్తోంది రా! కదలి రా!! అనే నినాదంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుకుగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజగౌడ్, శ్రీపతి సతీష్, ఎంకె.బోసు, ఎం.రాజు, గౌరీ శంకర్ యాదవ్, బి.రాజు తదితరులు పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం




నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతాపసింగారం, పూడూర్‌లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డి.విజయేందర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఓ.సుగుణ బాయి, జిల్లా సహకార అధికారి వెంకట్‌రెడ్డి ప్రారంబించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం దిగుబడిని ప్రభుత్వం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. తదుపరి సన్నవడ్ల కొనుగోలు సమయంలో ఒకే కేంద్రంలో సన్నవడ్లకు, దొడ్డు వడ్లకు ప్రత్యేక విభాగాలు ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సన్నవడ్లకు గన్ని బాగులపై 'ఎస్' అనే అక్షరంతో పాటు, జిల్లా సెంటరు కోడ్ ఉండేలా చూసుకోవాలన్నారు. సన్నవడ్ల లోడును/దొడ్డువడ్ల లోడ్లను వేర్వేరుగా రైస్ మిల్లులకు పంపాలనీ, ఆ మేరకు రిజిస్టర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాలని ఆయా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వ నియమాల ప్రకారం అన్నీ రకాల ఏర్పాట్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతు తమ ధాన్యం అమ్మిన 48 గంటల్లో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ చేస్తారని తెలిపారు.

శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ





- శామీర్‌పేట ఎస్‌హెచ్ఓ శ్రీనాథ్‌ను అభినందించిన డీసీపీ

నవతెలంగాణ-శామీర్‌పేట

శుక్రవారం సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని బాలానగర్ డీసీపీ శామీర్ పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పరేడ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ భవనాన్ని తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని అన్ని రకాల రికార్డులతో పాటు కేసుల విచారణ ఫైళ్లను పరిశీలించి పలు సీఐ, ఎస్ఐలకు సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శామిర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన రాబరి, డెకాయిటీ, దొంగతనం కేసులలో శామిర్ పేట పోలీసులు చేసిన ఇన్వెస్టిగేషన్, చాకచక్యంగా వ్యవహరించి తక్కువ సమయం లో నేరస్తులను పట్టుకుని బాధితులకు న్యాయం చేసిన తీరుకు ప్రశంసించిన డీసీపీ కోటిరెడ్డి ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓఎస్ శ్రీనాథ్‌ను సిబ్బందిని అభినందించారు. అంతేగాక ఉత్తమ సేవలు నిర్వహించిన సిబ్బందికి రివార్డ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రాములు , శామిర్‌పేట ఎస్ఐలు హారిక, పరుశురాం, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT HAYATNAGAR
O.S.No. 751 of 2024

Between:-
1. Sarabu Hemalatha, W/o. Late Sudharshana Chary, Aged 44 years, oce: Housewife,
2. Sarabu Shanmuka Janardhana Chary,S/o. Late Sudharshana Chary,Aged 30 years, oce: pvt.employee,
3. Sarabu Sarvana Adithya Chary, S/o.Late Sudharshana Chary, Aged 26 years, occ: pvt.employee,
All are Rio.H.No. 2-20-102, New Ramnagar Colony, Chilkanagar, Uppal, Medchal-Malkajgiri District.

AND

The Tahsildar/MRO, Hayatnagar Mandal, Ranga Reddy District.
2. To Whomsoever Concerned.
...Defendants

NOTICE

To.
All concerned.

It is submitted that the Plaintiffs filed the above said suit seeking a relief of declaration to declare them as legal heirs of Late Sarabu Sudlarshana Chary and the said suit was posted to **04-11-2024** while ordering for paper publication. Therefore, if anybody having any objection in this regard please appear before the Hon'ble Court along with relevant documents on the above said date.

// By Order //
Counsel for the Plaintiffs
Sri D. BALA MALLESH
Advocate,
18-36, Zahid Nagar, Uppal,
Mobile: 9848162618

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, EDCHAL_ MALKAJGIRI DISTRICT: AT: MEDCHAL
AACF.NO: 472 OF 2024

BETWEEN:
M/s. Sri Arpitha Chits Funds (P) LTD. Rep. By its Managing Director, B.Sandhya Rani, Nagole Branch having Registered Office at #2-4-589/1, Plot No.18, Road No.9, New Nagole Colony, Medchal, Malkajgiri, Hyderabad.
....DISPUTANT

VERSUS

1.KAKIREDDY SWATHI,W/O. CH.RAJKIRAN, R/O. H.NO. 16-133, REDDY BASTHI, SAIDABAD, HYDERABAD TS – 59.
2.K SUNANDA, W/O. CH. VENKATESH R/O. H.NO. 16-133, REDDY BASTHI, SAIDABAD, HYDERABAD TS – 59.
.....OPPONENTS

Please take notice that the above dispute is filed against you for recovery of Rs. 5,18,100/- the same is posted to Date: 12-11-2024 for your appearance before the office of Deputy Registrar of Chits/Arbitrator, Medchal-Malkajgiri District, At: PBS Kaparthi Towers, Reliance Fresh Supermarket Upstairs, 2nd Floor, Beside Venkateshwara Theatre, Medchal,at 11-00 AM., If you fail to attend the office of Deputy Registrar of Chits/Arbitrator on that day the above dispute will be heard and decided exparte.

(BY THE ORDER OF DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR)
B. BHUPESH VARDHAN
P.DAYAKAR,P. RAGHAVEBDER
Advocates,
Flat No. 101, 1st Floor,
Harizon Sree Rama Enclave,
Kachiguda, Hyderabad-27.
CELL. NO. 9948664234

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, EDCHAL_ MALKAJGIRI DISTRICT: AT: MEDCHAL
AACF.NO: 543 OF 2024

BETWEEN:
M/s. Sri Arpitha Chits Funds (P) LTD. Rep. By its Managing Director, B.Sandhya Rani, Nagole Branch having Registered Office at #2-4-589/1, Plot No.18, Road No.9, New Nagole Colony, Medchal, Malkajgiri, Hyderabad.
....DISPUTANT

VERSUS

1.KAKIREDDY SWATHI,W/O. CH.RAJKIRAN, R/O. H.NO. 16-133, REDDY BASTHI, SAIDABAD, HYDERABAD TS – 59.
2.CH.RAJKIRAN, S/O. LATE, CH.VENKATESH, R/O. H.NO. 16-133, REDDY BASTHI, SAIDABAD, HYDERABAD TS – 59.
3.K SUNANDA, W/O. CH. VENKATESH R/O. H.NO. 16-133, REDDY BASTHI, SAIDABAD, HYDERABAD TS – 59.
.....OPPONENTS

Please take notice that the above dispute is filed against you for recovery of Rs. 5,18,100/- the same is posted to Date: 12-11-2024 for your appearance before the office of Deputy Registrar of Chits/Arbitrator, Medchal-Malkajgiri District, At: PBS Kaparthi Towers, Reliance Fresh Supermarket Upstairs, 2nd Floor, Beside Venkateshwara Theatre, Medchal, at 11-00 AM., If you fail to attend the office of Deputy Registrar of Chits/Arbitrator on that day the above dispute will be heard and decided exparte.

(BY THE ORDER OF DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR)
B. BHUPESH VARDHAN
P.DAYAKAR,P. RAGHAVEBDER
Advocates,
Flat No. 101, 1st Floor,
Harizon Sree Rama Enclave,
Kachiguda, Hyderabad-27.
CELL. NO. 9948664234

BEFORE THE FAMILY JUDGE FAMILY COURT RANGA REDDY DISTRICT AT: LB NAGAR
IA NO. 285 OF 2024
IN
F.C.OP NO. 1154 OF 2020

Between:
Uppala Navya
...Petitioner/Petitioner
AND
Banothu Suresh
...Respondent/Respondent

To,
Banothu Suresh @ Sudhan Singh Rathore S/o Redhya Naika Redya, Age: About 29 years, Hindu, Oce: Student, N/o: Beckyathanda Village, Kodad Mandal, Suryapet District Telangana State
......Respondent/Respondent

Please take notice that, the above petitioner is filed above IA filed under sec 5 of Limitation Act for condone the delay for restoration of FC OP No. 1154 of 2020 under order 9 rule 9 of CPC You are therefore require to appear in person or through an Advocate along with your counter in the above IA on 22.11.2024 before the said Court at about 10-30 A.M., failing which the matter would be heard and decided exparte in your absence.

//BY ORDER OF THE COURT
S. Madhusudhan Reddy.
Advocate
Counsel for Petitioner
Plot no 121, Road No 4. Apple Avenue Colony Phase-I bijapur, Turkayamjal Municipality
Abdullapurmet Mandal, R.R. District 501510.

IN THE COURT OF THE M A C T I-ADDL DISTRICT JUDGE AT WARANGAL
O.P. NO. 121 OF 2022

Between :
Gudipati Ravinder Reddy Being bed ridden and in coma rep by his wife Gudipati Rajitha ...Petitioners
And
P. Adhvaith, and others
...Responents

To,
R1-P.Adhvaith,S/o.Ramchandramurthi, aged: Major, Occu : Driver of the Crime Vehicle, R/o. H.No. 1-1-11/5, Shivalingapuram,Manuguru,Khammam District - 507117,
R 2-T.Prasanna,W/o.Rajesh,aged : Major, Occupation : Owner of the crime Vehicle, R/o HIG-374375, f , No, 202, Park view IV Phase KPHB colony Medchal Ranga Reddy District -500072

Please take notice that the above Petitioners filed OP for Grant of Compensation against the Respondents Where in You are R.No.1 and R2 Please Attend before the Hon'ble Court on 05-11-2024 At 10.30 AM in Person or Through an Advocate other wise you will be set-exparte.

// By order of the Hon'ble Court //
P. NAGESH
Advocte
Hanamkonda
Date:25-10-2024 **Cell : 9849009396**

DOCUMENT LOST

This is to inform the General Public through this notice that I Mr. Raghava Reddy while going in the Scooter from My House to Market in Ghatkesar I lost a Bag today **25-10-2024** @ 3pm which Contains valuable Original Documents the details of which are follows:**1.** Original Link Documents **3277 of 1985**. **2.** Original Link Documents **22493 of 2006**. **3.** Original Link Documents **10293 of 2007**. **4.** Original Link Documens **3099 of 2014**. **5.** Original Sale Deed copy of **3100 of 2014**. **6.** Original Sale Deed copy of **2383 of 2017** If found please contact the below mentioned Address. The finder will be suitably rewarded. Howe ver if the Documents are not found we will apply for Certified Copies and anyorie Dealing with the Above Documents will be doing so at own risk. G.Raghava Reddy, 15-3-132, Dattatreya Nagar Colony, N.F.C. Nagar,Ghatkesar.Mob:**98481-55143**

IN THE COURT OF THE HON'BLE II ADDL JUNIOR CIVIL JUDGE MEDCHAL-MALKAJGIRI DIST UPPAL AT : LB NAGAR
O.S.NO. 402 OF 2022

BETWEEN:
VAKITI SUVARNA ... Plaintiff
AND
BUKYA.VINOD KUMAR and other
...Defendants

To,
DHEERAVATH.MOHAN NAYAK, S/o EARYA NAYAK Aged about 45 years, Occ: Pvt.Employee R/o H.No.5-58/01 (Ground floor), Road no.1 Panchavati colony (V & M), Medipally, M.M.Dist
... Defendant No.2

Take notice that the above named Plaintiff has instituted the above said suit No.402/2022 against the above said defendant. No.2 of you is the defendant No.2 are hereby summoned to appear before this Hon'ble Court in person on DT: **18-11-2024** at 10.30 am. In default of your appearance on the day aforementioned, the suit will be heard and determined in your absence.

// By Order of the Court //
--Sd/--
M RANGASWAMY
Counsel for Plaintiff
O/o 8-53/6, Dwarakanagar
Uppal, Medchal-Malkajgiri Dist-39

IN THE COURT OF HON'BLE PRINCIPAL CITY CIVIL JUDGE AT CHENNAI
TR. O.P.NO. 64 OF 2024

Mr. V. Sridhar
..Petitioner
Vs.
Mr. V. Manoharan & 4 Others
...Respondents

To,
R-1 V. Manoharan S/o R. Varadharajan (Late) MIG-1-84, 9th Street, 9th Phase, Near Water Tank KPHB Colony, Kakatpally, Hyderabed, Andhra Pradesh 500085.

Sir,
Please take notice that the petitioner filed the petition in Tr. O.P.No. 64/2024 to withdraw the O.S. No.6818/2022 pending on the XIII City Civil Court, Chennai and transfer the same to the file of XXIII Assistnat City Civil Court, Chennai to be tried along with O.S. No. 8857/2022. This Hon'ble Court was pleased to order Paper Publication for your appearance and returnable on **29.10.2024.**
Please further take notice to appear on **29.10.2024** at 10.30 a.m. before this Hon'ble Court if failing which this matter will be decided on merits in your absence.

M.RAJENDIRAN
Counsel for Petitioner.

IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT JUDGE R.R. DISTRICT AT: L.B. NAGAR
I.A. No.121 OF 2024
IN
O.S. No.1189 OF 2022

Between
Baddam Surender Reddy
...Petitioner/Plaintiff
AND
M.Ramulu & (3) Others
... Respondents/Defendants
AND
Ramesh Ponugoti & (2) Others
..Respondent/Prop. Defts.No.5to7

NOTICE

To,
D5) Ramesh Ponugoti, S/o. Ramaiah Ponugoti, Aged about 54 years, Occ.: Business, R/o. Villa No.35, Gandipet, R.R. District-500 075.

Please take notice that the Plaintiff herein had filed the above suit seeking the relief of specific performance of the agreement dt.07.11.2012 in respect of the suit Schedule property against the Defendants herein and the naid matter is posted to 20.11.2024 for your appearance.
Hence, you are requested to appear before the above said Hon'ble Court at 10:30 am. on the said date either personally or through your authorized Counsel for submitting your claim or otherwing the matter will be adjudicated as per law. Hence, this notice.

(BY ORDER OF THE COURT)
(AKULA MAHESH KUMAR)
Advocate
Flat No.206, 2 Floor. Indra Dhanush Apartments, Beside Axis Bank, Road No.2, Banjara Hills, Hyderabad-074
Cell: 98489 33536

IN THE COURT OF THE HON BUOTICEIOR CIVIL JUDGE, MAHESHWARAM, RANGA REDDY DISTRICT AT : MAHESHWARAM.
IA.No.745 OF 2023
IN
O.S.NO.237 OF 2021

BETWEEN:
Rathlavath Kotya
..Plaintiff
AND
Rathalavath srinu & others
...Respondents

To: **Defendant No.3,4 & 5.**
Defendant No.3.M/S Best Land mark realtors Rep.it"s Managing Partner R. Surender S/o.R.Narayana, Aged about:37 years Occ: Business R/o.office:at, flat no 102, Noble residency, Venkata sai Enclaves Nizampet road, Hyd.
Defendant No.4. R. Surender S/o.R.Narayana, Aged about:37 years Occ: Business R/o.office flat no 102, Noble residency, venkata sai Enclaves Nizampet road, Hyd.
Defendant No.5. Rajesh kumar Mishra s/o. Hari Krishna Miahra, aged about 42 years occ:Business R/o. plot No.89, Telecom colony, Thirumalghery Secunderabad

Please take notice that, the Plaintiff has filed the suit for relief of Suit for partition and separate possession,. The Hon'ble junior civil Judge Court, Ranga Reddy District, At.Maheshwaram in O.S. No. 237/2021 and the same is posted for your appearance on **27-11-2024** at 10:30 am and all of you have to attend before the above said Hon'ble court by personally or through an Advocate. If you fail to appear on the said date and time the matter will be heard and decided on merits.

MUDAVATH SRIKANTH NAYAK,
B.A.LL.B,
ADVOCATES.
Office at: Maheshwaram Village & Mandal Ranga Reddy District.Cell:9666607680

IN THE COURT OF THE HONOURABLE 1st ADDITIONAL JUNIOR CIVIL JUDGE- CUM Vth ADDITIONAL METROPOLITAN MAGISTRATE UPPAL AT : L.B. NAGAR MEDCHAL MALKAJGIRI DISTRICT
O.S.No.628 of 2024

Between:
Gadeela Raghava Reddy & 4 Others
.....Plaintiffs
AND
The Tahsildhar, Ghatkesar & All Concemed. ....Defendant

This is to inform to the General Public that the above said Plaintiffs, viz., Sri Gadeela Raghava Reddy S/o. Gadeela Narasimha Reddy, Smt. G. Depika D/o Gadeela Raghava Reddy, Smt. Gadeela Sudha Rani (Daughter in law) of Gadeela Raghava Reddy, Gadeela Akshit Reddy, Gadeela Aadhya Reddy, Grandson and Grand Daughter of Gadeela Raghava Reddy respectively and the Legal Heirs of Late Radha Reddy, the absolute Owner of two Properties.
1. House bearing Non 15-3-132, Plot No. 132 in Survey Nos. 244/P,245,248,288/P situated at Bokkaniguda, Dattatreya Colony - 1(0-15) Ghatkesar Revenue Mandal N.F.C. Nagar, Ghatkesar, admeasuring 300 sq. Yards.under N.F.C. Nagar, Ghatkesar Gram Panchayat, Telangana State.
2. All that Open Plot No.72 in Survey Nos.246/P, Sai Sandeep Residency, N.F.C.Nagar, Ghatkesar Village, Ghatkesar Mandal. Telangana State.

The present Suit O.S.No.628 of 2024 has been filed by the plaintiffs before the Court of the Honourable 1st Additional Junior Civil Judge, at L.B. Nagar, Medchal Malkajgiri District seeking Declaration as Legal Heirs of the above Absolute Owner of the Suit Schedule Property and the above O.S. is posted before this Honorable Court on **28.11.2024.** And this Honourable Court has directed this plaintiffs to issue notice to "All Concerned" (D-2)" by way of News paper Publication. Hence, public at large are put to notice that if any person is having any objection to such claim of plaintiffs to be declared as absolute Owners of the alcove two suit schedule properties may file their Objection /Counter along with the relevant Documents in support of the claim/Objection at 10.30 a.m. before the Court of Honourable 1st Additional Junior Civil Judge,at L.B.Nagar, Medchal Malkajgiri Dist.on **28.11.2024**.failing which the Court will proceed and pass necessary Orders as Prayed for.

By Order of Honorouable 1st Additional Junior Civil Judge, at L.B. Nagar, Medchal Malkajgiri Dist.
N.Jaya Kumar & P.Prakash
Advocate
Counsel for Plaintiffs
Flat No.501,5th Floor
SKV Spandana Apartment St.No.5, West Marredpally
Secunderabad-26.
Mob:9989812878

IN THE COURT OF THE HON BUOTICEIOR CIVIL JUDGE, MAHESHWARAM, RANGA REDDY DISTRICT AT : MAHESHWARAM.
IA.No. 1174 OF 2023
IN
O.S.NO.237 OF 2021

BETWEEN:
Rathlavath Kotya
...Plaintiff
AND
Rathalavath srinu & others
...Respondents

To: **Defendant No.3,4 & 5.**
Defendant No.3.M/S Best Land mark realtors Rep.it"s Managing Partner R. Surender S/o.R.Narayana, Aged about :37 years Occ: Business R/o.office:at, flat no 102, Noble residency, Venkata sai Enclaves Nizampet road, Hyd.
Defendant No.4. R. Surender S/o.R.Narayana, Aged about:37 years Occ: Business R/o.office flat no 102, Noble residency, venkata sai Enclaves Nizampet road, Hyd.
Defendant No.5. Rajesh kumar Mishra s/o. Hari Krishna Miahra, aged about 42 years occ:Business R/o. plot No.89, Telecom colony, Thirumalghery Secunderabad

Please take notice that, the Plaintiff has filed the suit for relief of Suit for partition and separate possession,. The Hon'ble junior civil Judge Court, Ranga Reddy District, At.Maheshwaram in O.S. No. 237/2021 and the same is posted for your appearance on 27-11-2024 at 10:30 am and all of you have to attend before the above said Hon'ble court by personally or through an Advocate. If you fail to appear on the said date and time the matter will be heard and decided on merits.

MUDAVATH SRIKANTH NAYAK,
B.A.LL.B,
ADVOCATES.
Office at: Maheshwaram Village & Mandal Ranga Reddy District.Cell:9666607680

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT: RAJENDRANAGAR
O.S.NO. 623 OF 2024

Between:
1. Sameena Fatima W/o Shaik Ehtesham Ali,Aged about 39 years, Occ: Household,
2. Shaik Esmayeel Ali, S/o Shaik Ehtesham Ali Aged about 23 years, Occ: Student,
3. Asma Fatima D/o Shaik Ehtesham Ali,Aged about 22 years, Occ: Student,H.No. 2-6-5/11/66/A, Wahedunnisa Residency,Happy Homes Colony, Upperpally, Rajendranagar, Ranga Reddy District, T.S-500077.
4. Shaik Abdallah Ali S/o Shaik Ehtesham Ali,Aged about 10 years, Occ: Student,(Being a Minor Rep by its Natural Mother Plaintiff No.1)
Plaintiff No. 1, 2 & 4 are R/o. H.No. 2-6-5/11/47,Plot No-47, Sy.No-39, Happy Homes Colony, P2-Upperpally, Rajendranagar, Ranga Reddy District, T.S-500048.
....PLAINTIFFS
AND
The Tahsildar, Rajendranagar
... DEFENDANTS

All concerned

NOTICE

The plaintiff herein had filed the above suit for declaration to declare them as legal heirs of late Shaik Ehtesham Ali S/o Shaik Osman Ali against all concerned (D2). The Hon'ble Court was pleased to order for substitute service for any objections from anybody and posted the matter to **13-11-2024.** Hence, if any one got any objections are requested to appear before the above said Hon'ble Court at 10:30 a.m. on the said date either personally or through your authorized counsel, for submitting your claim or otherwise the matter will be adjudicated as per law.Hence, this notice.

(BY ORDER OF THE COURT)
(P.RAJU BABU)
ADVOCATE
Upparpally, Hyderabad
9392466070.

పేదల ఆరోగ్య సంక్షేమానికి నిరంతరం కృషి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

పేదల ఆరోగ్య సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖాజా హమ్మద్‌కు ఒక లక్ష రూపాయల ఎల్‌వోసిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ నిరుపేదల విద్య వైద్యానికి నిరంతరం తోడ్పాటు అందిస్తున్నానని భవిష్యత్తులో కూడా ప్రతి ఒక్కరికి అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఎల్‌వోసి అందించినందుకు బాధిత కుటుంబం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి..

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చలామణిలోకి వచ్చిన రూ.10 నాణేలు చట్టబద్ధమైనవని, వాటిపై అపోహలు, అనుమానాలు అవసరం లేదని, వ్యాపార లావాదేవీల్లో విరివిగా వినియోగించాలని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ ధారాసింగ్ నాయక్ అన్నారు. కోఠిలోని బ్యాంక్ స్ట్రీట్‌లోని సెంట్రల్ బ్యాంక్ కార్యాలయం ఆవరణలో నాణేల చలామణిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం వ్యాపారుల నుంచి నోట్లు తీసుకొని రూ.10 నాణేలు అందజేశారు. బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ రామకృష్ణన్, డీజీఎం సురేష్ (హైదరాబాద్), ఏజీఎంలు సత్యవాణి, శ్రావ్యప్రభ, కనకతేజ్, హైదరబాద్ ప్రధాన శాఖ చీఫ్ మేనేజర్ వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలకు వేదిక స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్

- డీఈవో రోహిణీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2024లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని, అందుకు మండల విద్యాధి .కారులు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణి తెలిపారు. 6 నుంచి 12వ తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, కోర్స్, ప్రోటో టైపింగ్, సమర్పణ నమోదు చేసేందుకు విద్యార్థులు గైడ్ టీచర్ల సహకారం తీసుకోవాలని చెప్పారు. http://schoolinnovationmarathon.org/lp వెబ్‌సైట్‌లో వచ్చేనెల 30 లోగా ఐడియా సమర్పణ పూర్తి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులకు /గైడ్ టీచర్స్‌కు జూమ్ ఒరియేంటేషన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ వివరాలు ఇవ్వాలని జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావ్‌కు డీఈవో సూచించారు.

పి.విజయరెడ్డి జన్మదినం పురస్కరించుకుని రోగులకు పండ్ల పంపిణీ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి.విజయరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కింగ్ కోఠి దవాఖానాలో హిమాయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దిలీప్ రెడ్డి, కమల, మంజుల, జావీద్, తాజ్ భాయ్, శివ, కిరణ్, అరుణ్ తదితరులు కలిసి రోగులకు పండ్లను పంపిణీ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-అంబర్‌పేట



అంబర్‌పేట డివిజన్‌కు చెందిన బి. నవీన్ కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఇటీవల ఓ ప్రయి వేటు దవాఖానాలో శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. ఆయనకు మాజీ మంత్రి హరీశ్‌రావు సిఫారసుతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన దాదాపు రూ.36వేల విలువగల చెక్కును శుక్రవారం గోల్నాక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దూసరి శ్రీనివాస్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

వన్‌టైం సెటిల్ మెంట్ స్కీమ్‌ను సద్వినియోగించుకోవాలి

నవతెలంగాణ సుల్తాన్‌బజార్



నల్ల బిల్లులు బకాయి ఉంటే వాటిపై ఉన్న వడ్డీ, జరిమానా లేకుండా చెల్లించేందుకు జలమండలి వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీంను వినియోగదారులు సద్వినియోగించుకోవాలని సుల్తాన్ బజార్ జలమండలి మేనేజర్ ఎం. కులశేఖర్ అన్నారు. ఈనెల 31వ తేదీ వరకు నల్ల బిల్లులు బకాయిదారులకు వడ్డీ లేకుండా చెల్లించేందుకు వన్ టైం సెటిల్ మెంట్ స్కీమ్ ఉందన్నారు. నల్ల కనెక్షన్ ఉన్న వినియోగదారులు నల్ల బిల్లు చెల్లించి జలమండలికి సహాయ సహకారాలు అందించాలని కోరారు.



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఫలక్‌నమా అంబేద్కర్‌నగర్‌లో కొత్త రోడ్డు, డ్రయినేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్న జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ వెంకన్నను సన్మానిస్తున్న అంబేద్కర్ సంక్షేమ సంఘం జనరల్ సెక్రటరీ గోడ ఈశ్వర్, ముఖ్య సలహాదారు బోయిని విజయ్ కుమార్ తదితరులు..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కోఠిలోని మహిళా విశ్వ విద్యాలయంలో శుక్రవారం గ్రూప్-1 పరీక్ష రాసేందుకు తల్లి వెళ్లడంతో రోధిస్తున్న చిన్నారులను సెల్ ఫోన్‌తో ఆడిస్తున్న తండ్రి..

నిర్లక్ష్యానికి పదేండ్లు

- వందేండ్ల గండిపేట్ కాండూట్‌కు మరమ్మతులు
- ఎండీ ప్రత్యేక చొరవ
- కెమికల్ ట్రీట్ మెంట్ పద్ధతి ద్వారా రిపేర్
- షట్ డౌన్ లేకుండానే కొనసాగనున్న మరమ్మతు పనులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగర ప్రజలకు తాగునీరు అందిస్తున్న చరిత్రాత్మక గండిపేట్ గత పదేండ్లుగా నిర్లక్ష్యానికి గురైంది. 1920లో అప్పటి నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం నిర్మించారు. గండిపేట్ నుంచి ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ వరకు మొత్తం నీటి సరఫరా గ్రావిటీ ద్వారానే జరుగుతుంది. దీనికి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాదు. ఫిల్టర్ బెడ్‌లో నీటి శుద్ధి అనంతరం వినియోగదారులకు నీటి సరఫరా జరుగుతోంది. ఈ రిజర్వాయర్ నుంచి జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నంబర్ - 4, 5, 6 పరిధిలో వినియోగదారులకు దీని ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. గత పదేండ్లుగా సరైన మరమ్మత్తులు లేకపోవడంతో లీకేజీ సమస్య తీవ్రమయ్యాయి. గుర్తించిన జలమండలి శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టింది. కాండూట్‌కు ఏర్పడిన లీకేజీని అరికట్టేందుకు మరమ్మతు పనులు చేపట్టింది.

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా జర్మనీ టెక్నాలేజీతో...

గండిపేట్ కాండూట్‌కి గత 10 సంవత్సరాల నుంచి గండిపేట్, కోకాపేట్, మణికొండ, సీబీఐటీ కాళాశాల, పుప్పాల గూడ, జానకీ నగర్, కౌసర్ కాలనీ, ఎంఈఎస్ క్యాంపస్ తదితర ప్రాంతాల్లో తీవ్ర లీకేజీలు ఏర్పడ్డాయి. అయితే, ఈ లీకేజీలను అరికట్టడానికి మరమ్మతులు చేపడితే నీటి సరఫరాలో నెల రోజుల పాటు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ఈ పనుల్ని వాయిదా వేస్తూ వస్తున్నారు. అయితే ఇబ్బందులు లేకుండా లీకేజీలను అరికట్టేందుకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఎట్టకేలకు చెన్నైకి సంబంధించిన కంపెనీ ముందుకొచ్చింది. జర్మన్ టెక్నాలజీతో సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా లీకేజీలు అరికడతామని హామీనిచ్చారు. ఇందులో భాగంగా 40 రోజుల కింద ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ వద్ద కాండూట్‌కి 10 మీటర్ల మేరకు గ్రౌటింగ్ ద్వారా మరమ్మతులు ప్రయోగాత్మకంగా చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో మిగతా ప్రాంతాల్లోనూ పనులు పూర్తి చేయాలని ఎండీ ఆదేశించారు.

మరో 14 ఎంజీడీల నీరు సరఫరా చేయవచ్చు : ఎండీ అశోక్ రెడ్డి

లీకేజీ సమస్యలను, చేపట్టిన పనులను జలమండలి ఏండీ అశోక్‌రెడ్డి గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడారు. పనుల కోసం వాటర్ షట్ డౌన్ చేస్తే వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని, దాంతో వారిని దష్టిలో పెట్టుకుని కెమికల్ ట్రీట్ మెంట్ పద్ధతిని ఉపయోగించి మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో మొదటగా ప్రత్యేక పరికరాలతో నీటిని ఖాళీ చేసి, ఆ ప్రదేశంలోకి ప్రత్యేకమైన రసాయనాన్ని పంపిస్తారని వివరించారు. ఆ రసాయనం క్షణాల్లో ఘనపదార్థంగా మారి, ఖాళీ ప్రాంతాల్లో పూడులను నిపేస్తుందని, దాంతో లీకేజీ ఆగిపోతుందన్నారు. ఈ పద్ధతి ద్వారా నీటి సరఫరా నిలిపివేయకుండానే మరమ్మతు పనులు నిర్వహించవచ్చాన్నారు. గండిపేట్ నుంచి నగరానికి మొత్తం 26 ఎంజీడీల తాగునీరు సరఫరా చేసే సామర్థ్యం ఉందని, కాగా.. ప్రస్తుతం 20 ఎంజీడీలు సరఫరా చేస్తే, అందులో దాదాపు 8 జీడీల నీరు ఈ లీకేజీల వల్ల వథా అవుతోందన్నారు. చివరికి 12 ఎంజీడీలు మాత్రమే వినియోగదారులకు సరఫరా చేయగలుగుతున్నామని తెలిపారు. ఈ లీకేజీ సమస్య దాదాపు 14.5 కిలో మీటర్ల మేర 45 ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ రిపేర్ పూర్తయితే మరో 14 ఎంజీడీల నీరు వినియోగదారులకు సరఫరా చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీజీఎం రవీందర్ రెడ్డి, ట్రాన్స్ మిషన్ అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాకు బీసీ సంఘాల వినతి



నవతెలంగాణ-అంబర్‌పేట

పార్లమెంట్ లో బీసీ బిల్లు ప్రవేశపెట్టడానికి, ఓబీసీ కులగణన చేపట్టడానికి, కేంద్రంలో ఓబీసీ మంత్రుత్వ శాఖ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీ వి. హనుమంత్ రావు నేతృత్వంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రధాన కార్యదర్శి టి. నందగోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. రాఘవేంద్ర, కార్యదర్శి జి. విజయ్ కుమార్‌లు న్యూ ఢిల్లీ సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో శుక్రవారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజాను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ దేశవ్యాప్త కుల గణనకు సీపీఐ ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతుందని, గతంలో సీపీఐ జాతీయ సమితి సమావేశాల్లో దేశవ్యాప్త కులగణన కోసం తీర్మానం కూడా చేసిందని తెలిపారు. జనాభా కులగణనను వాయిదా వేయడం ద్వారా మోడీ ప్రభుత్వం ఓబీసీ వర్గాలతోపాటు సమాజంలోని ఇతర అట్టడుగు వర్గాలను మోసం చేస్తోందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడం కోసం సమర్థవంతమైన చర్యలు చేపట్టడంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పుర్తిగా విఫలమైందన్నారు. ఓబీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పిస్తే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా 90శాతం సమస్యలు పరిస్కారమయ్యే అవకాశం ఉందన్నారు. ఇందుకు పార్లమెంట్‌లో ఓబీసీ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని అయన డిమాండ్ చేశారు. అదేవిదంగా ఓబీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక ఓబీసీ మంత్రుత్వ శాఖను కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందేనని డి. రాజా స్పష్టం చేశారు.

చెత్త రహిత ప్రాంతంగా మార్చేందుకు సహకరించాలి

- జోనల్ కమిషనర్ టీ. వెంకన్న



నవతెలంగాణ-ధూల్‌పేట్

నగరాన్ని చెత్త రహిత ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమానికి ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్- 2024 కార్యక్రమంపై చాంద్రాయణ గుట్ట నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం జోనల్ కమిషనర్ వెంకన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్ కో-ఆర్డినేటర్ యశస్విని పాల్గొని స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... హైదరాబాద్ మహా నగరాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాలు నిర్వ హిస్తుందన్నారు. చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తొల గించడం.. ప్రధాన రోడ్లు, టాయిలెట్స్ శుభ్రపరచడం, బహిరంగ మూత్ర విసర్జన చేయకుండా, నీటి నిలువలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో గతంలో సాధించిన ర్యాంకుల కంటే ఈ ఏడాది ఉత్తమ ఫలితాల సాధనకై అందరూ కృషి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో ప్రతి రోజు పర్యటిస్తూ పారిశుద్ధ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట్, సంతోష్ నగర్, చాంద్రాయణ గుట్ట, చార్మినార్, ఫలక్ నుమా, రాజేంద్ర నగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు జయంత్, శైలజ, సురేందర్, సరిత, అరుణ కుమారి, రవి కుమార్, డిసి (ఎస్డబ్ల్యూఎం) శంకర్ సింగ్, ఏఎంహెచ్‌లు, డీఈలు, సానిటరీ సూపవైజర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మెస్ చార్జీ, స్కాలర్‌షిప్పులు పెంచాలి

- రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-మెహిదీపట్నం

పెరిగిన ధరల ప్రకారం ప్రభుత్వం వెంటనే విద్యార్థుల మెస్‌చార్జీలు, స్కాలర్‌షిపులు పెంచాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల స్కాలర్‌షిపు, మెస్ చార్జీలు పెంచాలని విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించాలని కోరుతూ బీసీ విద్యార్థి సంఘం నాయకులు వేముల రామకృష్ణ నాయకత్వంలో వందలాది మంది విద్యార్థులు మాసబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పెరిగిన ధరల ప్రకారం విద్యార్థుల మెస్‌చార్జీలు, స్కాలర్‌షిపులు పెంచాలని, విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.4000 కోట్లు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని, పై చదువులకు దూరం అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల మెస్ చార్జీలు, స్కాలర్‌షిపులు పెంచాలని, వారికి పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వాలని, కొత్త కాలేజీ హాస్టల్‌లు ప్రారంభించాలని, వాటికి నూతన భవనాలు నిర్మించాలని, ప్రయివేటు కళాశాలలో రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటం తప్పదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నీలా వెంకటేష్ , గుజ్జ కృష్ణ, నందగోపాల్, అనంతయ్య, రాజేందర్, సతీష్,, బాలయ్య ఉదయ్, మహేష్, శివ ,రవి తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి హాకా దీపావళి టపాకాయల విక్రయం

- హాకా (ది హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్)



నవతెలంగాణ-హిమాయత్ నగర్

గత 43 సంవత్సరాలుగా జంట నగరాల వినియోగదారులకు విశేషమైన సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ హాకా (ది హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్) ఈ ఏడాది దీపావళి పండుగను పురస్కరించుకుని హాకా టపాకాయల ద్వారా సేవలు అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శివకాశి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన స్టాండర్డ్ బ్రాండ్ నాణ్యమైన టపాకాయలను ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రతి ఏడాది వలే ఇందిరాపార్కు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో 10 స్టాల్స్ ఏర్పాటు చేసి, అనుభవజ్ఞులైన సిబ్బందితో అన్ని రకాల దీపావళి టపాకాయలను విక్రయిస్తున్నామని హాకా ఎండీ కె.చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు సేవే లక్ష్యంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా తక్కువ ధరలకు అందిస్తామన్నారు. పార్కింగ్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తున్నామని, అగ్నిమాపక కేంద్రం, పోలీసుల నియమ నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా మని ఆయన వివరించారు. ఈ ఏడాది హాకా దీపావళి టపాకాయలను విక్రయించి వినియోగదారులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ఉందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు, నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'జి.విజయలక్ష్మికి మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు ప్రదానం'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి మహిళా కళాశాల కెమిస్ట్రీ డిపార్టుమెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, ప్రముఖ విద్యావేత్త జి.విజయలక్ష్మికి 'మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు- 2024'ను తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మెన్, ఎమ్మెల్సీ, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బండా ప్రకాష్‌తో పాటు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, తెలంగాణ బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్, తెలంగాణ శాసన మండలి సభ్యులు, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా, సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా సీనియర్ న్యాయవాది డి.ఎల్.పాండు, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ కలిసి ఆమెకు అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా, పూలమాలలు, జ్ఞాపకతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్మెంట్, లెక్చరర్స్, సిబ్బంది, ప్రొఫెసర్ జి.సుదర్శన్ రెడ్డి, కళాశాల సెక్రెటరీ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతాదేవి, ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, డాక్టర్ జీవన జ్యోతి జి.విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే బోర్డులో రిటైర్మెంట్ ఉద్యోగులను నియమించడం సిగ్గుచేటు

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్
- డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఫలకనుమా రైల్వే స్టేషన్ ముందు నిరసన..



నవతెలంగాణ-ధూల్‌పేట్

రైల్వే బోర్డులో ఖాళీ పోస్టులను రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు కాంట్రాక్టు పద్ధతిలో నియమించడం సిగ్గుచేటని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అన్నారు. ఓ పక్క నిరుద్యోగులు రోడ్డున పడుతుంటే, ఉన్న వాటిని ఉద్యోగులకు అప్పగించడం సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైల్వే బోర్డు నియమాన్ని ఖండిస్తూ ఫలకనుమ రైల్వే స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... రిటైర్డ్ ఉద్యోగులకు రైల్వే బోర్డు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వడం దారుణమన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగం కల్పిస్తామని ప్రకటనలకే పరిమితమైందన్నారు. యువతపై సవతి ప్రేమ చూపిస్తూ మోసం చేస్తుందన్నారు. రైల్వేలలో సిబ్బంది కొరత పెద్ద సమస్యగా మారడంతో ఈ నిర్ణయం తీసుకుందనీ చెబుతున్న బోర్డ్ అదే స్థానంలో నిరుద్యోగులకు అవకాశం కల్పిస్తే బాగుంటుందన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ జోన్లలో 25 వేల ఖాళీల భర్తీకి రిక్రూట్మెంట్ డ్రైవ్ ప్రారంభించిన రైల్వే కొత్త యువతకు ఇస్తే ప్రోత్సహం కల్పించిన వారవుతారన్నారు. 65 ఏండ్ల లోపు వయసు గల రైల్వే రిటైర్డ్ ఉద్యోగులను సూపర్వైజర్లు, ట్రాక్మెన్లుగా తాత్కాలికంగా విధుల్లోకి తీసుకోనుందన్నారు. తమ సర్వీసులో చివరిసారి తీసుకున్న జీతం ఇవ్వడంతో పాటు ట్రావెల్ అలవెన్సు, అధికారిక టూర్లు వంటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. నిరుద్యోగ యువతకు అవకాశం ఇవ్వడంతో ఉద్యోగ బాధ్యత, అనుభవం పంచుకుంటారని, మరిన్ని సేవలు రైల్వేకు అందిస్తారన్నారు. నిరుద్యోగులకు భర్తీ చేయకుండా ఉద్యోగులకు కాంట్రాక్ట్ ఉద్యోగం కట్టబెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్డ్ రైల్వే ఉద్యోగుల కాంట్రాక్ట్ ఉద్యోగాలు, నిరుద్యోగులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్, స్థానిక నాయకులు శ్రీను, మహేష్, భరత్, మురారి, గోపాల్, భరత్, సురేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'చట్ట సభల్లో రిజర్వేషన్లతోనే బీసీలకు సామాజిక న్యాయం'

- 28న బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'జనగణనలో బీసీ కులగణన' రాష్ట్ర సదస్సు
- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు ఎన్.బాలమల్లేష్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీసీలకు జనాభా దమాషా ప్రకారం విద్యా, ఉద్యోగాల్లోనే కాకుండా చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించడం ద్వారానే బీసీలకు కొంతైనా సామాజిక న్యాయం దక్కుతుందని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28న హైదరాబాద్, బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో 'జనగణనలో బీసీ కులగణన' పేరుతో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు అయన తెలిపారు. శుక్రవారం హిమాయత్ నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 77 సం వత్సరాల స్వాతంత్ర్య పాలనలో బీసీలు అన్ని రంగాలలో వెనుకబడి పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో బీసీలను వెనుకబడిన కులాలుగా కాకుండా వెనుకబడిన తరగతులుగా గుర్తించి బీసీలకు సామాజిక న్యాయం అందించడంలో సంక్లిష్ట పరిస్థితులు సృష్టించిందన్నారు. బీసీలు సామాజిక, విద్యా, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరంగా తీవ్రంగా నష్టపోయారని, పాలకులు అందినట్లు చెబుతున్న అరకొర సామాజిక న్యాయం సైతం అందడంలోను తరాల కాలం గడిచిపోయిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు లేకపోవడం, బీసీల బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయకపోవడం అలాగే ప్రమోషన్లలో నిబంధనలు లేకపోవడం, మండల్ కమీషన్ నివేదిక పూర్తిగా అమలు చేయకపోవడం వల్ల బీసీల దుస్థితికి కారణమని విమర్శించారు. బీసీల సమస్యలపై రాష్ట్ర సదస్సులో చర్చించి కార్యచరణ ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 28న బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో 'జనగణనలో బీసీ కులగణన' అనే అంశంపై నిర్వహించే సెమినార్ లో ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, మాజీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.ఈ సెమినార్ కు బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వరరావు, మేడ్చల్-మల్కాజ్ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి ఆర్. కృష్ణమూర్తి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు కె.ప్రమీల, ప్రధాన కార్యదర్శి కాసోజు మహాలక్ష్మి, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.కృష్ణ పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయానికి అనుమతులు తప్పనిసరి



నవతెలంగాణ-అంబర్‌పేట

నిబంధనలకు అనుగుణంగా బాణాసంచా యజమానులు వ్యాపారాలు చేసుకోవాలని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని కాచిగూడ డివిజన్ ఏసీపీ వి.రఘు హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడ స్టేషన్‌లో విలేకరులతో ఏసీపీ మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని కాచిగూడ, అంబంపేట పోలీస్ స్టేషన్ల పరిధిలోని బాణాసంచా షాపుల యజమానులు ఫైర్ సేఫ్టీ అనుమతులు, నియమ, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. బాణాసంచా దుకాణం వద్ద కువలం రేకుల షెడ్డును మాత్రమే ఏర్పాటు చేసుకోని, సీఓ2,డ్రై కెమికల్ పౌడర్, అగ్రిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఇసుక బకెట్లు, డ్రమ్ముల్లో నీరు ఉండాలి. బాణాసంచా విక్రయానికి పోలీసులు, అగ్రిమాపక, విద్యుత్ శాఖల అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. బాణాసంచా షాపు నిబంధనలు పాటించని యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

'అర్ధ సంవత్సర ఆర్థిక ఫలితాలు ప్రకటించిన బ్యాంక్ ఆఫ్ బరోడా'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశంలో అతి పెద్దదైన బ్యాంక్ ఆఫ్ బరోడా 30 సెప్టెంబర్-24 అర్థ సంవత్సరానికి గాను మెరుగైన ఆర్థిక ఫలితాలను సాధించిందని బ్యాంక్ చీఫ్ ఫైనాన్సర్ ఆఫీసర్ మనోజ్ చయాని తెలిపారు.ఈ మేరకు శుక్రవారం హిమాయత్ నగర్ బ్రాంచీలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ క్వార్టర్ ఫలితాల్లో 23.2 శాతం నికర లాభం సాధించి, రూ.1,162 కోట్లకు చేరిందని తెలిపారు.నికర వడ్డీ ఆదాయం 3.10 శాతం పెరిగిందని వివరించారు. నిర్వహణ ఆదాయం 12 శాతం పెరిగి రూ.16,800 కోట్లకు చేరుకోగా నిర్వహణ లాభం 18.2 శాతం పెరిగి రూ.947 కోట్లకు చేరుకుందని తెలిపారు.బ్యాంక్ ఆర్థిక వృద్ధిని సాధించడం ఆనందకరం అన్నారు.భారత దేశంలో 8,343 బ్రాంచ్ లతో 10,360 ఏటీఎం సెంటర్లతో బ్యాంక్ ఆఫ్ బరోడా విరాజిల్లుతుందన్నారు.17 విదేశాల్లో 84 బ్రాంచ్ లు కలిగి ఉందన్నారు.

ఇగోలకు పోతే...

సమాజంలో భార్యా భర్తల బంధానికి ప్రత్యేక స్థానం ఉంది. ఇద్దరి మధ్య ప్రేమానురాగాలు ఎంత సహజమో, అప్పుడుప్పుడు చిన్నచిన్న గొడవలు కూడా అంతే సహజం. ఈ గొడవలు కూడా ఇద్దరి మధ్య బంధాన్ని మరింత పెంచడానికి ఉపయోగపడతాయి. అయితే ఒకరిపై ఒకరికి కోపం వస్తే దాన్ని అప్పుడే బయటకు చెప్పాలి. లేకపోతే అవే తర్వాత కాలంలో మనస్పర్థలకు కారణమవుతాయి. ముఖ్యంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చినప్పుడు, గొడవలు జరిగినప్పుడు నేనే ఎందుకు మాట్లాడాలి, నేనే ఎందుకు క్షమాపణ చెప్పాలి. తనే ముందు చెప్పొచ్చు కదా! అనే ఇగోలకు పోకూడదు. అలా చేస్తే బంధంలో అగాధం ఏర్పడుతుంది. చివరకు విడాకుల వరకు వెళుతుంది. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...



అనుదీప్‌కు 30 ఏండ్లు ఉంటాయి. అతనికి సృజనతో పెండ్లి జరిగి ఆరేండ్లు అవుతుంది. ఒక బాబు ఉన్నాడు. వీరితో పాటు అత్తమామలు కూడా ఉంటారు. అనుదీప్, సృజన ఇద్దరూ ఉద్యోగస్తులు. బాబును అత్తమామలే చూసుకుంటారు. కానీ భార్యా భర్తల మధ్యనే ఎప్పుడూ ఏదో ఒక విషయంలో గొడవ జరుగుతుంది. చిన్న చిన్న విషయాలకే గొడవ పడుతుంటారు. ఈ విషయం చెప్పుకోవడానికి అనుదీప్ ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చాడు.

చిన్న విషయాలకే వారెందుకు ఇంతలా గొడవ పడుతున్నారు. సృజనకు అవే ఎందుకు పెద్ద సమస్యల్లా అనిపిస్తున్నాయో తెలుసుకునేందుకు మేము అనుదీప్‌తో మాట్లాడితే 'ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాం. కాబట్టి ఇద్దరం ఉదయాన్నే ఆఫీసుకు వెళ్లడం తప్పదు. అయితే నేను బాబును రెడీ చేయలేదని, సెలవు రోజుల్లో బయటకు తీసుకు వెళ్లలేదని, ఇంట్లో పనుల్లో సాయం చేయడం లేదని నాతో గొడవ పడుతుంది. ఆమే పెద్ద పెద్దగా అరుస్తుంది, తిడుతుంది. అయితే ఎప్పుడూ నేనే ఆమెకు సారీ చెబుతాను. ఈ మధ్య సృజన వాళ్ల బంధువుల ఇంట్లో పెండ్లికి వెళ్లాము. అక్కడ కూడా అందరి ముందు నాపై అరిచింది. దానికి కూడా నేనే సారీ చెప్పాను. కానీ ఆమె మాత్రం 'నీతో ఉండటం నాకు ఇష్టం లేదు, నువ్వు నన్ను అర్థం చేసుకోవడం లేదు. మనిద్దరం కలిసి ఉండటం ఇక అసాధ్యం. కాబట్టి విడిపోదాం' అంటుంది. ఎన్ని సార్లు చెప్పినా నా మాటలు పట్టించుకోవడం లేదు. నాకు కూడా ఇగో అనేది ఉంటుంది కదా! ఆమెకే అంత పట్టుదల ఉంటే నాకు ఇంకెంత వుండాలి. అని నేను కూడా విడిపోదాం అని చెప్పాను. ఆమె నాకు విడాకుల నోటీసు పంపించింది. ఇప్పుడు ఏమి చేయాలో అర్థం కావడం లేదు. ఆమె లేకుండా నేను నా జీవితాన్ని ఊహించుకోలేను. మా అమ్మ వాళ్లు చెప్పినా, వాళ్ళ అమ్మ వాళ్లు చెప్పినా తను వినడం లేదు. మీరే ఎలాగైనా మమ్మల్ని కలపండి' అంటూ చెప్పుకొచ్చాడు.

> **భార్యా భర్తలు ఒకరినొకరు గౌరవించుకోవడం నేర్చుకోవాలి. కొన్ని సర్దుబాట్లు చేసుకోవాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. నేను గొప్పంటే నేను గొప్ప అనే ఈగోలకు పోకుండా ఉంటే జీవితం హాయిగా ఉంటుంది. దీని కోసం ప్రతి జంట కనీసం రోజులో అరగంట అయినా ఒకరికోసం ఒకరు సమయం కేటాయించుకోవాలి.**

మేము సృజనకు ఫోన్ చేసి పిలిపించాము. అనుదీప్ చెప్పిన విషయం గురించి అడిగితే 'భార్యంటే గౌరవం లేని వ్యక్తితో ఎలా బతకాలి. ప్రతి విషయంలో అతనే గొప్ప అనుకుంటాడు. ప్రతి సారి నన్ను తక్కువ చేసి చులకన చేస్తాడు. ఇంటి పనుల్లో అస్సలు సహాయం చెయ్యడు. బాబును రెడీ చేయమన్నా చేయడు. ఇంట్లో ఓ పనిమనిషిని పెట్టుకుందామన్నా వినడు.

అత్తయ్యా, మామయ్య పనులు కూడా నేనే చూసుకోవాలి. ఇంటి పనుల్లో సాయం చేయమని మా అత్తయ్య చెప్పినా ఆయన మాట వినడు. అందుకే ఆమె సాయం చేయడానికి వస్తుంది. ఆమెకు ఆరోగ్యం బాగోదు. అలాంటి ఆమెతో నేను పనులు ఎలా చేయించాలి? అందుకే వద్దని పనులన్నీ నేనే చేసుకుంటాను. నేను ఉదయం 9 గంటలకు వెళితే 7 గంటలకు వస్తాను. బాబును అత్తయ్యా మామయ్యనే చూసుకుంటారు.

కనీసం సెలవు రోజుల్లో బయటకు తీసుకెళ్లమంటే వినడు. మమ్మల్ని తీసుకెళ్లడానికి ఆయన దగ్గర టైం, డబ్బులు ఉండవు కాని స్నేహితులతో మాత్రం వెళతాడు. కనీసం ఏడాదికి ఒక్కసారైనా అందరం కలిసి బయటకు వెళదామన్నా ఒప్పుకోడు. ఆరేండ్లలో ఒక్కసారి మాత్రమే మా పిన్ని కొడుకు పెండ్లికి అందరం కలిసి వెళ్లాము. అక్కడ కూడా అందరి ముందు నన్ను చులకన చేసి మాట్లాడాడు. తాగి నాపై చేయి చేసుకున్నాడు. అయినా నేను ఆయన్ని ఏమీ అనలేదు. మా పిన్నికి ఆడపిల్లలు లేరు. అందుకే నన్నే తన కూతురిగా అనుకుంటుంది. పెండ్లిలో బియ్యం మమ్మల్ని పోయించుకోమని డబ్బులు కూడా ఇచ్చి వెళ్లింది. ఆయనకు ఇష్టం లేకపోతే రాకుండా ఉండొచ్చు కదా. అక్కడకు వచ్చి బియ్యం పొయ్యడానికి కూడా మీకు ఎవరూ లేరంటూ అవమానంగా మాట్లాడాడు. అప్పుడు నేను అలాంటి మాటలు ఎందుకు మాట్లాడతావు అని కోప్పడ్డాను. దాంతో నన్ను కొట్టి ఇక్కడికి వచ్చి ఏమీ చేయలేదని అమాయకంగా మాట్లాడుతున్నాడు. పైగా ఎన్ని సార్లు సారీ చెప్పినా నేను పట్టించుకోవడం లేదని అందరి దగ్గర చెప్పుకుంటున్నాడు.

బంధువుల ముందు మా కుటుంబ పరువు పోయింది. ఇలాంటి వ్యక్తితో నేను ఎలా ఉండాలి. నాకు ఈయనతో బతకడం చాలా కష్టంగా ఉంది. అందరి ముందు ఆయనే విడాకులు ఇస్తానన్నాడు. మా అత్తయ్య మామయ్య అలా ఎందుకు మాట్లాడతావు అంటే 'నా కన్నా మీకు ఆమే ఎక్కువైతే ఆమెతోనే వెళ్లండి' అన్నాడు. నాకూ ఆత్మాభిమానం ఉంటుంది కదా! ఇలాంటి వ్యక్తితో నేను ఎలా ఉండాలో మీరే చెప్పండి' అంటూ బాధపడింది.

సృజన చెప్పింది విన్న తర్వాత అనుదీప్‌ను కూర్చోబెట్టి 'ముందు మీరిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి కొంత సమయం కేటాయించుకోండి. కనీసం 30 నిమిషాలైనా కలిసి మాట్లాడుకోండి. అలాగే ఇంటి పనులు ఇద్దరూ పంచుకోండి. లేదంటే ఓ పనిమనిషిని పెట్టుకోండి. అన్నింటికంటే ముందు ఆమెను గౌరవించడం నేర్చుకోండి. తమ్ముడి పెండ్లిలో ఆమెను, ఆమె బంధువులను అగౌరవంగా మాట్లాడితే ఆమెకు కోపం రాదా! నీ పద్ధతి సరైనది కాదు. భార్యాభర్తలు కలకాలం కలిసి ఉండాలంటే ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఉండాలి. ఒకరినొకరు గౌరవించుకోవాలి. మీరు మీ భార్యతో నిజంగా కలిసి ఉండాలంటే ఆమెను గౌరవించండి' అని చెప్పాము.

సృజనతో 'మీకు మంచి అత్తమామలు దొరికారు. భర్తను మార్చుకోవడానికి ప్రయత్నించండి. మళ్లీ ఏదైనా సమస్య వస్తే మా దగ్గరకు రండి' అని చెప్పి పంపించాము. ప్రస్తుతం ఇద్దరూ సంతోషంగా ఉంటున్నారు. సృజన రెండు వారాలకు ఓసారి ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చి మాట్లాడి వెళుతుంది. ప్రస్తుతం తను గర్భవతిగా ఉంది.

భార్యాభర్తలు ఒకరినొకరు గౌరవించుకోవడం నేర్చుకోవాలి. కొన్ని సర్దుబాట్లు చేసుకోవాలి. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. నేను గొప్పంటే నేను గొప్ప అనే ఇగోలకు పోకుండా ఉంటే జీవితం హాయిగా ఉంటుంది. దీని కోసం ప్రతి జంట కనీసం రోజులో అరగంట అయినా ఒకరికోసం ఒకరు సమయం కేటాయించుకోవాలి. ఫోన్ చూడటం మానేసి ఒకరి భావాలు మరొకరు పంచుకోవాలి. అప్పుడు ఎలాంటి సమస్యలూ భార్యాభర్తలను విడదీయలేవు.

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

- వై వరలక్ష్మి, 9948794051

నోటి దుర్వాసనా..?

రోజువారీ జీవితంలో మనకు తెలియకుండానే మనలో కనిపించే ప్రధానమైన సమస్య నోటి దుర్వాసన. మనం గుర్తించలేకపోయినా అవతలివ్యక్తులు ఇబ్బంది పడుతుంటారు. దీనికి ప్రధాన కారణం పళ్లు, నాలుకలో పేరుకున్న వ్యర్థాలే. మార్కెట్‌లో లభించే టూత్ పేస్టుల కంటే హోమ్‌మేడ్ టూత్ పేస్టులే అద్భుతంగా పనిచేస్తాయి.

చాలామంది బాహ్య శుభ్రతకు అంటే స్నానం చేసి బయటకు అందంగా, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. అయితే నోటి శుభ్రతకు పెద్దగా



ప్రాధాన్యం ఇవ్వరు. బ్రష్ చేస్తే సరిపోతుందనుకుంటారు. కానీ బ్రష్ చేయడం వల్ల నోరు శుభ్రం కానేకాదు. నోటి దుర్వాసన నుంచి ఉపశమనం పొందేందుకు మౌత్ వాష్ మంచి పరిష్కారం. దీనికోసం మార్కెట్‌లో లభించే వివిధ రకాల మౌత్ వాష్‌లు అవసరం లేదు. ఇంట్లోనే వంటింటి చిట్కాలతో మౌత్ వాష్ తయారు చేసుకోవచ్చు. అది ఎలా తయారు చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం..

మౌత్ వాష్ తయారీ ఇలా

ఒక కప్పు అలోవెరా జ్యూస్, నీరు, 2-3 లవంగాలు అవసరమౌతాయి. ముందుగా నీళ్లలో అల్లోవెరా జ్యూస్ కలిపి కాసేపు అలానే ఉంచాలి. దాదాపు 20 నుంచి 25 నిమిషాల తరువాత ఈ మిశ్రమాన్ని ఓ గిన్నెలో తీసుకుని అందులో 2-3 లవంగాలు వేయాలి. అంతే మీ మౌత్ వాష్ తయారైనట్టే. ప్రతిరోజూ బ్రష్ చేసిన తరువాత ఈ హెూమ్‌మేడ్ మౌత్ వాష్ వాడితే మంచి ఫలితాలుంటాయి.

మౌత్ వాష్‌తో లాభాలు

మౌత్ వాష్ చేయడం వల్ల పళ్లలో దుర్వాసన పోవడమే కాకుండా నాలుకపై ఉన్న వ్యర్థం కూడా తొలగిపోతుంది. హెూమ్‌మేడ్ మౌత్ వాష్‌లో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, కోలిన్ బి1, కోలిన్ బి2 లు పుష్కలంగా ఉంటాయి. ఇవి పళ్ల దుర్వాసనను పోగొడతాయి. మీ నోరు దుర్వాసన లేకుండా ఉండాలంటే రోజూ క్రమం తప్పకుండా మౌత్ వాష్ తప్పనిసరి.

వికలాంగుల హక్కులకు కేంద్ర సర్కార్ తూట్లు

(మొదటి పేజీ తరువాయి)

మహాసభలు శుక్రవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అధ్యక్షతన ప్రారంభమ య్యాయి. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ మహాసభల్లో రాష్ట్రంలో వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, భవిష్యత్ కార్యచరణపై చర్చించి పలు తీర్మానాలు చేయనున్నారు. ఈ సందర్భంగా మురళీధరన్ మాట్లాడుతూ 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని నీరుగార్చే చర్యలకు బీజేపీ సర్కార్ పాల్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నెల రోజులున్న సర్టిఫికెట్ల జారీ గడువును మూడు నెలలకు పెంచడంతో పాటు యూఐడీ పోర్టల్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని నిబంధనలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. శారీరక, మానసిక అంగవైకల్యం ఉన్న వారు ఎంతమంది యూఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటారో ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు. వారికి విద్య, ఉద్యోగ తదితర రంగాల్లో సౌకర్యాలు పెంచాల్సింది పోయి నిబంధనలను ప్రభుత్వం మరింత కఠినతరం చేస్తున్నదని ఆరోపించారు. పదేండ్లుగా వికలాంగులకు కేటాయిస్తున్న బడ్జెట్‌ను పెంచకుండా రోజురోజుకూ తగ్గిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో వికలాంగులు భూమికి బరువని హిట్లర్ గ్యాస్ బంకర్లో బంధించి ప్రయోగం చేశారనీ, బీజేపీ ప్రభుత్వం నాజీల వారసత్వాన్ని అందిపుచ్చుకుని వారి పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నదని విమర్శించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అల్లర్లలో అనేక మంది చేతులు, కాళ్లు పోగొట్టుకుని అంగ వైకల్యం పొందారని గుర్తు చేశారు. దేవుని స్వరూపాలైన వికలాంగులను దివ్యాంగులుగా పిలవాలని చెప్పిన మోడీ, వారి సమస్యలను పట్టించు కోకుండా దేవునికే వదిలేశారని ఎద్దేవా చేశారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాల వల్ల దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని హెచ్చరించారు. ప్రభుత్వం వికలాంగులకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఎదిగితేనే వారు తమ హక్కులను కాపాడుకోగలరని వ్యాఖ్యానించారు. వికలాంగుల యూనివర్సల్ పింఛన్ స్కీం కోసం ఫిబ్రవరి 10న ఢిల్లీలో భారీ సభ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికల ముందు వికలాంగులకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మెన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ గత సర్కార్ పదేండ్ల పాలనలో వికలాంగుల శాఖను విధ్వంసం చేసిందని విమర్శించారు. ట్రైసైకిళ్ల నుంచి మొదలుకుని వీల్‌చైర్ల వరకు అన్నింటా అక్రమాలకు పాల్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పదేండ్ల పాపాలను కడుగుతూ కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేస్తున్నా మని చెప్పారు. 75 నుంచి 90 శాతం అంగ వైకల్యం ఉంటేనే పరికరాలు అందించాలనే నిబంధనను 40 శాతానికి కుదిస్తూ మేనేజ్ కమిటీలో తీర్మానం చేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 15 నియోజకవర్గాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి వికలాంగుల సమస్యల పై అధ్యయనం చేయనున్నట్టు తెలిపారు. సర్టిఫికెట్లు, పింఛన్లు తదితర సమస్యలపై హైదరాబాద్‌లోని వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. వికలాంగులు తమ హక్కుల కోసం పార్టీలు, సంఘాలు పక్కన పెట్టి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఐద్వా ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి మాట్లాడుతూ రవాణా, పబ్లిక్ స్థలాల్లో వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల చట్టం అమలుకు ఇప్పటికీ కొన్ని రాష్ట్రాలు విధివిధానాలు రూపొందించలేదనీ, మరి కొన్ని రాష్ట్రాలు నిధులు విడుదల చేయలేదని ఇటీవల సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. వికలాంగుల కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నంభు రాజన్, హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మెన్ ఉమర్‌ఖాన్, టిఎఎస్ఎల్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు నాగేందర్, ఇమద్ ఖాన్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఎన్‌పిడివో శ్రీనివాస్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీధర్ కుమార్, ఎన్‌పీఆర్‌డీ రాష్ట అధ్యక్షులు కె.వెంకట్, కార్యదర్శి ఎం.అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేష్, కేంద్ర కమిటీ సభ్యులు సాయమ్మ, రాజులతో పాటు 33కు చెందిన నాయకులు, కార్యకర్తలు, వికలాంగులు పాల్గొన్నారు

మూసీ పక్కన పేదల ఇండ్లల్లో ఉంటాం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్ మేరకు మూసీ పక్కనున్న పేదల ఇండ్లల్లో ఉండేందుకు తాము సిద్ధమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. తాము మూసీ నది ప్రక్షాళనకు వ్యతిరేకం కాదనీ, పేదల ఇండ్లను కూల్చడానికి మాత్రమే వ్యతిరేకమని మరోమారు స్పష్టం చేశారు. తాము వెంట వస్తామని పోలీసుల అండతోనైనా రేవంత్‌రెడ్డి బస్తీల్లో తిరిగి పేదల బాధలు వినాలని కోరారు. ఇండ్లను కూల్చివేయడాన్ని ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మూసీ బాధితులకు తమ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇందిపార్కు వద్ద గల ధర్నాచౌక్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నానుద్దేశించి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..మూసీకి రెండువైపులా రిటైనింగ్ వాల్‌ను కట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. చాలా ఇండ్లకు జీహెచ్ఎంసీ అన్ని అనుమతులిచ్చిందనీ, ఆస్తిపన్ను కడుతున్న వాటిని ఇప్పుడు అక్రమ కట్టడాలంటే ఎలా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వందలాది హిందూ దేవాలయాలను కూల్చే దమ్ముందా అని సవాల్ విసిరారు. మూసీలో ఉన్న అంతర్జాతీయ స్థాయి బస్టాండ్‌ను, మెట్రోస్టేషన్‌ను కూలగొడతారా? బడాబాబుల ఇండ్లను కూల్చే ధైర్యముందా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో డ్రయినేజీ వ్యవస్థకు మార్గం చూపెట్టకుండా మూసీ ప్రక్షాళన ఎలా సాధ్యమని నిలదీశారు. తామైతే పేదలకు కనీస సౌకర్యాలు కల్పించి ఆ తర్వాత మూసీ అభివృద్ధి గురించి ఆలోచిస్తామన్నారు. ఆర్థిక వనరుల మీదనే స్పష్టత లేదుగానీ ఎందుకింత దూకుడని నిలదీశారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు కాంగ్రెస్ అధినేత అల్లుడి కోసం చేపట్టారనీ, ఇది ప్రపంచంలోనే అత్యంత విలువైన, అతి పెద్ద స్కామ్ అని ఆరోపించారు.లక్షన్నర కోట్ల రూపాయలు ఎక్కడ నుంచి తెస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సియోల్ నుంచి మంత్రుల బృందం వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టు విలువ ఎంతకు పెరుగుతుందో అని ఆందోళన వ్యక్తం చేశారు. మూసీ నది విషపూరితం కావడానికి కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని చెప్పారు. కేసీఆర్ తన పొట్ట నింపుకోవడానికి కాళేశ్వరం ప్రాజెక్టును వాడుకున్నారనీ, కాంగ్రెస్ నేతలు మూసీ సుందరీకరణ పల్లవి ఎత్తుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌లో ప్రతి మంత్రి కూడా ఒక సీఎంనేనని దెప్పిపొడిచారు.

ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ..హైడ్రాను ఆపిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పుడు మూసీ సుందరీకరణ డ్రామాను మొదలుపెట్టిందని విమర్శించారు. 40,50 ఏండ్ల కింద పేదలు పైసాపైసా కూడబెట్టుకుని స్థలాలు కొనుక్కుని ఇండ్లు కట్టుకున్నారనీ, ఇప్పుడు ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. పేదల గోడు వింటుంటే కండ్లలో నీళ్లు వస్తున్నాయన్నారు. మూసీ ప్రక్షాళన జరగాల్సిందే..నల్లగొండ జిల్లాలో పంటలు బాగా పండాల్సిందే..నీళ్లను శుద్ధి చేయాల్సిందే కానీ పేదల ఇండ్లు మాత్రం కూల్చొద్దని కోరారు. నల్లగొండ జిల్లా రైతులను రెచ్చగొట్టే కుట్రకు కాంగ్రెస్ సర్కారు పూనుకున్నదని ఆరోపించారు. వందేండ్ల లెక్కలు తీసీ ఒక్కసారైనా మునిగినట్టు ఇండ్లనే కూల్చాలని సూచించారు. రూ.10 వేల కోట్ల అప్పు కూడా తెచ్చే పరిస్థితి ఇప్పుడు ప్రభుత్వానికి లేదనీ, రూ.1.50 లక్షల కోట్లు ఎలా సాధ్యమని ప్రశ్నించారు.

బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ పరివాహక ప్రాంతాల్లో లంకెబిందెల కోసమే ప్రక్షాళన చేస్తున్నారా రేవంత్‌రెడ్డి? అని ప్రశ్నించారు. హామీలు అమలు చేయలేకనే హైడ్రా, మూసీ సుందరీకరణ పేరుతో డ్రామాలు అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా ఆ ప్రాజెక్టును వాడుకోవాలని చూస్తున్నదని ఆరోపించారు. దమ్ముంటే.. బుల్డోజర్లు మమ్మల్ని దాటుకుని పేదల ఇండ్లపైకి వెళ్లాలని సవాల్ విసిరారు. డీపీఆర్ అప్రూవల్ లేకుండా ప్రజల ఇండ్లపై ఆర్ బీ ఎక్స్ అంటూ రాస్తూ భయభ్రాంతులకు గురిచేయడం అన్యాయమన్నారు. ఈ ధర్నాలో ఎంపీ నగేశ్, బీజేపీ ఎమ్మెల్యేలు కె.వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, సూర్యనారాయణగుప్తా, హరీశ్‌బాబు, పైడి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, పాల్గొన్నారు.



ఒకే పోలీస్ విధానం కావాలి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్ నడిబొడ్డున గతంలో ఎన్నడూ చూడని దృశ్యం ఆవిష్కృతమైంది. అందుకు మహిళలు నాయకత్వం వహించడం ఇందులోని ప్రత్యేకత. అందునా యూనిఫారం ఉద్యోగుల కుటుంబాలకు చెందిన వారు కావడం మరో విశేషం. ఒకే పోలీస్ విధానం కావాలంటూ బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు రాష్ట్ర సచివాలయ ముట్టడికి పూనుకున్నారు. వందలాదిగా వచ్చిన కానిస్టేబుళ్ల భార్యలు, వారి పిల్లలు 'వియ్ వాంట్ జస్టిస్' అంటూ గళం విప్పారు. డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని సచివాలయానికి చేరుకుంటుండగా పోలీసులు నిలువరించారు. పదుల సంఖ్యలో కానిస్టేబుళ్ల భార్యలను, పిల్లలను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిని నాంపల్లి, సైఫాబాద్ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఆ తర్వాత ఇందిరాపార్క్ దగ్గరలోని ఎన్టీఆర్ స్టేడియం దగ్గర సాయంత్రం నాలుగు గంటల వరకు వారు ఆందోళన చేపట్టారు. సచివాలయం ముట్టడి ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. తెలుగు తల్లి ఫ్లైఓవర్ కింద నుంచి అమరవీరుల స్మారక కేంద్రం పక్క నుంచి కానిస్టేబుళ్ల భార్యలు సచివాలయం ముట్టడి కోసం పరిగెత్తుకుంటూ వచ్చారు. దీంతో ఆశ్చర్యపోవడం పోలీసుల వంతైంది. కాగా వచ్చిరాగానే వారందరిని పోలీసులు అరెస్ట్ చేయడం ప్రారంభించారు. దీంతో సచివాలయం ప్రధాన రహదారిలో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది. టీజీఎస్‌పీ హఠావో, ఏక్ పోలీస్ బనావో అంటూ ఆందోళనకు దిగిన కానిస్టేబుళ్ల భార్యల డిమాండ్‌కు తలొగ్గిన పోలీస్ శాఖ, యుద్ధప్రాతిపదికన పరిశీలించి పాత విధానాన్నే కొనసాగిస్తామని ప్రకటించడం గమనార్హం. ఒకే దగ్గర డ్యూటీ చేసేలా చర్యలు తీసుకోవాలనీ, ఇక్కడ అక్కడ అంటూ వేధిస్తున్నారని ఈసందర్భంగా వారు డిమాండ్ చేశారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రంలో ఉన్న విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో గత రెండు రోజులుగా వీరు ఆందోళన చేపడుతుండటం, శుక్రవారం విషయం తెలిసిందే.

ఎన్టీఆర్ స్టేడియం దగ్గర ఈ ఆందోళన చేపట్టారు. ముట్టడి నేపథ్యంలో సచివాలయ ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొంది. ఆందోళన చేస్తున్న వారిని అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. వచ్చింది మహిళలు, పిల్లలు కావడం , అందునా తమ పోలీసుల కుటుంబాలే కావడంతో ఇబ్బందులు తప్పలేదు. వారందరిని బందోబస్తులో ఉన్న పోలీసులు అక్కడి నుంచి తరలించారు. తమ భర్తలతో పోలీసు విధులు కాకుండా కూలి పనులు చేయిస్తున్నారని కుటుంబసభ్యులు ఆరోపించడం గమనార్హం. పోలీసు విధులకు, వాళ్లు చేస్తున్న పనికి సంబంధం లేదనీ, పండుగలకు కూడా ఇంటికి రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే సెలవులు రద్దుచేస్తూ గతంలో జారీ చేసిన ఆదేశాలను పోలీస్ శాఖ తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొంది. ఈ అంశంపై కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులతో చర్చించాలని నిర్ణయించింది.

పోలీసులకు లొంగిపోయిన మాజీమంత్రి సోదరుడు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్

ప్రభుత్వ భూమి ఆక్రమణ, తప్పుడు ధ్రువీకరణ పత్రాల కేసులో.. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సోదరుడు శ్రీకాంత్ గౌడ్ శుక్రవారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టియన్‌పల్లి శివారు 523 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమికి తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి ప్లాట్లుగా చేసి విక్రయాలు జరిపిన వ్యవహారంలో శ్రీకాంత్ ఏ4 ముద్దాయి. ఈ కేసులో నలుగురిపై మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు రెండు నెలల క్రితం కేసు నమోదు చేయగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఏ4 నిందితునిగా ఉన్న శ్రీకాంత్ గౌడ్ బెయిల్ కోసం హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ ఫలితం లేకపోవడంతో చేసేదేమీలేక పోలీసులకు లొంగిపోయినట్టు తెలుస్తోంది.

పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

రూ.7521 లభిస్తుందని ఆశించారు. కానీ సీసీఐ నిబంధన ప్రకారం పత్తి తేమశాతం 8నుండి 12శాతం మధ్యలో ఉంటేనే మద్దతు ధర లభిస్తుంది. కానీ మార్కెట్‌కు వస్తున్న పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో సీసీఐ కొనుగోళ్లకు నిరాకరించింది. దాంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. రైతుల ఆందోళనను సొమ్ముచేసు కుంటున్న వ్యాపారులు.. రూ.6వేల నుంచి 7వేల మధ్య కొనుగోలు చేస్తున్నారు. శుక్రవారం ధరలు మరింత తగ్గడంతో రైతులు మార్కెట్ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. రైతుల ఆందోళనకు తెలంగాణ రైతు సంఘం నాయకులు మద్దతు ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పత్తి పంటకు రూ.11వేలుగా మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా మార్కెట్‌కు వచ్చే మొత్తం పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలి : రైతులు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టగా.. మరికొందరు మార్కెట్‌కు వెళ్లి ఆందోళన చేపట్టారు. మరోపక్క జిల్లా కలెక్టర్ ఉదయం నుంచి రాత్రి వరకు మార్కెట్ కార్యాలయంలోనే ఉండి అధికారులు, వ్యాపారులతో చర్చలు జరిపారు. చివరకు రాత్రి సమయంలో జిల్లా కలెక్టర్ వ్యాపారులతో చర్చలు జరపగా.. తేమతో సంబంధం లేకుండా క్వింటాల్‌కు రూ.6700 చొప్పున కొనుగోలు చేసేందుకు అంగీకరించారు.

గ్రూప్-1 మెయిన్స్‌లో కాపీయింగ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయి. కాగా, శుక్రవారం జరిగిన ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్షలో ఒక మహిళా అభ్యర్థి చీర కొంగులో చిట్టీలు అతికించుకొచ్చి కాపీయింగ్ పాల్పడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. టీజీపీఎస్సీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు : టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు శుక్రవారం ప్రశాంతంగా జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. పేపర్-4 ఎకానమి, డెవలప్‌మెంట్ పరీక్ష విజయవంతంగా ముగిసిందని తెలిపింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 31,403 మంది అభ్యర్థులకుగాను 21,195 (67.4 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని వివరించారు. అయితే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఓ మహిళ (హాల్‌టికెట్ నెంబర్ 240921569) చీరకొంగులో చీటీలు తెచ్చినట్టు ఇన్విజిలేటర్ గుర్తించారని తెలిపారు. వెంటనే ఆ మహిళను పరీక్ష రాయనీయకుండా ప్రశ్నాపత్రం, జవాబు పత్రాన్ని తీసుకున్నామని పేర్కొన్నారు. టీజీపీఎస్సీ నిబంధనల ప్రకారం ఆమెపై మాల్‌ప్రాక్టీస్ కేసును నమోదు చేశామనీ, ఆమెపై చర్యలు తీసుకుంటామని వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో 46 పరీక్షా కేంద్రాల్లో ఈనెల 27వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. హైకోర్టు ఆదేశాలతో కలిపి 31,403 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు.

ఎదురు 'తిరిగింది'

పుణెలో టీమ్ ఇండియాకు స్పిన్ స్ట్రోక్ తగిలింది. ప్రత్యర్థిని బిగించిన స్పిన్ ఉచ్చులో తనే పడిపోయి విలవిల్లాడుతోంది. కివీస్ స్పిన్నర్ మిచెల్ శాంట్నర్ ఏడు వికెట్ల మాయజాలంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 156 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 103 పరుగుల భారీ ఆధిక్యం సొంతం చేసుకుంది.
బంతితో భారత్‌ను దెబ్బకొట్టిన కివీస్.. బ్యాట్‌తో ఎదురుదాడి చేస్తోంది. టామ్ లేథమ్ (86) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో కదం తొక్కటంతో న్యూజిలాండ్ ఆధిక్యం 301 పరుగులకు చేరుకుంది. వాషింగ్టన్ సుందర్ (4/56), అశ్విన్ (1/64) మ్యాజిక్ మొదలెట్టినా.. పుణె టెస్టులో న్యూజిలాండ్ పట్టు బిగించింది. భారత్ గడ్డపై చారిత్రక టెస్టు సిరీస్ విజయానికి మరింత చేరువైంది!.

- పుణెలో భారత్‌కు స్పిన్ స్ట్రోక్
- తొలి ఇన్నింగ్స్‌లో 156 ఆలౌట్
- పట్టు బిగించిన న్యూజిలాండ్
- భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టు రెండో రోజు

నవతెలంగాణ-పుణె

న్యూజిలాండ్ కోసం బిగించిన స్పిన్ ఉచ్చులో టీమ్ ఇండియా చిక్కుకుంది. పిచ్‌పై బంతి ఎదురు తిరగటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 156 పరుగులకే కుప్పకూలింది. కివీస్ స్పిన్నర్ మిచెల్ శాంట్నర్ (7/53) ఏడు వికెట్ల మాయజాలంతో విజృంభించగా.. సొంతగడ్డపై టీమ్ ఇండియాకు దిమ్మతిరిగింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (30, 60 బంతుల్లో 4 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (30, 72 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (38, 46 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా ఎవరూ అంచనాలను అందుకోలేదు. రోహిత్ శర్మ (0), కోహ్లి (1), సర్ఫరాజ్ ఖాన్ (11), రిషబ్ పంత్ (18), అశ్విన్ (4) తేలిపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో 45.3 ఓవర్లలో 156 పరుగులకే కుప్పకూలిన భారత్.. తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగుల ఆధిక్యం కోల్పోయింది. కివీస్ కెప్టెన్ టామ్ లేథమ్ (86, 133 బంతుల్లో 10 ఫోర్లు), టామ్ బ్లండెల్ (30 నాటౌట్, 70 బంతుల్లో 2 ఫోర్లు) రాణించటంతో ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 198/5తో కొనసాగుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ ఆధిక్యం 301 పరుగులు.

స్పిన్ మాయలో పడి..

యువ బ్యాటర్లు యశస్వి (30), గిల్ (30) రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. 49 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను పట్టాలెక్కించే ప్రయత్నం చేశారు. కానీ స్పిన్ మాంత్రికుడు మిచెల్ శాంట్నర్ మాయజాలం ప్రదర్శించాడు. దీంతో భారత బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కుప్పకూలింది. గిల్ ఎల్బీ కాగా.. కోహ్లి ఫుల్‌టాస్ బంతికి బౌల్డ్ అయ్యాడు. లోయర్ మిడిల్ ఆర్డర్‌లో జడేజా (38) ఒక్కడే ప్రతిఘటించాడు. కాస్త వేగంగా పరుగులు సాధించాడు. దీంతో భారత్ 156 పరుగులైనా చేయగలిగింది. పంత్ (18) కాసేపు నిలిచినా.. ఆశించిన ఇన్నింగ్స్ ఆడలేదు. సర్ఫరాజ్ ఖాన్ సైతం విఫలమయ్యాడు. అశ్విన్ (4) ఆదుకోలేకపోయాడు. వాషింగ్టన్ సుందర్ (18 నాటౌట్) అజేయంగా నిలిచాడు. 156 పరుగులకు భారత్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది.

టామ్ కెప్టెన్సీ ఇన్నింగ్స్

తొలి ఇన్నింగ్స్‌లో 103 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన న్యూజిలాండ్.. రెండో ఇన్నింగ్స్‌లో వేగంగా పరుగులు చేసింది. కెప్టెన్ టామ్ లేథమ్ (86) ముందుండి ఎదురుదాడి చేశాడు. భారత్ రెండు వైపులా స్పిన్ దాడి చేసినా లేథమ్ పరుగుల వేట సాగించాడు. పది బౌండరీలతో చెలరేగిన లేథమ్ అర్థ సెంచరీతో చెలరేగాడు. డెవాన్ కాన్వే (17), రచిన్ రవీంద్ర (9), డార్లీ (18) సహా లేథమ్ వికెట్లతో వాషింగ్టన్ సుందర్ మెరిసినా.. అప్పటికే న్యూజిలాండ్ కొండంత ఆధిక్యంలో నిలిచింది. టామ్ బ్లండెల్ (30 నాటౌట్) సైతం మెరవటంతో కివీస్ మరింత ఆధిక్యం దిశగా సాగుతోంది. నేడు మూడు రోజు ఆటలో కివీస్ కనీసం 50 పరుగులు చేసినా.. ఛేదనలో టీమ్ ఇండియాకు కష్టసాధ్యమైన లక్ష్యమే ఎదురు నిలువనుంది.



స్కోరు వివరాలు :

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : 259/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : జైస్వాల్ (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 30, రోహిత్ (బి) సౌథీ 0, గిల్ (ఎల్బీ) శాంట్నర్ 30, కోహ్లి (బి) శాంట్నర్ 1, పంత్ (బి) ఫిలిప్స్ 18, సర్ఫరాజ్ (సి) ఓరౌర్క్ (బి) శాంట్నర్ 11, జడేజా (ఎల్బీ) శాంట్నర్ 38, అశ్విన్ (ఎల్బీ) శాంట్నర్ 4, వాషింగ్టన్ నాటౌట్ 18, ఆకాశ్ దీప్ (బి) శాంట్నర్ 6, బుమ్రా (ఎల్బీ) శాంట్నర్ 0, ఎక్స్‌ట్రాలు : 0, మొత్తం (45.3 ఓవర్లలో ఆలౌట్) 156.

వికెట్ల పతనం : 1-1, 2-50, 3-56, 4-70, 5-83, 6-95, 7-103, 8-136, 9-142, 10-156.

బౌలింగ్ : సౌథీ 6-1-18-1, ఓరౌర్క్ 3-2-5-0, అజాజ్ 11-1-54-0, శాంట్నర్ 19.3-1-53-7, ఫిలిప్స్ 6-0-26-2.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ : లేథమ్ (ఎల్బీ) వాషింగ్టన్ 86, కాన్వే (ఎల్బీ) వాషింగ్టన్ 17, యంగ్ (ఎల్బీ) అశ్విన్ 23, రచిన్ (ఎల్బీ) వాషింగ్టన్ 9, డార్లీ (సి) జైస్వాల్ (బి) వాషింగ్టన్ 18, బ్లండెల్ నాటౌట్ 30, ఫిలిప్స్ నాటౌట్ 9, ఎక్స్‌ట్రాలు : 6, మొత్తం : (53 ఓవర్లలో 5 వికెట్లకు) 198.

వికెట్ల పతనం : 1-36, 2-78, 3-89, 4-123, 5-183.

బౌలింగ్ : అశ్విన్ 17-1-64-1, వాషింగ్టన్ 19-0-56-4, జడేజా 11-1-50-0, బుమ్రా 6-1-25-0.



వార్నర్ కెప్టెన్సీకి లైన్ క్లియర్

జీవితకాల నిషేధం ఎత్తివేసిన సీఏ

మెల్‌బోర్న్ : ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు డెవిడ్ వార్నర్ బిగ్‌బాష్ లీగ్ (బీబీఎల్)లో సిడ్నీ థండర్స్ జట్టుకు సారథ్యం వహించేందుకు మార్గం సుగమం అయ్యింది. 2018 బాల్ టాంపరింగ్ వివాదంలో డెవిడ్ వార్నర్‌పై జీవితకాల నాయకత్వ బాధ్యతల నిషేధం విధిస్తూ క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం తీసుకుంది. తాజాగా, సీఏ క్రమశిక్షణ కమిటీ ఆ నిర్ణయాన్ని సమీక్షించి ఎత్తివేసింది. స్వతంత్ర విచారణ కమిటీ ముందు పాట్ కమిన్స్, కేన్ విలియమ్సన్ సహా ఆసీస్ సహాయక సిబ్బంది, ఆటగాళ్లు వాంగ్మూలం ఇచ్చారు. డెవిడ్ వార్నర్ నాయకత్వంతో దేశవాళీ క్రికెట్‌లో యువ క్రికెటర్లకు మార్గ నిర్దేశనంగా ఉండనుందని, ఆసీస్ క్రికెట్‌కు వార్నర్ చేసిన సేవలను సైతం పరిగణనలోకి ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఏ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. బాల్ టాంపరింగ్ వివాదంతో ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్సీని సైతం వార్నర్ కోల్పోవాల్సి వచ్చిన సంగతి తెలిసిందే.

ఇకనైనా పుంజుకుంటారా?

పుదుచ్చేరితో హైదరాబాద్ రంజీ పోరు

హైదరాబాద్ : ఎన్నో అంచనాలతో రంజీ ట్రోఫీ ఎలైట్ సమరానికి సిద్ధమైన హైదరాబాద్.. తొలి రెండు మ్యాచుల్లో దారుణంగా నిరాశపరిచింది. గుజరాత్, ఉత్తరాఖండ్ చేతిలో పరాజయంతో గ్రూప్-బి పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. నేడు రంజీ ట్రోఫీ మూడో రౌండ్లో భాగంగా ఉప్పల్ స్టేడియం వేదికగా పుదుచ్చేరితో హైదరాబాద్ తలపడనుంది. పుదుచ్చేరి రెండింట ఓ విజయం సాధించి ఉత్సాహంగా కనిపిస్తుంది. హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ అందుబాటులో లేకపోవటం వైఫల్యానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. కానీ రాహుల్ సింగ్, తన్మయ్ అగర్వాల్, రోహిత్ రాయుడులు అంచనాలను అందుకోవటం లేదు. హ్యాట్రిక్ పరాజయం ముంగిట నిలిచిన హైదరాబాద్ నేడు సొంతగడ్డపై పుంజుకుంటుందా? చూడాలి.



ఫోటో జర్నలిస్టుగా 30 ఏండ్లు

ప్రజాశక్తి, నవతెలంగాణలో విధులు

కె.నరహరి సేవలను కొనియాడిన ఎడిటర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నవతెలంగాణ సీనియర్ ఫోటో జర్నలిస్టు కె.ఎన్.హరి ప్రజాశక్తి, నవతెలంగాణ దినపత్రికల్లో 30 ఏండ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సంస్థ కార్యాలయంలో సిబ్బంది కేక్ కట్ చేసి సంతోషాన్నిపంచుకుని, శుభాకాంక్షలు తెలిపారు. హరి అందించిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు. సంస్థ కష్టాల్లో ఉన్నప్పుడు సైతం ఆయన ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని తన వృత్తిధర్మాన్ని ఆయన కొనసాగిస్తున్నారని నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేశ్, బోర్డు సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో ఖాళీలను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేయొద్దు

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

రైల్‌నిలయం వద్ద డీవైఎఫ్ఐ నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేయాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సికింద్రాబాద్‌లో ఉన్న రైల్‌నిలయం వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ మాట్లాడుతూ రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేయాలనే రైల్వే బోర్డు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. దేశంలో నిరుద్యోగం రేటు ప్రమాదకరమైన స్థాయిలో ఉన్న తరుణంలో కేంద్ర ప్రభుత్వ చర్యలు యువతరం భవిష్యత్తు పట్ల తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. రైల్వేలో ప్రస్తుతం ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి నూతన నోటిఫికేషన్‌ను విడుదల చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కానీ కేంద్ర ప్రభుత్వం దీనికి బదులు ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో తాత్కాలికంగా నియామకాలు చేపట్టడం వల్ల నిరుద్యోగ యువతను విస్మరిస్తోందన్నారు. ఇప్పటికే రైల్వేలో లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయనీ, వాటిని భర్తీ చేయకపోవడంతో తరచుగా రైల్వే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగిత రేటు పెరుగుతున్నా కూడా కేంద్రప్రభుత్వం యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను మోసం చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాట మాడుతున్నదని అన్నారు. రైల్వేలో 25 వేల ఉద్యోగాలను ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందితో తాత్కాలిక నియమాకాలు చేపడతామంటూ ప్రకటించిన రైల్వే బోర్డు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం రైల్వేలో ఖాళీగా ఉన్న సుమారు మూడు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దామెర్ల హష్మీబాబు, ఎండీ జావేద్, నాయకులు అనిల్, అజయ్, సందెల రాజేష్, సాయి, జె రమేష్ పాల్గొన్నారు.

నవచిత్రం

కొత్త ప్రపంచాన్ని చూపించే క..



కిరణ్ అబ్బవరం, నయన్ సారిక

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ నయన్ సారిక, తన్వీ రామ్ కథానాయికలు. చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్నారు.
దర్శక ద్వయం సుజీత్, సందీప్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 31న దీపావళి పండుగ సందర్భంగా తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.
తాజాగా ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు.
నిర్మాత చింతా గోపాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, 'ట్రైలర్ మీకు నచ్చిందని నమ్ముతున్నాం. ట్రైలర్ ఎంత బాగుందో సినిమా అంతకంటే చాలా బాగుంటుంది' అని తెలిపారు.
దర్శకుడు సుజీత్ మాట్లాడుతూ,'సినిమా ట్రైలర్‌కి నాలుగు రెట్లు పవర్ ఫుల్‌గా ఉంటుంది. కిరణ్‌ని ఇప్పటిదాకా చూడని విధంగా సరికొత్తగా చూపించబోతున్నాం' అని అన్నారు. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ, 'చాలా కొత్త కంటెంట్‌తో సినిమా చేశాను. గతంలో నా సినిమాలు అన్ని విషయాల్లో బాగున్నా కంటెంట్ కొంచెం స్ట్రాంగ్‌గా ఉంటే బాగుండేది అనే కామెంట్స్ వచ్చాయి. అందుకే కంటెంట్ మీద శ్రద్ధ తీసుకుని ఈ సినిమా చేశాం. ఫస్ట్ సీన్ నుంచి లాస్ట్ సీన్ దాకా కొత్తగా ప్రయత్నించాం. స్క్రీన్ ప్లే యూనిక్‌గా ఉంటుంది. ఇందులో ఒక కొత్త ప్రపంచాన్ని చూస్తారు. సినిమా చూస్తున్నంత సేపూ హ్యాపీగా ఫీలవుతారు. దీపావళి సందర్భంగా వస్తున్న ఈ సినిమాని సకుటుంబంతో చూడండి' అని చెప్పారు.

ప్రేమ మితిమీరితే..?



ఆరాధ్య దేవి

రామ్ గోపాల్ వర్మ నిర్మించిన లేటెస్ట్ థ్రిల్లర్ 'శారీ'. ఆర్జీవీ డెన్ ద్వారా 'టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ' అనే ట్యాగ్‌లైన్‌తో పలు నిజజీవిత సంఘటనల మేళవింపుతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఇది తెరకెక్కింది. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో ఆర్‌జీవీ-ఆర్‌వి ప్రొడక్షన్స్ బ్యానర్లో బిజినెస్ మాన్ రవి వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు.
సత్య యాదు, ఆరాధ్య దేవి జంటగా నటించారు. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషల్లో డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో వెంకట సాయి ఫిలిమ్స్ ద్వారా తెలుగులో విడుదల చేయడానికి పంపిణీ దారుడు ముత్యాల రాందాస్ మంచి ఫ్యాన్సీ రేట్‌తో థియేట్రికల్ హక్కులు సొంతం చేసుకున్నారు.
ఈ సందర్భంగా రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ, 'ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా భయానకమైన రిలేషన్స్‌కి తెర తీస్తోంది. సోషల్ మీడియా అనేది జనానికి మేలు చేయకపోగా 'యాంటీ సోషల్ మీడియా'గా మారుతోంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా చాలామందిలో విచ్చల విడితనం పెరిగిపోతోంది. యువతులు వాటిలోని నిజాలను గ్రహించలేక ఆకర్షితులవు తున్నారు. మితిమీరిన ప్రేమ ఎంత భయంకరంగా మారొచ్చు అనేది ఈ చిత్రంలోని ప్రధాన అంశం. వయసులో ఉన్న అమ్మాయిలకు కనువిప్పు కలిగేలా ఈ సినిమా తెరకెక్కింది' అని అన్నారు. 'ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రక్రియతో రికార్డు చేసిన 'ఐ వాంట్ లవ్' అనే లిరికల్, ఫుల్ వీడియో సాంగ్ ఆర్జీవీ డెన్ మ్యూజిక్ ద్వారా విడుదల చేశాం. దీనికి మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలో మరో లిరికల్ సాంగ్ విడుదల చేస్తాం. డిసెంబర్ 20న ప్రపంచ వ్యాప్తంగా నాలుగు భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని నిర్మాత రవి వర్మ చెప్పారు.

డిసెంబర్‌లో కన్నప్ప



మోహన్‌బాబు, మంచు విష్ణు

మోహన్ బాబు, విష్ణు మంచు, దర్శకుడు ముఖేష్ కుమార్, నటుడు అర్పిత్ రంకాతో కలిసి కేదార్‌నాథ్, బద్రీనాథ్ రిషికేశ్‌లో ఆధ్యాత్మిక తీర్థయాత్రకు బయలుదేరారు. ఈ బృందం దైవిక ఆశీర్వాదం కోసం ఈ పవిత్ర యాత్రను చేపట్టింది. పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదార్‌నాథ్‌ను 'కన్నప్ప' టీం సందర్శించింది. ఆపై బద్రీనాథ్‌లో ప్రార్థనలు కూడా చేశారు. రిషికేశ్ సందర్శనతో వారి ప్రయాణం ముగిసింది.
ఈ సందర్భంగా విష్ణు మంచు మాట్లాడుతూ, 'కేదార్‌నాథ్, బద్రీనాథ్, రిషికేష్‌కు రావడం ఆనందంగా ఉంది. పరమ శివుడి పరమ భక్తుడి కథగా కన్నప్ప చిత్రం విడుదలకు ముందే మొత్తం 12 జ్యోతిర్లింగాలను సందర్శించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. మా ఎపిక్ యాక్షన్ చిత్రం విడుదల కోసం మేము ఎదురుచూస్తున్నాం' అని అన్నారు.
ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, శరత్ కుమార్‌తో సహా భారీ తారాగణం ఉంది. ఈ చిత్రం డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

దీపావళి కానుకగా రిలీజ్



శ్రీమురళి, రుక్మిణి వసంత్

'ఉగ్రమ్' ఫేమ్ శ్రీమురళి నటించిన నయా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బఘీర'. ప్రశాంత్ నీల్ కథ అందించిన ఈ చిత్రానికి డాక్టర్ సూరి దర్శకత్వం వహిస్తున్నారు. హోంబలే ఫిలింస్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ మూవీ ఈనెల 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఫస్ట్ సింగిల్, ట్రైలర్ ఇప్పటికే సంచలనాన్ని సృష్టించాయి. ఇప్పుడు సెకండ్ సింగిల్- పరిచయములే.. రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాట శ్రీమురళి, రుక్మిణి వసంత్ ప్రేమకథని ప్రజెంట్ చేసింది.
అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన ఈ హార్ట్ టచ్చింగ్ నెంబర్ రెండు పాత్రల మధ్య కెమిస్ట్రీని అందంగా చూపించింది. శ్రీమురళి టఫ్ పోలీసు ఆఫీసర్. స్త్రీలకు హాని కలిగించే వారిని కఠినంగా శిక్షిస్తుంటాడు. రుక్మిణి సున్నితమైన ప్రవర్తన కలిగిన డాక్టర్. రెండు డిఫరెంట్ వ్యక్తిత్వాలను పాటలో బ్యూటీఫుల్‌గా ప్రజెంట్ చేశారు. రాంబాబు గోసాల రాసిన లిరిక్స్ అందర్నీ ఆకట్టుకున్నాయి. రితేష్ జి రావు తన వోకల్స్‌తో మెస్మరైజ్ చేశారు. ఈ చిత్రాన్ని ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది.

వైభవంగా ఏఎన్నార్ జాతీయ పురస్కార వేడుక



చిరంజీవి, నాగార్జున

దిగ్గజ నటుడు అక్కినేని నాగేశ్వర రావు శత జయంతి గత నెల (సెప్టెంబర్ 20)న అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం ఏఎన్నార్ స్మారక ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది.
ఏఎన్నార్ లెగసీకి తగిన ట్రిబ్యూట్‌గా, భారతీయ సినిమాకి చేసిన అసాధారణ సేవలకు గుర్తింపుగా పద్మవిభూషణ్ అవార్డు పొందిన చిరంజీవికి ప్రతిష్టాత్మక ఏఎన్నార్ జాతీయ అవార్డును ప్రదానం చేయనున్నట్లు అక్కినేని కుటుంబం ప్రకటించింది.
ఈ నెల 28వ తేదీన జరగనున్న ఈ పురస్కార ప్రదానోత్సవానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.
ఈ అవార్డు వేడుకకు ఆహ్వానిం చేందుకు చిరంజీవిని నాగార్జున కలిశారు. ఈ ప్రతిష్టాత్మ ఏఎన్నార్ జాతీయ అవార్డును చిరంజీవికి బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ అందజేయనున్నారు.
'మా నాన్న ఏఎన్నార్ శత జయంతి వేడుకలు జరుపుకుంటున్న ఈ సంవత్సరం చాలా ప్రత్యేకమైనది. ఈ మైలురాయికి గుర్తుగా ఏఎన్నార్ అవార్డ్స్ 2024కి అమితాబ్ బచ్చన్, చిరంజీవిని ఆహ్వానించడం ఆనందంగా ఉంది. ఈ అవార్డు ఫంక్షన్‌ను మరపురానిదిగా చేద్దాం' అని నాగార్జున సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకున్నారు.
ఈ సందర్భంగా కొన్ని డిలైట్ ఫుల్ ఫోటోలని సోషల్ మీడియాలో ఆయన షేర్ చేశారు.
నాగార్జున, చిరంజీవిని ఒకే ఫ్రేమ్‌లో చూడటం అభిమానులకు స్పెషల్ ట్రీట్‌గా నిలిచింది. నాగార్జున, చిరంజీవి, అమితాబ్ బచ్చన్‌తోపాటు పలువురు ప్రముఖులు పాల్గొనే ఈ ఈవెంట్ విజువల్ ఫీస్ట్‌గా ఉండబోతోంది. ఏఎన్నార్ అవార్డుని గతంలో దేవానంద్, షబానా అజ్మీ, అంజలీ దేవి, వైజయంతిమాల బాలి, లతా మంగేష్కర్, కె. బాలచందర్, హేమమాలిని, శ్యామ్ బెనెగల్, అమితాబ్ బచ్చన్, ఎస్.ఎస్.రాజమౌళి, శ్రీదేవి, రేఖ తదితరులు సొంతం చేసుకున్నారు.

మరో అరుదైన గౌరవం

157 చిత్రాలు.. 537 పాటలు.. 24 వేల స్టెప్పులతో రికార్డ్ క్రియేట్ చేసి ప్రతిష్టాత్మక ఇటీవల గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌తో స్థానం సొంతం చేసుకున్న మెగాస్టార్ ఇదే ఏడాది మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకోబోతున్నారు. ఏఎన్నార్ శత శయంతి సందర్భంగా ఆయనకు ప్రతిష్టాత్మక ఏఎన్నార్ జాతీయ అవార్డుని ప్రదానం చేయబోతున్నారు.

భిన్న కాన్సెప్ట్‌తో జాతర



సతీష్‌బాబు, దీయా రాజ్

గల్లా మంజునాథ్ సమర్పణలో మూవీటెక్ ఎల్ఎల్‌సితో కలిసి రాధాకృష్ణ ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'జాతర'.
సతీష్ బాబు రాటకొండ నటిస్తూ, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సంబంధించి ఇది వరకు రిలీజ్ చేసిన ఫస్ట్‌లుక్ అందరినీ ఆకట్టుకుంది.
ఇంత వరకు ఎవ్వరూ టచ్ చేయని పాయింట్‌తో రగ్డ్‌గా, ఇంటెన్స్ డ్రామాతో ఈ చిత్రం రాబోతోంది. చిత్తూరు జిల్లా బ్యాక్‌డ్రాప్‌లో జరిగే జాతర నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా నవంబర్ 8న థియేటర్లోకి రాబోతోంది.
సతీష్ బాబు రాటకొండ, దీయా రాజ్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆర్.కె. పిన్నపాల, గోపాల్ రెడ్డి, మహబూబ్ బాషా, సాయి విక్రాంత్ ఇతర ముఖ్యతారాగణం. ఈ చిత్రానికి సమర్పణ : గల్లా మంజునాథ్, నిర్మాతలు : రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి, రచన, దర్శకత్వం : సతీష్ బాబు రాటకొండ, కెమెరామెన్ : కె.వి.ప్రసాద్, సంగీతం : శ్రీజిత్ ఎడవణ.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.